మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 91 • పేజీలు:12+16 • వెల: రూ.5 | గురువారం • 1-3-2018 | www.manamnews.com | /manamnews



మరో కంపెనీ..

రూ.3972 కోట్లు!

- బ్యాంకులకు రుణం ఎగవేత
- ఆస్తులమ్మితే రూ.1495 కోట్లే
- తలపట్టుకున్న 16 బ్యాంకులు
- కాన్పూర్‌లో మరో కంపెనీ టోపీ
- ఈసారి శ్రీలక్ష్మీ కాట్సన్ లిమిటెడ్

7లో..

ఎయిర్‌సెల్ దివాలా!

- 'ఎన్‌సీఎల్‌టీ'లో దరఖాస్తు దాఖలు
- పోటీ తట్టుకోలేక.. రుణాలు కట్టలేక..
- పిటిషన్‌లో డైరెక్టర్ల బోర్డు స్పష్టీకరణ

6లో..

జానాబాబా 40 దొంగలు

కాంగ్రెస్ బస్సు యాత్రపై కేటీఆర్ ధ్వజం

- ఒకరేమో కారు ఇంజిన్‌లో డబ్బుతో దొరికారు
- మరొకరేమో ఓటుకు నోటు కేసులో చిక్కారు
- పరోక్షంగా ఉత్తమ్, రేవంత్ రెడ్డిపై విసుర్లు
- చిత్తూరుకు 9 వేల కోట్లు కేటాయిస్తే తలూపారు
- నాటి సీఎం కిరణ్‌ను ఒక్కరూ నిలదీయలేదు
- నల్లగొండ ఫ్లోరైడ్ సమస్యను పట్టించుకోలేదు: మంత్రి



మద్దిరాల, ఫిబ్రవరి 28 (మనం న్యూస్):

కాంగ్రెస్ చేపట్టిన బస్సు యాత్ర ''జానాబాబా 40 దొంగల యాత్ర''లా ఉందని మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. ''ఒకరేమో ఎన్నికల సమయంలో కారు ఇంజిన్‌లో డబ్బుతో దొరికిపోయారు. మరొకరేమో ఓటుకు నోటు కేసులో చిక్కారు. వారంతా ఇప్పుడు బస్సుయాత్ర చేస్తున్నారు'' అని మండిపడ్డారు. నల్లగొండ జిల్లా మద్దిరాలలో బుధవారం 'తుంగతుర్తి ప్రగతి సభ'లో మంత్రి కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. ఫ్లోరోసిస్‌ను తరిమికొట్టేందుకు మిషన్ భగీరథను ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా 175 జనావాసాలకు మంచినీళ్లు ఇస్తున్నామన్నారు. రుద్రమదేవి చెరువు, వెంపటి చెరువును పూర్తి చేస్తమన్నారు. సమైక్య రాష్ట్రంలో నత్తలు కూడా సిగ్గుపడేలా మిగతా 6లో..



జయేంద్ర సరస్వతి శివైక్యం

కన్నుమూసిన కంచి కామకోటి పీఠాధిపతి

- నేటి ఉదయం బృందావన ప్రవేశ కార్యక్రమం
- చంద్రశేఖర సరస్వతి వారసుడిగా పీఠాధిపత్యం
- విజయేంద్ర సరస్వతికి జయేంద్రుని వారసత్వం
- ప్రపంచవ్యాప్తంగా కోట్లాది భక్తజనం
- ప్రధాని.. ఉప రాష్ట్రపతి.. సీఎంల సంతాపం
- 2004లో మేనేజర్ హత్య కేసులో అరెస్టు.. బెయిల్

కాంచీపురం, ఫిబ్రవరి 28: కంచి కామకోటి పీఠం 69వ పీఠాధిపతి జయేంద్ర సరస్వతి (82) శివైక్యం చెందారు. అనారోగ్యంతో బుధవారం ఉదయం కాంచీపురంలోని ఏబీసీడీ ఆస్పత్రిలో చేరి.. కార్డియాక్ అరెస్టుతో కన్నుమూశారు. దాదాపు 2520 సంవత్సరాల క్రితం మిగతా 6లో..

ఇదీలోకం!



ఎలాగూ ఫేస్‌బుక్, వాట్సాప్ ఉంటాయి కనుక జనం అందులోపడి చాలా సమస్యలు మరచిపోయి, మన దగ్గరకు రారు సార్..!



కార్తీ చిదంబరం అరెస్టు

ఒకరోజు సీబీఐ కస్టడీకి అనుమతి

- చెన్నై ఎయిర్‌పోర్ట్‌లోనే అదుపులోకి
- ఢిల్లీ తీసుకెళ్లి.. సీబీఐ కోర్టులో హాజరు
- ఇది రాజకీయ కక్ష సాధింపు: కార్తీ
- మోదీపై కాంగ్రెస్ నేతల విమర్శలు

6లో..

మళ్లీ రావా!

శ్రీదేవికి అశేష... అఖండ నీరా'జనం'






- దేశం నలుమూలల నుంచి అభిమానులు
- అంతిమయాత్రలో పోటెత్తిన జనసంద్రం
- అధికార లాంఛనాలతో తుది సంస్కారం
- సీఎస్‌సీ వద్ద తెల్లవారుజాము నుంచే రద్దీ

ముంబై, ఫిబ్రవరి 28:

ఆమె... చిలుక పలుకుల చిన్నారిగా కనిపించి ఆబాల గోపాలాన్ని మురిపించింది. తళుకుబెళుకుల జవ్వనిగా వెండి తెరను వెలిగించి యువతరాన్ని ఉర్రూతలూగించింది. కథానాయకులకు దీటుగా నటించి, కళాభిమానులను మెప్పించి నవరస నటరాజ్ఞిగా బహు భాషా ప్రేక్షకజన హృదయ సింహాసనం అధిష్టించింది. అర్ధ శతాబ్దంపాటు మిగతా 6లో..

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో శుక్రవారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతలో మార్పులేదు. రాత్రి ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గుతుంది. చలిగాలుల తీవ్రత తగ్గుతుంది. గంటకు 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 36 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 18 డిగ్రీలు

గాలిలో తేమ: 36 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి: చతుర్దశి ఉ.8.58 తదుపరి పౌర్ణమి; నక్షత్రం: మఖ రా.11.45 తదుపరి పుబ్బ; వర్జ్యం: మ.12.44-2.12; దుర్ముహూర్తం: మ.3.12-4.46; రాహుకాలం: మ.1.56-3.24; అమృతఘడియలు: రా.12.17-1.44; శుభసమయం: లేదు.

సూర్యోదయం: 6.38

సూర్యాస్తమయం: 6.19

ఈసారి గెలవకుంటే..

రాజకీయ సన్యాసం

ఓడితే మా కుటుంబం వైదొలగుతుంది.. మోదీ అంటే కేసీఆర్‌కు భయం



- ఆయన్ను చూస్తే గజగజ వణుకుతారు: ఉత్తమ్
- జహీరాబాద్‌లో 'జన చైతన్య యాత్ర' సభ
- టీఆర్ఎస్ పాలనలో అన్నీ సమస్యలే: కుంతియా
- గజ్వేల్‌లో కేసీఆర్‌పై పోటీకి సిద్ధం: కోమటిరెడ్డి

సంగారెడ్డి/ జహీరాబాద్, ఫిబ్రవరి 28 (మనం ప్రతినిధి):

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోతే తమ కుటుంబమంతా రాజకీయాల నుంచి తప్పుకుంటుందని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్‌రెడ్డి పునరుద్ఘాటించారు. 2019 ఎన్నికల్లో తమ పార్టీ తప్పకుండా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ విజయ దుందుభి మోగిస్తుందన్నారు. రాష్ట్ర మిగతా 6లో..



పొత్తులపై నిర్ణయం

- పార్టీని విలీనం చేసే ప్రసక్తే లేదు
- ఇకపై నెలకోసారి హైదరాబాద్‌కు
- కష్టపడితే ఇక్కడా పూర్వ వైభవం
- హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేశా
- ఇప్పుడు అమరావతిని నిర్మిస్తున్నా
- టీటీడీపీ సర్వసభ్య భేటీలో చంద్రబాబు


హైదరాబాద్, ఫిబ్రవరి 28 (మనం ప్రతినిధి):

టీ-టీడీపీని ఏ పార్టీలోనూ విలీనం చేయబోమని, పరిస్థితులకు అనుగుణంగా పొత్తులపై భవిష్యత్తులో నిర్ణయం తీసుకుంటామని పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు మిగతా 6లో..

గ్రూప్-2పై లాయర్ల కమిటీ

- 5వేల ఓఎంఆర్ షీట్ల పరిశీలన
- టాపర్లందరివీ చూసి తీరాల్సిందే
- వైట్‌నర్.. బబ్లింగ్‌పై ఆరోపణలు
- హైకోర్టు కీలక ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (మనం లీగల్ ప్రతినిధి): టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన గ్రూప్-2 పరీక్షల్లో వైట్‌నర్, బబ్లింగ్ వినియోగంపై ఆరోపణలు వచ్చిన దృష్ట్యా ఆ పరీక్షల్లో అగ్రస్థానంలో నిలిచిన 5 వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలిస్తామని హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. ఇందుకోసం ముగ్గురు సీనియర్ లాయర్లతో కమిటీని ఏర్పాటు చేస్తూ బుధవారం హైకోర్టు న్యాయమూర్తి పి.నవీన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. విచారణ వచ్చేనెల 19కి వాయిదా వేశారు. ఓఎంఆర్ షీట్లలో తప్పులున్నా, కొట్టివేతలున్నా, వైట్‌నర్ వాడినా, కిందివైపు పేర్లు రాసినా.. అలాంటివారిని అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ హైదరాబాద్‌కు చెందిన చరణ్‌దాస్ గోస్వామి.. మరో 20 మంది, రామచంద్రారెడ్డి.. మరో 14 మంది పలు వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఇదే సమయంలో వైట్‌నర్ వాడిన అభ్యర్థులు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నారని, వారి కోసం పరీక్షలపై స్టే ఇస్తే పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నష్టపోతారంటూ కూడా రిట్లు దాఖలయ్యాయి. వీటిని బుధవారం హైకోర్టు మరోసారి విచారణ జరిపి న్యాయవాదులతో కమిటీ ఏర్పాటు చేసి అగ్రస్థానంలో ఉన్న అయిదు వేల మంది ఓఎంఆర్ షీట్లను పరిశీలించాలని ఆదేశించింది. సీనియర్ లాయర్లు నిరంజన్‌రెడ్డి, రఘునందన్‌రావు, రఘురామ్ కమిటీలో ఉంటారని, ఈ కమిటీ శని,



ఆదివారాల్లో అయిదు వేల ఓఎంఆర్ సీట్లను పరిశీలించాలని ఆదేశించారు. అందుకు అనుగుణంగా ఓఎంఆర్ షీట్లను అందుబాటులో ఉంచాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను న్యాయమూర్తి ఆదేశించారు. కమిటీ టాప్‌లో ఉన్న అయిదు వేల మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను పరిశీలించి.. వాటిలో నిబంధన మేరకు ఎన్ని ఉన్నాయో, సర్వీస్ కమిషన్ నిబంధనల్ని ఉల్లంఘించినవి ఎన్ని ఉన్నాయో తేల్చాలని న్యాయమూర్తి ఆదేశించారు. సర్వీస్ కమిషన్ రికార్డులను కూడా పరిశీలించాలని ఆదేశించారు. ఈ కమిటీ సమగ్రంగా పరిశీలించి పూర్తి నివేదికను అందజేయాలని కమిటీని ఆదేశించారు. తదుపరి విచారణను మార్చి 19వ తేదీ సోమవారానికి వాయిదా వేశారు. తొలుత కేసు విచారణ ప్రారంభం కాగానే వైట్‌నర్ వాడరాదని సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్‌లో స్పష్టంగా ఉందని, అయినా కొంతమంది వైట్‌నర్ వాడారని, అదే విధంగా బబ్లింగ్ జరిగిందని పిటిషనర్ న్యాయవాదులు చెప్పారు. వైట్‌నర్ వినియోగించిన జవాబుపత్రాల్ని కంప్యూటర్లు ఆమోదించబోవని చెప్పిన సర్వీస్ కమిషన్.. ఆ తర్వాత వాటిని ఎలా ఆమోదించిందో అర్థం కావడం లేదన్నారు. చట్టప్రకారం హైకోర్టు తగిన ఆదేశాలిస్తే అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరుగుతుందన్నారు. 1032 పోస్టుల భర్తీ కోసం 1:3 నిష్పత్తిలో 3093 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోందన్నారు. అనంతరం అడ్వకేట్ జనరల్ ప్రకాష్‌రెడ్డి వాదిస్తూ.. ఓఎంఆర్ షీట్లను పరిశీలించేందుకు కమిటీ ఏర్పాటు చేస్తామంటే తమకు అభ్యంతరం లేదన్నారు. దాంతో కమిటీని ఏర్పాటు చేసిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను మార్చి 19వతేదీకి వాయిదా వేశారు.

ఎక్కడి చోద్యం.. మెప్పు కోసమేనా

- రూ. 30 కోట్లకు పైగా బొగ్గు ఉత్పత్తికి విఘాతం: కార్మిక సంఘాల నేతలు
- వేతనాల రూపంలో రూ. కోట్లలో నష్టం

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): శతాబ్దానికిపైగా ఘన చరిత్ర కలిగిన సింగరేణి కాలరీస్ కంపెనీలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. సింగరేణిలోనే ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి పర్యటనకు యాజమాన్యం సెలవు ప్రకటించి చరిత్ర సృష్టించింది. కేవలం ముఖ్యమంత్రి మెప్పు కోసమే యాజమాన్యం కార్మికులకు సెలవు ప్రకటించిందని పలు కార్మిక సంఘాలు విమర్శిస్తున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం కోల్‌బెల్ట్‌లోని రామగుండం, బెల్లంపల్లి ఏరియాలో పర్యటించారు. ఈ సందర్భంగా సింగరేణి యాజమాన్యం ఆయా ఏరియాల్లోని బొగ్గు బాయి కార్మికులకు సెలవు ప్రకటించింది. గతంలో రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ కొత్తగూడెం బొగ్గు బావుల్లో పర్యటించారు. ఈ సందర్భంలోనూ కార్మికులకు సెలవు ఇచ్చిన దాఖలాలు లేవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయంలో పలువురు ముఖ్యమంత్రులు పర్యటించిన సందర్భాల్లోనూ కార్మికులకు ఏనాడు సెలవు ప్రకటించలేదు. ప్రధానంగా డిసెబర్ నుంచి మార్చి చివరి నాటి వరకు సింగరేణిలో ఉత్పత్తి మాసాలుగా యాజమాన్యం ప్రకటిస్తుంది. నిర్దేశిత వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు గానూ ఆ నాలుగు నెలల్లో ప్రత్యేక ప్రోత్సాహకాలను యాజమాన్యం ప్రకటిస్తుంది. సెలవులు లేకుండా బొగ్గు ఉత్పత్తిలో భాగస్వామ్యం అయ్యే కార్మికులకు యాజమాన్యం ప్రత్యేక ఇన్సెంటివ్‌లను ప్రకటించటం ఆనవాయితీ. అంతే కాకుండా కార్మిక సమస్యలపై కార్మిక సంఘాలు ఈ నాలుగు నెలల్లో సమ్మెకు నోటీసులు ఇస్తే యాజమాన్యం సమ్మెను విరమింప చేసేందుకు ముమ్మరంగా చర్యలు చేపడ్తుంది. సమ్మెతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగుతుందని, కార్మికులు వేతనాలు కోల్పోతారని యాజమాన్యం పేర్కొంటుంది. ఈ ఆర్థిక సంవత్సరానికి గానూ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యం సాధించేందుకు యాజమాన్యం విస్తృత చర్యలు చేపట్టింది. ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సింగరేణిలోని 11 ఏరియాల జీఎంలపై యాజమాన్యం ఒత్తిడి చేపడ్తుందని పలువురు అధికారులు వాపోతున్నారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనలో భాగంగా ప్రతి రోజు 2.40 లక్షల టన్నులను వెలికి తీసే విధంగా యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. కాగా ఆయా ఏరియాల్లో కార్మికులకు సెలవు ప్రకటించడం మూలంగా దాదాపు 40శాతానికిపైగా బొగ్గు ఉత్పత్తికి విఘాతం కల్గిందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. కార్మికులకు సెలవు ప్రకటించడం మూలంగా దాదాపు రూ. 30 కోట్లకు పైగా బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగినట్లు పలు కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. దీనికి తోడు కార్మికులకు వేతనాల రూపంలో రూ. కోట్లలో సింగరేణిపై ఆర్థిక భారం పడిందని నేతలు ఆరోపిస్తున్నారు.



కార్మికులకు ఒరిగిందేమీ లేదు: వర్కర్స్‌యూనియన్

ముఖ్యమంత్రి పర్యటన వల్ల కార్మికులకు పెద్దగా ఒరిగిందేమీ లేదని సింగరేణి కాలరీస్ వర్కర్స్‌యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శి కె. సారయ్య విమర్శించారు. కారుణ్య నియామకాలపై సరైన స్పష్టత ఇవ్వలేదన్నారు. మెడికల్ బోర్డుకు దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం చేయటంలో యాజమాన్యం, ముఖ్యమంత్రి విఫలమయ్యారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బొగ్గు గని కార్మికులకు ఆదాయపు పన్ను రద్దు చేయించటంలో టీఆర్ఎస్ ఎంపీలు విఫలమయ్యారన్నారు. సింగరేణి చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఒక ముఖ్యమంత్రి పర్యటనకు కార్మికులకు సెలవు ఇవ్వటం సీఎండీ శ్రీధర్‌కే చెల్లిందన్నారు. ఆదివారం కార్యక్రమం పెట్టుకునే అవకాశం ఉన్నా ముఖ్యమంత్రి మెప్పు కోసం సీఎండీ సెలవు ఇచ్చారని విమర్శించారు.



దొరతనానికి నిదర్శనం: ఇఫ్టూ

ముఖ్యమంత్రి కేసీఆర్ కోల్‌బెల్ట్ పర్యటన సందర్భంగా కార్మికులకు సెలవు ఇవ్వటం దొరతనానికి నిదర్శనమని ఇఫ్టూ జాతీయ అధ్యక్షులు సాధినేని వెంకటేశ్వర్‌రావు ఆరోపించారు. మెడికల్ బోర్డులో నీమ్స్, గాంధీ వైద్యశాలల వైద్యులను బోర్డులో పెడ్తామనటం అన్యాయమని అన్నారు. కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదన్నారు. సీఎండీ ముఖ్యమంత్రి తొత్తుగా మారారని విమర్శించారు. వందలాది బస్సులను యాజమాన్యం పెట్టిందన్నారు.

సీఎం ఆదేశాలను అమలు చేయని సీఎండీ: హెచ్ఎమ్మెస్

సీఎం పర్యటనతో పెద్దగా ఒరిగిందేమీ లేదని హెచ్ఎమ్మెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆరోపించారు. కార్మికులకు ఉచిత కరెంటు జాడలేదన్నారు. హామీకి పరిమితమైందని ఆరోపించారు. సీఎం ఆదేశాలిచ్చిన అమలులో సింగరేణి సీఎండీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మికుల అలీయాస్ పేర్ల విషయంలో న్యాయం చేస్తామని సీఎం ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. కార్పొరేట్ డాక్టర్లను బోర్డులో పెట్టడం కార్మికులకు అన్యాయం చేసేందుకేనని విమర్శించారు. హైదరాబాద్‌లో పైరవీలు ప్రారంభమవుతాయని తెలిపారు. మెడికల్ బోర్డుకు చైర్మన్ అయిన డైరెక్టర్ పర్సనల్‌తో పాటు అధికారులు ఉంటారు, కాని కేవలం సింగరేణి డాక్టర్లనే బాధ్యులను చేయటం అన్యాయమన్నారు. సీఎండీ కిరికిరిల సర్క్యులర్లను విడుదల చేస్తున్నారని ఆరోపించారు.

భారతదేశ చరిత్రలోనే...: ఎంప్లాయిస్ యూనియన్

భారతదేశ చరిత్రలోనే ఒక ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా బొగ్గు గని కార్మికులకు సెలవు ఇవ్వటం సింగరేణి యాజమాన్యానికే చెల్లిందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహరావు ఆరోపించారు. కార్మికుల సమస్యలపై పోరాడే సమయంలో సమ్మె చేస్తే వేతనంలో కోత విధిస్తామంటూ హెచ్చరించే యాజమాన్యం కేవలం ముఖ్యమంత్రి పర్యటనకు సెలువు ఇవ్వటం ఎంత వరకు సమంజసమన్నారు. ఎన్నికల సమయంలో కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలే ఇంత వరకు నెరవేరలేదన్నారు. వారసత్వ ఉద్యోగాలు ఇస్తామన్నారు. కుంటి సాకులతో కాలం వెళ్లబుచ్చుతున్నారని విమర్శించారు. సెలవు రోజైన ఆదివారం పర్యటనను పెట్టుకుంటే కార్మికులు ఎక్కువగా రారని యాజమాన్యం సెలవు ప్రకటించిందన్నారు.

సీఎం హోలీ శుభాకాంక్షలు

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. రంగుల పండగ హోలీని ప్రతిఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

తెలంగాణ ఉద్యమంలో ముందుండి నడిపించారు

- జర్నలిస్టులకు మండలి చైర్మన్ స్వామిగౌడ్ ప్రశంసలు
- సంక్షేమ నిధి లబ్దిదారులకు చెక్కుల పంపిణీ

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమానికి జర్నలిస్టులు రెండడుగులు ముందుండి నాయకులను నడిపించారని శాసనమండలి చైర్మన్ స్వామిగౌడ్ ప్రశంసించారు. మరణించిన జర్నలిస్టు కుటుంబాలకు అండగా ఉండడంతోపాటు వారి సంక్షేమానికి భరోసా కల్పించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. బుధవారం నాంపల్లిలోని తెలుగు వర్సిటీలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి ద్వారా 74 మంది లబ్దిదారులకు రూ.65.50 లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థకు మీడియా నాలుగో స్థంభమని చెప్పారు. చిన్న పత్రికల మనుగడకు కృషి చేయాలని తెలంగాణ మీడియా అకాడమీకి సూచించారు. రాజ్యసభ సభ్యుడు కే.కేశవరావు మాట్లాడుతూ... జర్నలిస్టుల సంక్షేమంతోపాటు వృత్తిపరమైన శిక్షణకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. జర్నలిస్టుల శిక్షణ కార్యక్రమాల ద్వారా వృత్తిలో నైపుణ్యం పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సలహాదారు కేవీ.రమణాచారి మాట్లాడుతూ... జర్నలిజం వృత్తిగా ఉన్న వ్యక్తికి అక్రిడిటేషన్ అవసరమని తెలిపారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ మాట్లాడుతూ... జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.100 కోట్ల మూల నిధిని సమకూరుస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందని ఇలాంటి ప్రయత్నం ఏ రాష్ట్రంలోనూ జరుగలేదని తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 16793 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేసినట్టు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు హెల్త్ కార్డులను ఇచ్చినట్టు పేర్కొన్నారు. కర్నాటకలో అతితక్కువ సంఖ్యలో అక్రిడిటేషన్లు ఉన్నాయన్నారు. కర్ణాటక మీడియా అకాడమీ చైర్మన్ సిద్దరాజు మాట్లాడుతూ... జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందించారు. ఈ సందర్భంగా సిద్దరాజును అల్లం నారాయణ, పాలక మండలి సభ్యులు శాలువా, మెమోంటోతో సత్కరించారు.

కందుల కొనుగోళ్లు కొనసాగించాలి: పొంగులేటి

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): మార్చి చివరి వరకు కందుల కొనుగోళ్లు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం కందుల కొనుగోళ్లు నిలిపి వేస్తున్నట్లు ప్రకటించినందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని శాసన మండలిలో కాంగ్రెస్ పక్ష ఉప నాయకుడు పొంగులేటి సుధాకర్ రెడ్డి కోరారు. ఇప్పటి వరకు కొనుగోలుచేసిన వాటికి రైతులకు వెంటనే డబ్బులు చెల్లించాలని బుధవారం నాడు ఆయన అసెంబ్లీలోని మీడియా హాల్‌లో విలేకరులతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు. నగద కొరత లేకుండా రిజర్వ్ బ్యాంక్‌తో సంప్రదించాలని కోరారు. విలేకరులు కూడా పోలీసుల అనుమతితోనే వెళ్లాలని చెప్పడం నియంతృత్వానికి పరాకాష్ట అని విమర్శించారు. మార్కెట్‌లో రైతులు తమ సమస్యలు చెప్పుకునే పరిస్థితిలేదని చెప్పారు. ఖమ్మం మార్కెట్‌లో ఆంక్షలు ఎత్తివేయాలని పొంగులేటి డిమాండ్ చేశారు.

టీటీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నేత బండి పుల్లయ్య తన అనుచరులతో కలిసి తెలంగాణ తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన టీటీడీపీ సర్వసభ్య సమావేశంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు పుల్లయ్యకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ.. పుల్లయ్య వంటి నేతలు పార్టీలోకి రావడం శుభ పరిణామమన్నారు. చిత్తశుద్ధితో కష్టపడితో పార్టీకి తెలంగాణలో పునర్వైభవం సిద్ధిస్తుందని కార్యకర్తలను ఉత్తేజపరిచారు. జనగామకు చెందిన నాయకుడు కత్తుల రాంరెడ్డి, చొప్పదండికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు గజ్జెల ఆనంద్‌కు చంద్రబాబు కండువా కప్పి పార్టీ సభ్యత్వం అందజేశారు.

ఏఐసీసీ కమిటీలో పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ ప్లీనరి కోసం రాహుల్ గాంధీ రెండు కమిటీలను ప్రకటించారు. ఇందులోని డ్రాఫ్టింగ్ కమిటీలో తెలంగాణ నుంచి మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ నుంచి కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజుకు చోటు కల్పించారు. ఆర్గనైజింగ్ కమిటీకి మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ చైర్మన్‌గా, కన్వీనర్‌గా ముకుల్ వాస్నిక్‌ను రాహుల్ గాంధీ నియమించారు. ఈ కమిటీలో 44 మంది సభ్యులు ఉంటారు. ఆర్గనైజింగ్ కమిటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రాల ఇంచార్జ్‌లను నియమించారు.

FORM IV
(See Rule 8)

1. Place of Publication	: Hyderabad, Karimnagar, Nizamabad, Nalgonda, Maboobnagar, Warangal, Khammam, Amaravathi, Tirupati, Kurnool, Tadepalligudem, Vishakapatnam, Anantapur, Kadapa
2. Periodicity of its publication	: Daily
3. RNI Registration No.	: TELTEL/2016/72952
4. Printers Name	: Vuppari Ramesh Kumar
whether Citizen of India	: Yes
(If foriegner, state the country of origini)	: -
Address	: H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd, 4th & 5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016,Telangana State and owned by Navatharam Publications Private limited, Hyderabad
5. Publishers Name	: Vuppari Ramesh Kumar
Whether Citizen of India	: Yes
Address	: H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd, 4th & 5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016,Telangana State and owned by Navatharam Publications Private limited, Hyderabad
6. Editor	: Vuppari Ramesh Kumar
Whether Citizen of India	: Yes
(If foreigner, state the country of origin)	: -
Address	: H.No:6-3-864/4/B, SBN Arcade, 2nd, 4th & 5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016,Telangana State and owned by Navatharam Publications Private limited, Hyderabad
7. Name & Address of Individuals who own the newspaper and partners or Sharholders holding morethan one percent of the total capital	: Navatharam Publication Private Limited 1. Vuppari Ramesh Kumar, 2. Sarada Devi Botta, 3. Sumanth Botta, 4. Chandra Shekara Sarma Samayamanthri

I, Vuppari Ramesh Kumar hereby declare that the particular given above are true to the best of my knowledge and belief .

Sd/-
Vuppari Ramesh Kumar
Publisher

March 1st, 2018

కందులను కొనండి

- ప్రతి జిల్లాకో 'కేవీకే' ఏర్పాటు చేయండి
- కేంద్ర మంత్రికి పోచారం వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి రాధామోహన్‌సింగ్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం కేంద్ర మంత్రి రాధామోహన్‌సింగ్‌తో మంత్రి పోచారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి సీఎం కేసీఆర్ చేపట్టిన పథకాలకు కేంద్రం సాయం అందించాలని మంత్రి పోచారం విన్నవించారు. రాష్ట్రంలో ఈసారి 2.50 లక్షల టన్నుల కందుల దిగుబడి వచ్చిందని, కేంద్రం కేవలం 75 వేల టన్నులు మాత్రమే కొనుగోలుకు అనుమతించిందని, మిగిలిన కందులనూ కొనుగోలు చేయాలని కోరారు. రాష్ట్రంలో 2630 క్లస్టర్లను ఏర్పాటు చేశామని, ప్రతి క్లస్టర్‌లో రైతు సమావేశ వేదికలను నిర్మించడానికి ఆర్థిక సాయం అందించాలని పేర్కొన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం కోసం రూ.100 కోట్లు అందించాలని తెలిపారు.



ఉపాధిని అనుసంధానించాలి: పోచారం

గామీణ ఉపాధి హామీ చట్టాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలని మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్(ఐసీఏఆర్) 89వ వార్షిక సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతు యూనిట్‌గా మార్చాలని, నకిలీ విత్తన నిరోధక చట్టాన్ని త్వరగా తీసుకురావాలన్నారు. పంటలు, డిమాండ్‌కు అనుగుణంగా క్రాప్ కాలనీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రతీ రైతు భూమికి కచ్చితంగా భూసార పరీక్ష చేయలని చెప్పారు. భూమికి అనుకూలమైన, అధిక దిగుబడిని ఇచ్చే వంగడాలను రైతులకు అందించాలని కోరారు. సేద్యపు ఖర్చులకు అనుగుణంగా కనీస మద్దతు ధరలను ప్రకటించాలని, సహజ పంటలతో పాటు వాణిజ్య పంటలైన మిర్చి, పసుపు పంటలకు మద్దతు ధరను ప్రకటించాలని పేర్కొన్నారు. రైతులకు అధిక ఆదాయం అందించడానికి అగ్రీ ప్రాసెసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను నెలకొల్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రాధామోహన్‌సింగ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కొత్తగా ఏర్పడినా.. వ్యవసాయ రంగం అభివృద్ధికి అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు రైతు సంక్షేమానికి చేస్తున్న కృషి.. దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శమన్నారని తెలిపారు. ప్రధానంగా రైతులకు ముందస్తు పెట్టుబడిగా ఎకరాకు రూ.4వేలు ఇవ్వడం దేశంలోనే ప్రథమమని ప్రశంసించినట్టు చెప్పారు.


క్రిస్టియన్, మైనారిటీల కోసమే సంక్షేమ పథకాలు

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): క్రిస్టియన్, మైనారిటీల సంక్షేమం కోసమే తెలంగాణ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో క్రిస్టియన్, మైనారిటీ అధికారులు సనత్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ చర్చిల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చర్చిలు, గ్రేవ్‌యార్డులలో బోర్‌వెల్ ఏర్పాటుకోసం మరమ్మతులు, అభివృద్ధి పనులు, టాయిలెట్లు, ప్రహరీ గోడల నిర్మాణానికి క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా నిధులను విడుదల చేస్తున్నట్టు వివరించారు. నియోజకవర్గంలోని చర్చిలు, గ్రేవ్‌యార్డుల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను గుర్తించేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఈ కమిటీకి మంత్రి సలహాదారుగా ఉండాలని నిర్ణయించారు.

ధరల చెల్లింపు వివాదాన్ని పరిష్కరిస్తాం

క్యూబ్/యూఎఫ్ఓ సంస్థల నిర్వహకులకు, సినీ ఎగ్జిబిటర్లకు ధరల చెల్లింపు విషయంలో ఏర్పడిన వివాదాన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని సినీమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. ఎఫ్‌డీసీ చైర్మన్ రాంమోహన్‌రావు ఆధ్వర్యంలో సౌత్ ఇండియా ఫిలిం చాంబర్, తెలుగు ఫిలిం చాంబర్, తెలంగాణ ఫిలిం చాంబర్ ప్రతినిధులు బుధవారం మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్యూబ్/యూఎఫ్ఓ సంస్థలు ధరలను పెంచడాన్ని నిరసిస్తూ మార్చి 2 నుంచి దక్షిణ భారతదేశంలో సినిమాల ప్రదర్శనను నిలిపివేయనున్నట్లు మంత్రికి తెలిపారు. తలసాని స్పందిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం సినీరంగ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. ఎగ్జిబిటర్లకు, క్యూబ్ ఆపరేటర్లకు మధ్య వివాదాన్ని నివారించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



ఫిలిం చాంబర్ ప్రతినిధులతో మంత్రి తలసాని సమావేశం

తొలిరోజు ప్రశాంతం

- ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు
- 'నిమిషం'తో పలువురు పరీక్షకు దూరం
- పలుచోట్ల విద్యార్థి సంఘాల ఆందోళన

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్ష తొలి రోజు ప్రశాంతంగా పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే! మొత్తంగా 1294 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించగా.. నిమిషం నిబంధన కారణంగా పలువురు విద్యార్థులు పరీక్షకు దూరమయ్యారు. ముందుగా ప్రకటించిన విధంగానే ఉదయం 8.45 గంటల నుంచి విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఆపై 15 నిమిషాల గ్రేస్ పీరియడ్‌తో 9 గంటల వరకు విద్యార్థులను లోపలికి అనుమతించినట్టు అధికారులు తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడలోని వాగ్దేవి జూనియర్ కాలేజీలో ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను నిర్వాహకులు పరీక్షకు అనుమతించలేదు. దీంతో పలు విద్యార్థి సంఘాలు ఆందోళన చేయగా, పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కానీ విద్యార్థినిని మాత్రం పరీక్షకు అనుమతించలేదు.

సమయానికే వచ్చా..: రమాదేవి

నిర్ణీత సమయానికి కేంద్రానికి చేరుకున్నా కానీ రూం నెంబరు వెతుక్కోవడంలో ఆలస్యమైందని కోదాడకు చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని రమాదేవి తెలిపారు. దీంతో నిమిషం నిబంధన పేరు చెప్పి తనను పరీక్షకు హాజరుకాకుండా సిబ్బంది అడ్డుకున్నారని ఆరోపించారు. పరీక్ష రాయనివ్వాలంటూ ఎంత వేడుకున్నా.. అధికారులు వినిపించుకోలేదని తెలిపారు.



మారేడుపల్లిలో ఆర్టీసీ బస్సు బ్రేక్‌డౌన్ కావడంతో ఇంటర్ విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు తీసుకెళుతున్న పోలీసులు

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ: కడియం

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): పదో తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావివ్వకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి పేర్కొన్నారు. ఈ విషయంలో సమన్వయంతో పనిచేయాలంటూ అధికారులకు సూచించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సచివాలయంలో బుధవారం 31 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, డీఈఓలు, ఇతర అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. సుదూర, ఏజెన్సీ ప్రాంతాల్లోని పరీక్షా కేంద్రాలకు ప్రత్యేక బందోబస్తు కల్పించాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, వైద్య వసతులను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షా సమయానికి ముందే కేంద్రాల వద్దకు విద్యార్థులు చేరుకునేలా అవగాహన కల్పించాలని చెప్పారు. రవాణకు సంబంధించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్రాల్లోకి మొబైల్స్‌ను అనుమతించొద్దని, జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని అధికారులను ఆదేశించారు. ప్రశ్న, జవాబు పత్రాల తరలింపు సమయంలో పోలీసులు ఎస్కార్ట్‌ను కల్పించాలని సూచించారు.



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఎర్రోళ్ల ప్రమాణం

- దళితుల అభ్యున్నతికి కృషి చేస్తా : శ్రీనివాస్
- చట్టాల అమలు బాధ్యత కమిషన్‌దే: కడియం
- ఉద్యమకారులకు గుర్తింపు: నాయిని, జగదీశ్‌రెడ్డి. హరీశ్‌రావు

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ఎర్రోళ్ల శ్రీనివాస్ బుధవారం భాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ప్రమాణిస్వీకార కార్యక్రమానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, జగదీశ్‌రెడ్డి, హరీశ్‌రావు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎర్రోళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తనను చైర్మన్‌గా ఎంపిక చేసిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కమిషన్ చైర్మన్‌గా దళితుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. దళితుల సంక్షేమ కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులకు చేరవేస్తానని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాల్సిన బాధ్యత కమిషన్‌దే అన్నారు. చిన్న వయసులోనే ఎర్రోళ్ల శ్రీనివాస్ కమిషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సరిగా పనిచేయలేదన్నారు. అనంతరం మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, జగదీశ్ రెడ్డి, హరీశ్‌రావు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీనివాస్ పోరాటం మరువలేనిదన్నారు. ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికోసం రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలు అర్హులైన వారికి అందేలా కమిషన్ సభ్యులు కృషి చేయాలన్నారు. బంగారు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో కమిషన్ పనిచేయాలని వారు ఆకాంక్షించారు. అన్యాయం జరిగిన చోట కమిషన్ ఉండాలని, రాజకీయాలకోసం కాకుండా ప్రజలకోసమే కమిషన్ పనిచేయాలని మంత్రులు అన్నారు.

విద్యార్థులకు సీవీ రామన్ ఆదర్శం: జోగు

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): సర్ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు పరిశోధనలు చేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న సూచించారు. హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన నేషనల్ సైన్స్ డే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సైన్స్ అండ్ టెక్నాలజీ సేవలను విస్తరించనున్నామన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పరిశోధనల కోసం విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో విద్యార్థులను ప్రోత్సహించాలని నిర్ణయించామన్నారు. విద్యార్థులు చేసిన పరిశోధనల్లో ఎనిమిది ఉత్తమ పరిశోధనలను ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన పరిశోధనలకు రూ.25 వేల నగదు బహుమతి ఇస్తామన్నారు. విద్యార్థులు పరిశోధనల్లో రాణించి సర్ సీవీ రామన్‌లా తయారు కావాలని పిలుపునిచ్చారు. డిజిటల్ ఆర్థిక లావాదేవీల నిర్వహణ, ఆన్‌లైన్‌లో గుర్తింపు కార్డులు పొందడం వంటి వాటిపై రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ కార్యక్రమాలు చేపడతామన్నారు. మూఢనమ్మకాలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని చెప్పారు. అనంతరం జాతీయ స్థాయి అవార్డులు సాధించిన బాల శాస్త్రవేత్తలు అరీబా అయ్యేన్, మహేందర్‌రెడ్డిను మంత్రి జోగు రామన్న సన్మానించారు.

మహిళా దినోత్సవం విజయవంతం కావాలి

- వేడుకల ఏర్పాట్లపై మంత్రి తుమ్మల సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరిక 28(మనం ప్రతినిధి): మార్చి 8న నిర్వహించే ప్రపంచ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. మహిళా దినోత్సవ ఏర్పాట్లపై సచివాలయంలో బుధవారం తుమ్మల అధ్యక్షతన సెలబ్రేషన్ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ వేడుకల వేదిక ఎక్కడ ఏర్పాటు చేయాలన్న అంశంతోపాటు, గతేడాది వేడుకల నిర్వహించిన లలిత కళా తోరణాన్ని మరోమారు పరిశీలించాలని అధికారులకు సూచించారు. మహిళా దినోత్సవాన్ని జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో జరిపేందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని సాయంత్రం 5 గంటలలోపు ముగించాలని, వచ్చిన మహిళలందరికీ కావల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన మహిళలను గుర్తించే బాధ్యతను రమణాచారి, రసమయి బాలకిషన్, మామిడి హరికృష్ణకు అప్పగించారు. మార్చి 2న ఈ కమిటీ మరోసారి భేటీ కానుందని తెలిపారు. భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసి కేంద్రం నుంచి ప్రశంసలు పొందిన హైదరాబాద్ జిల్లా అధికారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కేవీ. రమణాచారి, రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్, మామిడి హరికృష్ణ, తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్‌లు సువర్చల, సురభి వాణి, రేవతి, అఖిలేశ్వరి, సూర్య ధనంజయ పాల్గొన్నారు.

సైన్స్, టెక్నాలజీ జీవితంలో భాగం


- జేఎన్‌టీయూ వీసీ వేణుగోపాల్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): నిత్య జీవితంలో సైన్స్, టెక్నాలజీ ఓ భాగం అయ్యాయని జేఎన్‌టీయూ హైదరాబాద్ ఉపకులపతి ప్రొఫెసర్ ఏ.వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో 'స్టార్టప్ అవేర్‌నెస్' పేరుతో బుధవారం ఒక్క రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలకు కార్యరూపంలోకి తీసుకురావాలని సూచించారు. యూనివర్సిటీలో ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించామని, దానిలో విద్యార్థులందరూ పాల్గొని తమ ఆలోచనలపై చర్చించాలన్నారు. సర్వే ఆఫ్ ఇండియా పూర్వ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణ సుబ్బారావు మాట్లాడుతూ నేటి ప్రపంచంలో సైన్స్, టెక్నాలజీకి అవినాభావ సంబంధం ఉందన్నారు. టెక్నాలజీ సాయంతో వాతావరణ పరిస్థితులు, మార్పులు ఏ విధంగా అధ్యయనం చేయాలో వివరించారు. ఐఎస్‌టీ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ సమతుల్య పర్యావరణ సంరక్షణ, అభివృద్ధికి సైన్స్ ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలిపారు.

వా'టిస్' దిస్?

టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో ఫీజు గోల.. యూజీసీ నిధుల కోతతో చేతులెత్తేసిన యాజమాన్యం

- ఫీజులు చెల్లించమంటూ విద్యార్థులకు ఆదేశాలు
- ఆర్థిక భారంతో చదువుకు దూరం కానున్న విద్యార్థులు
- ఆమరణ నిరాహార దీక్షకు దిగిన హైదరాబాద్ స్టూడెంట్స్





హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): ఎంతోమంది నిరుపేద విద్యార్థుల కలలను సాకారం చేసే విద్యాలయం అది. ఉచితంగా ఉన్నత విద్య అందించడంతో ఎందరి జీవితాలను మార్చింది. అక్కడ సీటు దొరికితే చాలు జీవితంలో స్థిరపడినట్లే అనేది చాలా మంది భావన. అక్కడ సీటు కోసం పెద్ద ఎత్తున పోటీ. ఇదంతా టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్(టిస్) చరిత్ర. కానీ కొద్ది రోజులుగా ఇనిస్టిట్యూట్‌పై అవినీతీ మరకలు పడ్డాయి. విద్యా సంవత్సరం మధ్యలో ఫీజులు చెల్లించండని యాజమాన్యం విద్యార్థుల నెత్తిన బండ వేసింది. దేశవ్యాప్తంగా నాలుగు ప్రాంతాల్లో ఉన్న టిస్ ఇనిస్టిట్యూట్ క్యాంపస్‌ల్లో విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న కళాశాల విద్యార్థులు ఏకంగా ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. విద్యార్థులకు పలు విద్యార్థి సంఘాల మద్దతు తెలపడంతో విషయం వేడెక్కింది.

80శాతం ప్రభుత్వ రాయితీ

టిస్ యాజమాన్యం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు వంద శాతం ఫీజులో 80 శాతం మొత్తాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తున్నాయి. మిగిలిన 20 శాతం ఫీజును సంస్థ యాజమాన్యం భరిస్తోంది. విద్యార్థుల నుంచి నామమాత్రపు ఫీజులను మాత్రం వసూలు చేస్తారు. అయితే విద్యార్థులకు అందిస్తోన్న ఫీజు రాయితీని ఉపసంహరించుకోవాలని 2016లో యాజమాన్యం భావించింది. అందులో భాగంగానే ప్రతి విద్యార్థి హాస్టల్, ట్యూషన్ ఫీజు, డైనింగ్ హాల్ ఫీజు చెల్లించాలని 2017 విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రకటించింది. అప్పటికే అడ్మిషన్ల ప్రక్రియ నడుస్తోంది. అయితే నోటిఫికేషన్‌లో మాత్రం ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని యాజమాన్యం పేర్కొంది. అందుకు అనుగుణంగానే విద్యార్థులు సిద్ధమయ్యారు. ఇతర కాలేజీల్లో ప్రవేశాలు దొరికినా.. ఇక్కడ అడ్మిషన్ ఉందనే కారణంతో చాలా మంది టిస్‌లోనే చేరారు. తీరా ఫీజు చెల్లించాల్సిందేనంటూ యాజమాన్యం తేల్చిచెప్పడంతో చాలా మంది విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

అధిక శాతం పేదలే..

దేశవ్యాప్తంగా ఉన్న టిస్ క్యాంపస్‌ల్లో చదువుతున్న విద్యార్థుల్లో అధిక శాతం మంది నిరుపేదలే ఉంటారు. ఉచితంగా ఉన్నత స్థాయి విద్య లభిస్తుండడంతో నిరుపేద వర్గానికి చెందిన విద్యార్థులు కూడా ప్రవేశం కోసం ప్రయత్నిస్తుంటారు. ప్రస్తుతం యాజమాన్యం చెబుతున్న లెక్కలు ప్రకారం.. ఒక్కో విద్యార్థి ఒక సెమిస్టర్‌కు సగటున రూ.80 వేలు చెల్లించాల్సి వస్తోంది. రెండేండ్ల కాలంలో ఇవన్నీ కలుపుకుంటే ఒక్కో విద్యార్థిపై రూ.3 లక్షల వరకు భారం పడుతుంది. యాజమాన్యం నిర్ణయం వల్ల చాలా మంది విద్యార్థులు చదువుకు స్వస్తి పలికే యోచనలో ఉన్నారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పించాలని కోరుతూ విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. దీనిపై ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులు విద్యా సంవత్సరాన్ని కోల్పోనున్నారు.

నాలుగు క్యాంపస్‌లు.. అర్హత పరీక్ష

టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్(టిస్)కు దేశవ్యాప్తంగా నాలుగు క్యాంపస్‌లు ఉన్నాయి. హైదరాబాద్, ముంబై, గౌహతి, తుల్జాపూర్‌లో క్యాంపస్‌లు ఉన్నాయి. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో యూజీ, పీజీ, పీహెచ్‌డీ విభాగాల్లో పలు కోర్సులు అందిస్తారు. సోషల్ సైన్సెస్‌కు సంబంధించి విద్యార్థులకు తరగతి గదుల్లోనే కాకుండా క్షేత్రస్థాయిలోనూ శిక్షణను అందిస్తారు. ఆయా కోర్సుల్లో ప్రవేశం కోసం జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో అర్హత సాధించి ప్రవేశం పొందిన విద్యార్థులు ఎలాంటి ఫీజు చెల్లించనక్కర్లేదు.

యూజీసీ బడ్జెట్‌లో కోత..

టిస్‌లో విద్యను అభ్యసిస్తోన్న విద్యార్థులకు సంబంధించిన ఫీజులను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భరించేవి. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత అనంతరం విద్యార్థి నుంచి సంబంధిత దరఖాస్తు అందగానే సాంఘీక సంక్షేమ శాఖ ఫీజులను విడుదల చేసేది. 2016 వరకు ఇలానే జరిగింది. విద్యార్థులు దరఖాస్తు అందజేసిన అనంతరం యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్(యూజీసీ) నుంచి ఫీజులు వసూలు చేసుకోవాల్సిన బాధ్యత టిస్ యాజమాన్యానిదే. కానీ ఇటీవల యూజీసీ బడ్జెట్‌లో కోతలు విధించింది. దీనికితోడు ఫీజుల చెల్లింపులోను తీవ్ర జాప్యం నెలకొంటుంది. దీంతో టిస్ యాజమాన్యం ఇక ప్రభుత్వాన్ని నమ్ముకుంటే కష్టమని భావించి.. ఫీజులను విద్యార్థులే చెల్లించాలని ప్రకటించింది. 2016-18, 2017-19 మాస్టర్స్ డిగ్రీకి చెందిన విద్యార్థులు ప్రస్తుతం హైదరాబాద్ బ్రాంచ్‌లో 400 మందికి వరకు ఉన్నారు. వీరందరూ ప్రస్తుతం ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే వీరి ప్రవేశాలకు ప్రకటించిన నోటిఫికేషన్‌లో మాత్రం ఫీజులు చెల్లించాలనే నిబంధన ఎక్కడా లేదు. అడ్మిషన్ల సమయంలో మాత్రమే ఫీజులు చెల్లించాలని చెప్పారు. అప్పటికే అన్ని యూనివర్సిటీల్లో సీట్లు భర్తీ పూర్తి కావడంతో పాటు విద్యా సంవత్సరం వృథా అవుతుందనే ఉద్దేశంతో విద్యార్థులు కాలేజీలో చేరారు. దీనిపై ఆరు నెలలుగా పోరాడుతూనే ఉన్నారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలువురు విద్యార్థుల కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రిని కూడా కలిశారు. విద్యార్థులు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన పని లేదని మంత్రి హామీ కూడా ఇచ్చారు. కానీ నేటికి సమస్య పరిష్కారం కాలేదు.

ఇబ్బడిముబ్బడిగా ఫీజులు..

టాటా ఇనిస్టిట్యూట్‌లో అందిస్తున్న కోర్సులకు మరెక్కడా లేని విధంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. అధికారుల అలసత్వమో.. పాలకుల అండదండలో గానీ.. ఇన్నాళ్లు ప్రభుత్వం డబ్బు అందజేస్తుండడంతో విద్యార్థుల పేరుతో ఇబ్బడిముబ్బడిగా ఫీజులు రాబట్టుకున్నారు. ఇప్పుడు యూజీసీ కొర్రీలు పెట్టడంతో విద్యార్థుల నుంచి దండుకునేందుకు సిద్ధమయ్యారు. సోషల్ సైన్సెస్‌కు సంబంధించిన కోర్సుల్లో ఏ యూనివర్సిటీలోనూ ఈ స్థాయిలో ఫీజులు వసూలు చేయడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

రైతన్నకు అండగా ఉండాలి

- దేశంలో రైతు పరిస్థితి బాలేదు
- రైతుకు సాయంపై ప్రభుత్వం భేష్
- టీఆర్ఎస్ సర్కారుకు అమ్మ ప్రశంస
- ప్రాజెక్టుల నిర్మాణం సత్సంకల్పం
- మాతా అమృతానందమయ దేవి ఆశీర్వచనం
- సత్యం, శాంతి మార్గాలే ప్రధానం: హరీశ్‌రావు



హైదరాబాద్, ఫిబ్రవరి 28: అందరికీ అన్నం పెట్టే రైతన్నకు అవసరమైన వసతులు సమకూర్చడం సమాజం బాధ్యతని, తెలంగాణ ప్రభుత్వం దీనిని గొప్పగా నెరవేరుస్తోందని సద్గురు శ్రీ మాతా అమృతానందమయ దేవి ప్రశంసించారు. సముద్రం పాలవుతున్న నీటిని కాళేశ్వరంలాంటి ప్రాజెక్టుల ద్వారా ఒడిసిపట్టి పంటపొలాలకు మళ్లించడం గొప్ప ప్రయత్నమని అభినందించారు. అందరికీ అన్నంపెట్టే రైతులు ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితి మారాలని అభిప్రాయపడ్డారు. మాతా అమృతానందమయ దేవి భక్తకోటికి అమ్మగా సుపరిచితురాలు. భారతదేశ యాత్రలో భాగంగా అమ్మ తెలంగాణలో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో సికింద్రాబాద్‌లోని మాతా అమృతానందమయి మఠం(అమ్మ ఆశ్రమం)లో అమ్మ బుధవారం భక్తులకు దర్శనమిచ్చి, ఆశీర్వచనం అందజేశారు. అమ్మ రాకకు సంబంధించి సమాచారం తెలిసి మంత్రి హరీశ్‌రావు మఠానికి వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. తెలంగాణలో ప్రాజెక్టులు త్వరగా పూర్తయి, రైతులకు సాగునీరు అందేలా ఆశీర్వదించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా మాతా అమృతానందమయ దేవి తెలంగాణ నీటి పారుదల ప్రాజెక్టుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాళేశ్వరం, పాలమూరు ఎత్తిపోతల పథకాల గురించి, మిషన్ కాకతీయ గురించి, తెలంగాణలో వ్యవసాయాభివృద్ధి, రైతు సంక్షేమంకోసం సీఎం కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను హరీశ్ రావు వివరించారు. దీనికి అమ్మ స్పందిస్తూ రైతన్నకు అంతా అండగా ఉండాలని సూచించారు. కానీ దేశంలో రైతుల పరిస్థితి బాగాలేదని, ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలకు తాము ఆర్థిక సహాయం అందిస్తున్న విషయాన్ని అమ్మ తెలిపారు. తమ మఠం నుంచి అందరికీ మంచి ఆరోగ్యం, మంచి వైద్యం అందించడం, పరిశుభ్రమైన వాతావరణంలో జీవించడంకోసం అవసరమైన వసతులు కల్పిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. దేశవ్యాప్తంగా అనేక గ్రామాలను దత్తత తీసుకుంటున్నట్లు వివరించారు. తెలంగాణలో కూడా 20 గ్రామాలను దత్తత తీసుకుంటామని వెల్లడించారు. తెలంగాణలో ప్రతీ ఇంటికి సురక్షిత మంచినీరు అందించేందుకు మిషన్ భగీరథ పథకం అమలు చేయడం మంచి నిర్ణయమన్నారు. బహిరంగ మల విసర్జనలేని ప్రాంతంగా సిద్దిపేట నియోజకవర్గం చరిత్రలో నిలిచిందని, తెలంగాణ అంతటా ఇదే ఒరవడి కొనసాగించాలని సూచించారు. ప్రజలకు మంచి విద్య, వైద్యం అందించడానికి పాలకులు కృషి చేయాలని చెప్పారు.

సత్యం, శాంతి మార్గాలే ప్రధానం: మంత్రి హరీశ్‌రావు

మాతా అమృతానందమయి మఠం సందర్శించిన సందర్భంగా హరీశ్ రావు అక్కడి భక్తులతో మాట్లాడారు. ఇప్పుడు సమాజానికి కావల్సింది శాంతి మార్గం, సత్య మార్గమే అన్నారు. ఈ సన్మార్గాన్ని అందిస్తున్నందునే సద్గురు శ్రీ మాతా అమృతానందమయ దేవిని దేశమంతా అమ్మగా పిలుస్తోందన్నారు. అమ్మ చేసిన సేవ, అమ్మ చూపిస్తున్న ప్రేమ మానవ జాతికి మంచి సందేశమన్నారు. ఒత్తిడిని జయించడానికి శాంతి, సహనం ప్రధానమన్నారు. తోటి మానవుల హితంకోరి చేసే పనులే మనల్ని చరితార్థులను చేస్తాయన్నారు. ఈ దిశగా సమాజంలో పరివర్తన తేవడానికి అమ్మ చేస్తున్న కృషి తప్పక ఫలిస్తుందని హరీశ్‌రావు ఆశాభావం వ్యక్తం చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రావు

గొల్లకుర్మల అభివృద్ధే సీఎం లక్ష్యం

- దేశంలో ఎక్కడా లేని విధంగా గొర్రెల పంపిణీ
- సామూహిక గొర్రెల షెడ్లు సద్వినియోగం చేసుకోండి
- రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేట, ఫిబ్రవరి 28 (మనం న్యూస్): రాష్ట్రంలో గొల్లకుర్మల ఆర్థికాభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట కొండాభూదేవి గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన గొర్రెల అభివృద్ధి పథకంపై నియోజకవర్గ స్థాయి అవగాహన సదస్సుకు మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం యాదవులకు గొర్రెల పంపిణీ చేపట్టిందన్నారు. గతంలో గొర్రెలను కొనుగోలు చేయాలంటే రుణాల కోసం బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన ప్రతి ఒక్కరికీ గొర్రెలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గొల్లకుర్మల అభివృద్ధికి సీఎం కేసీఆర్ రూ.2,600 కోట్లు వెచ్చించారన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గొల్లకుర్మకు సామూహిక సంఘాలను కట్టివ్వడం, గ్రామాల్లో సామూహిక గొర్రెల షెడ్‌లను నిర్మించామని, గొల్లకుర్మలు ముందుకు వస్తే మరిన్ని షెడ్‌ల నిర్మాణానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. గొర్రెల షెడ్ల నిర్మాణానికి రూ.88,500 చొప్పున సబ్సిడీ ఇస్తామన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 48 లక్షల 58 వేల గొర్రె పిల్లలను పంపిణీ చేశామన్నారు. వీటిలో 300 గొర్రె పిల్లలు చనిపోగా వాటికి సంబంధించిన చెక్కులకు బదులుగా తిరిగి గొర్రె పిల్లలను అందిస్తామని తెలిపారు. రానున్న వేసవిలో గొర్రె పిల్లలకు కావాల్సిన దాణాను ప్రభుత్వం తరపున ఒక్కొక్క యూనిట్‌కు 2 క్వింటాళ్ల చొప్పున అందజేస్తున్నామన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారుల పని తీరుపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాదవశాత్తు మరణించిన గొర్రె కాపర్లకు రూ.6 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సదస్సులో జడ్పీ చైర్మన్ రాజమణి, మురళీ యాదవ్, ఉడుత మల్లేశం, వంగ నాగిరెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి అంజయ్య, డా. లక్ష్మారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

గురువారం, మార్చి 1

కంచి స్వామి శివైక్యం

మిథ్యా జగత్తు నుంచి కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి శివైక్యం పొందారు. బుధవారం ఉదయం ఊపిరి పీల్చలేక గుండెపోటుతో బాధపడుతున్న 82 ఏళ్ల జయేంద్ర సరస్వతిని కాంచీపురంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. 1935 జూలై 18న తమిళనాడులోని తంజావూరు జిల్లా ఇరునీకల్ గ్రామంలో ఆయన జన్మించారు. గత కొంతకాలంగా అస్వస్థతతో బాధపడుతూ కొన్ని నెలలుగా ఆయన మఠంలో నిర్వహించే కార్యక్రమాలను నిర్వర్తించడం లేదు. జయేంద్ర సరస్వతి మహాభినిష్క్రమణంతో విజయేంద్ర సరస్వతి మఠం పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. జయేంద్ర సరస్వతి పార్థివ శరీరాన్ని కంచిపీఠానికి తరలించారు. గురువారం జయేంద్ర సరస్వతి పార్థివ శరీరానికి అంత్యక్రియలు జరుగుతాయి. మఠ నియమాల ప్రకారం ఖననం మాత్రం జరుగుతుంది.

జయేంద్ర సరస్వతి అసలు పేరు సుబ్రమణియన్ మహదేవన్ అయ్యర్. ఆయన కంటే ముందు పీఠాధిపతిగా ఉన్న చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామిజీ 1954 మార్చి 22న జయేంద్ర సరస్వతిని మఠం ఉత్తరాధికారిగా ప్రకటించారు. అనంతరం చంద్రశేఖరేంద్ర సరస్వతి మహాభినిష్క్రమణం తరువాత జయేంద్ర సరస్వతి 1994లో కంచిపీఠం 69వ పీఠాధిపతిగా బాధ్యతలు స్వీకరించారు. జయేంద్ర సరస్వతి హయాంలో మఠం తీరుతెన్నులు మారిపోయాయి. తనకున్న ఆధునిక భావాలతో మఠాన్ని కేవలం మతపరమైనదిగానే కాకుండా ఎన్నో ధార్మిక కార్యక్రమాలతో పాటు మఠం ఆర్థికపుష్టికి ఎంతో కృషిచేశారు. హిందూ మతం అభివృద్ధికి ఆయన్ని ఒక చిహ్నంగా చెప్పుకునేవారు. ఒక దశలో రాజకీయ నాయకుడిలా వ్యవహరించేవారు, ఆయనలో ఉన్న ఆధునిక భావాలు ఆయన్ని ఒక్కోసారి రాజకీయ నాయకుడి పాత్రలోకి మార్చేసేవి. కంచిమఠం ఆధ్వర్యంలో ఆయన అనేక కళాశాలలు, విద్యాసంస్థలను నెలకొల్పారు. 'శంకర' పేరుతో పలు రాష్ట్రాల్లో ఆయన శంకర నేత్ర చికిత్సాలయాలను ప్రారంభించారు. ఆయనకు ముందు పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతి హయాంలో ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధికెక్కిన మఠం అనంతర కాలంలో ఎన్నో ఆరోపణలతో మసకబారింది. ఆయనపై ఒక మహిళపట్ల అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలు సైతం ఆయన ఎదుర్కొన్నారు.

దేశాన్ని కట్టికుదిపేసిన రామ్‌జన్మభూమి - బాబ్రీ మసీదు (అయోధ్య) సమస్య పరిష్కారానికి జయేంద్ర సరస్వతి మధ్యవర్తిగా కృషిచేశారు. 1998-2004 అటల్ బీహారీ వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఆయన అయోధ్య సమస్య పరిష్కారానికి రెండు వర్గాలతోను చర్చలు జరిపారు. ఆయన తరచుగా లౌకిక అంశాలను ప్రస్తావించేవారు. 2004లో కంచిలోని వరదరాజస్వామి దేవాలయ మేనేజర్ శంకరరామన్ హత్యకేసులో ఆయన నిందితుడిగా ఉండడం భక్తులను నివ్వెరపరిచింది. ఆయన్ని అప్పటి జయలలిత నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం అరెస్టుచేసింది. హత్యకేసులో నిందితుడిగా జైలు జీవితాన్ని అనుభవించారు. కంచిమఠం ఆస్తుల వ్యవహారాలకు సంబంధించి వివాదంలో జయలలిత కక్షపూరితంగా ఆయన్ని అరెస్టు చేయించారని అప్పట్లో పుకార్లు వచ్చాయి. ఆ కేసు తమిళనాడు నుంచి పాండిచ్చేరికి బదిలీ అయింది. చివరకు ఆయనతో పాటు విజయేంద్ర సరస్వతి సహా మరో 21 మందిపై చార్జిషీటు దాఖలైంది. 2013లో పాండిచ్చేరి ప్రత్యేక న్యాయస్థానం ఆయన్ని, ఆయన శిష్యులను నిర్దోషులుగా ప్రకటించింది. ఆయన మతపర కార్యక్రమాలే కాకుండా ఎన్నో సామాజిక కార్యక్రమాలను కూడా నిర్వర్తించారు. దళితవాడల్లో పర్యటించారు. తమిళనాడులో పర్యటించే ఏ జాతీయ నాయకుడైనా చివరకు ప్రధాని, రాష్ట్రపతి, మరెవరైనా కంచిపీఠాన్ని దర్శించకుండా తిరిగి వెళ్లేవారు కాదు. కంచిపీఠం అంత శక్తిమంతమైన పీఠం కావడంతో సహజంగానే హిందూ అభిమానులకు అదొక పుణ్యస్థలంగా మారిపోయింది. ప్రస్తుతం దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో కంచి పీఠం వంటి వాటి బాధ్యత ఎంతో ఉంది. గుజరాత్ ద్వారకలోని పశ్చిమాన్వయ మఠం, ఉత్తరాఖండ్‌లోని ఉత్తరాన్మయమఠం, కర్ణాటక శృంగేరి మఠం, ఒడిశా పూరీలోని పూర్వాన్మయ మఠం, ఐదోది కంచి కామకోటి పీఠం అనే దేశంలో ఐదు పీఠాలను జగద్గురు ఆది శంకరాచార్యులు స్థాపించారని చెబుతారు. మిగిలిన నాలుగు మఠాలకన్నా కంచికామకోటి పీఠం సుప్రసిద్ధమైనది. అయితే జయేంద్ర సరస్వతి హయాంలోనే కళంకం తెచ్చే ఆరోపణలు ఎదుర్కోవడం దురదృష్టకరం.


ప్రపంచంలోని అనేక తాత్విక ధోరణుల్లో అద్వైత తాత్విక ధోరణికి విశిష్ట స్థానం ఉంది. ఆదిశంకరాచార్యులు రూపొందించిన అద్వైతం ఆనాడు సమకాలీన సంక్షుభిత భారతీయ సమాజంలోని అంతర్వైరుధ్య పరిస్థితులను చక్కదిద్దేందుకు కీలక భావజాల భూమికను ఏర్పరచడమే కాక సమాజంలో శాంతియుత వాతావరణ పరిస్థితులు ఏర్పడేందుకు రాజకీయ ఐక్యతను సాధించేందుకు కీలకంగా కృషి చేసింది. ఈ కృషి కొన్ని అతివాద హింసాత్మక చర్యలు కూడా వెలుగు చూసినట్లుగా కథనాలు ఉన్నప్పటికీ, ఆదిశంకరుని కాలంలో అద్వైతం ఒక సామాజిక, రాజకీయ, భావజాల ఐక్యత సాధించడంలో ప్రధాన భూమిక పోషించింది. భారతీయ తత్వశాస్త్రంలో అద్వైతం, సామాజిక తాత్వికతలో విశిష్టాద్వైతం ప్రపంచ మానవజ్ఞానాభివృద్ధి చరిత్రలో విశిష్ట స్థానాలను కలిగి ఉన్నాయి. అలాంటి వారసత్వానికి కేంద్రంగా పీఠాలు సమకాలీన సమాజంలో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది. మతం ఉద్వేగాలకు, విద్వేషాలకు లోనవకుండా, తాత్వికత పరిధులు దాటకుండా చూసుకోవలసిన బాధ్యత మఠాలకు, మఠాధిపతులకు ఉంది. అద్వైత తాత్విక సంప్రదాయాన్ని సమకాలీన సంక్షుభిత ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా ఒకమెట్టు అభివృద్ధి చేసి, ప్రజలకు అందించవలసిన బాధ్యతను నెరవేర్చడంలో జయేంద్ర సరస్వతి ఒకింత వెనకబడినప్పటికీ, సేవాకార్యక్రమాలు నిర్వహించడం ద్వారా స్ఫూర్తినిచ్చారు.

రక్త 'సిరియా'ళుల దయలేని ప్రపంచం!

కవిత

చిన్నప్పుడు మా నాన్న
భక్త సిరియాళుడి కథ చెప్పేవాడు
ఇప్పుడు బతికుంటే
బాలల్ని బాంబుల్లో వేసి
దంచుతున్న
ఆ ఘోరాన్ని కళ్లారా వీక్షించి
ఈ రక్త సిరియాళుల
కథ ఎన్ని సార్లు చెప్పేవాడో
భయం భక్తి లేకుండా పోయిన
మానవ సమూహాలు
పూల మొగ్గల్ని ఛిద్రం చేయడం
చూసి తట్టుకునే వాడో కాదో
విరిగిపడుతున్న
బతుకు శిథిలాలవానలో
చిన్నారి కలలు
ఖండ ఖండాలవుతున్న
హృదయ విదారక దృశ్యాలు
సజీవ సమాధులవుతున్న
తల్లి ప్రేమలు కన్నీటి సముద్రంలో
తలకిందులవుతున్న
గంపెడాశలు
లేత కలలు తెగిపడుతున్న
యుద్ధ భూమి సిరియాను
తలుచుకుని
ఎంతగా కుమిలిపోయేవాడో
ఒక దేశం బతకాలంటే
ఒక భవిష్యత్తు బతకాలి
విరిసీ విరియని మొగ్గలున్న
పూలతోటలే సంరక్షించబడాలి
కఠిన శిలలు మొలిచిన
మానవ మృగాల దేహాలను ఒలిచి
కాస్తంత కరుణను తొడగాలని
మనిషిని ప్రేమించే గుణాన్ని
ముఖ్యంగా పిల్లల్ని
గుండెల్లో పొదువుకునే
ఒక్క కొత్త దేశాన్ని
చిన్నారుల రక్తంతో
తడుస్తున్న నేల మీద
ప్రేమారా నాటాలని
తప్పక వాపోయేవాడు
ఆ రక్త సిరియాళులను
అక్కున చేర్చుకోమని చెప్పే
నా ఈ కొత్త కవితను చదివి
ఈ దయలేని ప్రపంచానికి
మళ్లీ మళ్లీ వినిపించేవాడు!

- చిత్తలూరి



మంచిమాట



'సత్యం పలకడానికి వేలవేల మార్గాలున్నాయి. అన్నీ వాస్తవమైనవే.'

- స్వామి వివేకానంద

సిరియా నరమేధం

భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా మత, జాతి, కుల తదితర రూపాల్లో విద్వేషకాండలను, మారణహోమాలకు కారణమవుతున్న సామ్రాజ్యవాద శక్తులకు, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పరస్పర సహకారంతో ఎక్కడికక్కడ ప్రజాపోరాటాలు పెల్లుబికితేనే ప్రపంచ శాంతికి మార్గం సుగమం అవుతుంది.

ప్రతిఫలనం

వెన్నెలకంటి రామారావు




సిరియాలో భయానక నరసంహారం సాగుతోంది. ఎక్కడ చూసినా శవాల గుట్టలు, పసిపిల్లలు, మహిళలు, క్షతగాత్రుల ఆర్తనాదాలతో యుద్ధ కేంద్రిత తూర్పు గౌటా నగరమంతా భూలోక నరక కూపంలా మారింది. బషర్ అల్ అసద్ ప్రభుత్వ బలగాలకు, ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటు దారులకు మధ్య భీకర ఆధిపత్య పోరుతో జనావాసాలు మృత్యు కాసారాలుగా మారాయి. తిరుగుబాటుదారుల గుప్పిట్లో ఉన్న గౌటాను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అసద్ ప్రభుత్వ బలగాలు వారం రోజులుగా జరుపుతున్న దాడుల్లో రెండువందల మందికి పైగా పిల్లలు సహా ఏడు వందల మంది పౌరులు మరణించారు. వేలాదిగా క్షతగాత్రులయ్యారు. మానవ కవచాలుగా పౌరులను తిరుగుబాటుదారులు వినియోగించుకుంటుంటే, జనావాస ప్రాంతాలపై ప్రభుత్వ బలగాలు వైమానిక, రసాయనిక ఆయుధాలతో అమానుషంగా చేస్తున్న దాడుల్లో ప్రజలు బలైపోతున్నారు. సిరియాలో అనేక ప్రాంతాల్లో అపజయాన్ని చవిచూసిన ప్రభుత్వ వ్యతిరేక శక్తులన్నీ గౌటాలో కేంద్రీకృతమై ఉండడంతో ఆ నగరంపై ప్రభుత్వ బలగాలు భీకర దాడులకు తలపడ్డాయి.

జనావాసాలు లక్ష్యం కాకూడదు

నిజమే యుద్ధం లేదా అంతర్యుద్ధమంటే ఆషామాషీగా, అలవోకగా చేసే వినోదక్రీడ కాదు. రాజకీయాధిపత్యం కోసం విభిన్న సామాజిక వర్గ శక్తులు నిర్దాక్షిణ్యంగా ఒకరినొకరు నిర్మూలించుకునే రక్తసిక్త కార్యకలాపమే యుద్ధం. అయితే సులభ లక్ష్యాలుగా ఉన్న ప్రజలపై రక్తపాతాన్ని సృష్టించడం యుద్ధ నియమం కారాదు. అంతర్యుద్ధాల్లో పరస్పరం తలపడుతున్న వైరిపక్షాల రాజకీయ దృక్పథాలను (వర్గ, మత, జాతి తదితర) బట్టి యుద్ధ స్వభావం, ప్రజలకు తలపడే విరుద్ధ శక్తులకు మధ్య సంబంధం ఆధారపడి ఉంటుంది. సాధారణంగా కార్మికవర్గ వర్గ దృక్ప థంతో తలపడే సాయుధ శక్తులకు పాలకవర్గాలు, వారి కోసం పనిచేస్తున్న సాయుధ బలగాలు లక్ష్యమైతే, జాతి లేదా మత లేదా ఆధిపత్యవర్గ దృక్పథంతో కొట్లాడే శక్తులకు తాము శత్రువుగా భావించే కార్మిక వర్గ పోరాట సంస్థలు, వారికి మద్దతు ఇచ్చే ప్రజలు లేదా జాతీయులందరూ యుద్ధ లక్ష్యాలుగా మారుతారు. దాంతో అంతర్యుద్ధం భీకర వర్గపోరాటంగాను లేదా జాత్యహంకార మారణకాండగాను పరిణమిస్తుంది. సిరియాలో నడుస్తున్న ఈ యుద్ధంలో ఏ శక్తి గెలిచినా ప్రజలకు ఏ మేరకు ఉపయోగ పడగలదన్నది సందేహమేగానీ, యుద్ధం పేరుతో వారికి భూలోక నరకాన్ని చూపిస్తున్నందుకు ఇరుపక్షాలను చరిత్ర క్షమించదు. గౌటా నగర మృత్యు క్షేత్రంలో చిక్కుకున్న నాలుగు లక్షల మంది ప్రజల ప్రాణాలకు ఎలాంటి విలువ లేకపోవడంపై అంతర్జాతీయ సమాజం తీవ్రంగా ప్రతి స్పందించింది.

యుద్ధంలో గాని, సాయుధ అంతర్యుద్ధం జరుగుతున్న సందర్భంలో ప్రజలతో సాయుధ శక్తులు



వ్యవహరిస్తున్న తీరును పౌర/మానవ హక్కుల పరిధిలో మాత్రమే ప్రశ్నించడంతో సరిపోదు. సాధారణ ప్రజా ఉద్యమాలపై జరిగే ప్రభుత్వ నిర్బంధం పౌర హక్కుల పరిధిలోకి వస్తుంది. అదే రెండు సాయుధ శక్తుల మధ్య సాగే యుద్ధ స్వభావం (సాయుధ పోరాటం) ఐక్యరాజ్య సమితి యుద్ధ నియమాలకు అనుగుణంగా ఉన్నాయా లేక జనహనన రసాయనిక, జీవ రసాయనిక, నాపాం/డర్టీ బాంబు (అణు ధూళి)/ అణుబాంబుల వంటి వాటిని వినియోగిస్తున్నాయా అనే అంశాల పునాదిగా ఆ దేశ/ప్రాంత ప్రజల హక్కుల కోసం డిమాండ్ చేయవలసి ఉంటుంది.

గౌటా కోసమే ఈ దాడులు

సిరియా రాజధాని డమస్కస్ శివారు నగరమైన గౌటా 2013లో ప్రభుత్వ బలగాల ఆధీనంలో ఉండేది. అయితే మిగతా ప్రాంతాల్లో చావుదెబ్బ తిన్న మిలిటెంట్లు వేల మంది, సాధారణ పౌరులతో కలగలసిపోయి గౌటా నగరంలోకి చొరబడ్డారు. 2017 నాటికి గౌటానగరం తిరుగుబాటుదార్ల వశమైంది. తహ్రీర్ అల్‌షమ్, అల్ రహమాన్ లీజియన్, జైష్ అల్ ఇస్లామ్ అనే గ్రూపులు తరచూ పరస్పరం ఆధిపత్య పోరు కొనసాగిస్తూ, ప్రభుత్వ బలగాలతో తలపడుతుండడంతో జనజీవనం మృత్యువిలయంగా మారింది. డమాస్కస్‌కు 10 కిలోమీటర్ల దూరంలో వంద చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఉన్న గౌటా నగరంపై పట్టు సాధించడం ప్రభుత్వ బలగాలకు కీలకం. 'తక్షణమే సిరియాలో కాల్పుల విరమణ ఒప్పందం అమలు చేయాలి' అని ఐక్య రాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం చేసినా, సంతకం చేసిన రష్యా ప్రత్యక్ష సహకారంతో అస్సాద్ ప్రభుత్వ సాయుధ బలగాలు భీకర బాంబు దాడులను కొనసాగిస్తూనే ఉన్నాయి. 'రోజుకు ఐదు గంటలపాటు కేటాయించిన దాడుల విరామ సమయం' లోనూ దాడులు కొనసాగుతూనే ఉండడంతో గౌటా యుద్ధ క్షేత్రంలో నెత్తురు ఏరులా పారుతోంది. అమెరికా మిత్రపక్షాలు సిరియా-రష్యా అమానుష సైనిక దాడుల్ని తీవ్రంగా ఖండిస్తున్నా, తెర వెనుక తిరుగుబాటుదారులకు సహాయం చేస్తూనే ఉన్నాయన్న మీడియా కథనాలు ఉన్నాయి.

ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనల నుంచి...

భౌగోళిక ఆధిపత్య రాజకీయ మృత్యుక్రీడ నేడు సిరియా కేంద్రంగా సాగుతోంది. 2011లో మధ్య ప్రాచ్యంలో సుదీర్ఘకాలంగా పాలన సాగిస్తున్న నిరంకుశ రాజ్యాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు 'అరబ్ వసంతం' పేరుతో వెల్లువెత్తాయి. ఆ క్రమంలోనే సిరియాలో అసద్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాంతియుతంగా ప్రారంభమైన నిరసన ప్రదర్శనలు హింసాత్మకంగా అణచివేతకు గురయ్యాయి. అసద్ ప్రభుత్వం వైదొలగాలని ప్రారంభమైన శాంతియుత నిరసనోద్యమం క్రమంగా అమెరికా సారథ్యంలోని నాటో కూటమి సహకారంతో సాయుధ పోరాట మార్గాన్ని చేపట్టింది. సిరియాలో అంతర్యుద్ధం అనేక ముఠాల మధ్య నిరంతరాయంగా, భీకరంగా సాగుతోంది. సిరియా ప్రభుత్వం, దాని మిత్ర పక్షాలకు 'ఫ్రీ సిరియన్ ఆర్మీ', ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ లెవంట్ (ఐఎస్ఐఎల్ లేదా ఐఎస్ఐఎస్ - ఇస్లామిక్ స్టేట్), ప్రభుత్వ/తిరుగుబాటుదారులకు మద్దతుగా సరిహద్దు దేశాలకు చెందిన సాయుధ మూకలు ఇలా అనేక ముఠాలు పరస్పరం యుద్ధం చేస్తున్నాయి. అసద్ ప్రభుత్వానికి మద్దతుగా ఇరాన్, రష్యా, హిజ్‌బుల్లా సంస్థలు పనిచేస్తున్నాయి. 2015 నుంచి తిరుగుబాటుదారులకు వ్యతిరేకంగా రష్యా వైమానిక దాడులు నిర్వహిస్తున్న నాటి నుంచి సిరియాలో మానవత్వ సంక్షోభం క్రమంగా పరాకాష్ఠకు చేరింది. మరో వైపు, అమెరికా సైనిక బలగాల కూటమి ఇస్లామిక్ స్టేట్ మిలిటెంట్ల స్థావరాలపైనే కాక, రష్యా అనుకూల అసద్ ప్రభుత్వాన్ని గద్దె దించే లక్ష్యంతో ప్రభుత్వ సైనిక స్థావరాలపై కూడా వైమానిక దాడులు చేస్తోంది.

ఐక్యరాజ్య సమితి యత్నాలు విఫలం

సిరియా అంతర్యుద్ధానికి చరమగీతం పాడేందుకు 2017 నుంచి ఐక్యరాజ్య సమితి శాంతి చర్చలు ప్రారంభించినా ప్రయోజనం శూన్యం. 2008 నుంచి సాగుతున్న ప్రపంచ ఆర్థిక సంక్షోభం పర్యవసానంగా ఫాసిస్టు/అర్థ ఫాసిస్టు/ఫాసిస్టు ధోరణి గల ప్రభుత్వాలు ఉనికిలోకి వచ్చాయి.

ఇది ఇక్కడితో ఆగుతుందా?

అమెరికా ఏకధ్రువ ప్రపంచాన్ని సవాలు చేస్తూ రష్యా, ఈయూల దన్నుతో సామ్రాజ్యవాద కాంక్షతో దూకుడుగా ముందుకొస్తున్న చైనా కూటమికి మధ్య సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం భూగోళంపై మరెన్ని సిరియా తరహా మారణహోమాలకు దారితీస్తుందో చెప్పలేము. మొదటి ప్రపంచయుద్ధ కాలంనాటి పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయని విశ్లేషకుల అంచనా. సరికొత్త రూపంలో సాగుతున్న సమకాలీన ప్రచ్ఛన్న యుద్ధ సన్నివేశాన్ని, దాని పర్యవసానాలను నివారించేందుకు ప్రపంచ శాంతికోసం మరోసారి అంతర్జాతీయ రాజకీయ యవనికపై 1960ల నాటి ప్రపంచవ్యాప్త అంతర్యుద్ధానికి ప్రజలు ఐక్యంగా ఉద్యుక్తులవ్వాల్సిన తరుణమిది.

భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా మత, జాతి, కుల తదితర రూపాల్లో విద్వేషకాండలను, మారణహోమాలకు కారణమవుతున్న సామ్రాజ్య వాద శక్తులకు, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పరస్పర సహకారంతో ఎక్కడికక్కడ ప్రజా పోరాటాలు పెల్లుబికితేనే ప్రపంచ శాంతికి మార్గం సుగమం అవుతుంది.

వసివాడుతున్న పసి బతుకులు

నేటి విద్యావ్యవస్థలో విద్య మీద ప్రేమతో, దానిపై గల మక్కువతో చదువుపై మాత్రమే మనసు లగ్నం చేస్తున్నారు. కానీ, మిగతా ఏ ఇతర అంశాల మీద దృష్టి సారించడం లేదు. పిల్లలు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పొద్దున లేచింది మొదలు వారు పడుకునే వరకు నిరంతరం చదువుపై మాత్రమే లగ్నం చేయమని అంటున్నారే తప్ప ఆట, పాట మీద వారిలో ఉండే సృజనాత్మకత మీద మరికొందరిలో వేరే విషయాల మీద ఉన్న అవగాహన ఈ చదువు మీద ఉండదు. అలాంటి సందర్భాల్లో పసి హృదయాలు రోదనతో తల్లడిల్లి వారి మనోభిప్రాయాలు ఎవరితో పంచుకోవాలో తెలియక సతమత మవుతున్నారు. ఉదయం 8 గంటలైనా కాకముందే ఉదయం ట్యూషన్ పూర్తి చేసుకొని ఇంటికి వస్తారు. తర్వాత ఏదో ఒకటి తిని స్కూల్‌కో, కాలేజీకో వెళ్ళిపోతారు. తిరిగి ఇంటికి చేరుకొని కొంత సమయం గడుపుతారో లేదో మళ్ళీ ట్యూషన్ అంటే యువత జీవితం పంజరంలో చిలుకలా, బంధించిన జంతువులా, తీరికలేని వ్యక్తిగా జీవనం కొనసాగిస్తున్నారు. అలాగే చిన్నపిల్లలు స్కూల్‌కు టన్నుల బరువున్న పుస్తకాలు మోస్తూ ఫలితంగా బరువుకు శరీరం ఎదగక, శరీరాకృతిలో మార్పువస్తుంది. అలామార్పు రావడమే కాకుండా వ్యక్తి వికాసం మందగించడంలో ఈ అంశాలు ఎంతగానో ఉపకరిస్తాయి. బాల్యం అంటేనే చిన్నపిల్లల్లో ఆటలు ఆడుకోవాలనే ఆశ ఉంటుంది. కాని నేటి సమకాలీన ప్రపంచంలో ఆటలకు సమయం లేదు. పాటలకు సమయం లేదు. మరే ఇతర అంశాలకు సంబంధించి సమయం లేదు కాని స్కూల్‌కు పంపడానికి, కాలేజీకి పంపడానికి వారు ఇంట్లో ఉన్నప్పుడు వారితో హోం వర్క్ చేయించడానికో లేదా ట్యూషన్ పంపించి చదివించాలనుకునే తల్లిదండ్రులు జాగ్రత్తగా ఈ విషయాలను గురించి ఆలోచించాలి. ముందుగా నిరంతర పఠనం ద్వారా, సమయం లేకపోవడం వల్ల మనిషిలో నిద్రలేమి, సంతోషాలు కరువై పుస్తకజ్ఞానం వస్తుంది కాని, సమాజంలో ఏ విధంగా ఉండాలి? ఎవరితో ఎలా మాట్లాడాలి? ఇంటికి చుట్టాలొస్తే కూ



డా కనీసం పలకరింపు ధోరణి లేదు. ఎందుకంటే వారికి తరుచు హాస్టళ్ళలో వేయడం, ఆ విద్యార్థులు హాస్టల్‌లో ఉన్నపుడు తల్లిదండ్రుల, బంధువుల ప్రేమను నోచుకోక వింత ప్రవర్తనను అలవరుచుకుంటున్నారు. చదివించడం మంచిది కాదని అనడం లేదు. దానికి ఒక సమయం కేటాయించుకోవాలి. ఆటలకు, పాటలకు కూడా కొంత సమయాన్ని కేటాయించాలి. విద్యార్థుల ఆశయాలు దెబ్బతినేలా తల్లిదండ్రులు ప్రవర్తించడం లేకపోతే విద్యార్థులపై ఒత్తిడి కలుగజేస్తున్నారు. అలాంటి సందర్భాల్లో ఆ ఒత్తిడిని అధిగమించలేక నేటి యువత ఆత్మహత్యలవైపు ఆకర్షితులవుతున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అన్ని రంగాల్లోను పోటీ తీవ్రత ఎక్కువగా ఉంది. పోటీని తటుకొని వారు ఆయా రంగాలలో నిష్ణాతులు కావడానికి ఎంతో శ్రమ చేయాల్సి ఉంటుంది. దానిని ఒక ప్రణాళిక ప్రకారం, సరైన సమయపాలన పాటిస్తూ ఆ దిశగా ప్రయత్నంచేస్తే వారు ఎంచుకొన్న రంగాలలో విజయం సాధిస్తారు. సమాజంలో ఎక్కువ శాతం ఏ రంగంవైపు మొగ్గుచూపుతున్నారో వీరి పిల్లలను సైతం ఆ రంగం వైపు ఆ కోర్సులు చేసేట్టుగా అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మార్కులు తక్కువగా వచ్చాయని, గురువు మందలించాడని, తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్యలు చేసుకున్నవారు అనేకులున్నారు. పిల్లలతో స్నేహపూర్వకంగా మెదలాలి.

బాల్యం అనగానే తొక్కుడుబిళ్ల, గవ్వలాడడం, చిర్రగోనె ఆడడం, గోళీలు ఆడడం, క్రికెట్టు ఆడడం, కోతి కొమ్మచ్చి... ఇలాంటి ఎన్నో గుర్తుకు వస్తుంటాయి, కాని బాల్యంలో ఇవి చూద్దామన్నా నేడు మనం చూడలేం. ప్రపంచ శాస్త్ర సాంకేతిక రంగంలో అభి వృద్ధి సాధించింది అది మంచి విషయమే కాని ఇప్పుడున్న వారిలో టివిలు చూడడం, సెల్‌ఫోన్‌లో ఆటలు ఆడడం, ఇంటర్‌నెట్ వంటివి మాత్రమే చూస్తున్నారు. తప్పితే శారీరక శ్రమ అనేది కనిపించడం లేదు. ఆటలు ఆడ డం ద్వారా, పాటలు పడడం ద్వారా మనసు హాయి గా, ప్రశాంతంగా ఉండి ఉన్నతంగా ఆలోచించేం దుకు తోడ్పడుతుంది. పిల్లలు ఒత్తిడికి లోనుకా కుండా, ప్రేమగా వారిని మందలిస్తూ సరైన మార్గం ఎన్నుకునేలా చూడడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యతగా గుర్తించాలి.

- మోటె చిరంజీవి

లంబాడీల మ్యూజియం ఏర్పాటుచేయాలి

మన లేఖలు

లంబాడీల సంస్కృతికి అద్దంపట్టేలా భవిష్యత్ తరాలకు లంబాడీల కళల చరిత్రలను తెలిసేలా గిరిజన లంబాడీల అన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేసి లంబాడి సంస్కృతి ఉట్టిపడేలా మహబూబాబాద్ జిల్లా పరిధిలో ట్టానూ నాయక్ మ్యూజియాన్ని సత్వరమే ఏర్పాటుకు చర్యలు తీసుకొని గిరిజన లంబాడీల సంస్కృతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటడానికి ప్రభుత్వం కృషి చేయాలి. ఎన్నో ఏళ్ల నుంచి మరుగునపడిన గిరిజన సంస్కృతి మూలాలు, కళలు, గిరిజన లంబాడీలు వినియోగించే పరికరాలు వారి ఆచార సంప్రదాయాలను పర్యాటకులకు నేటి, రాబోయే తరాలకు అందించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మ్యూజియం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి. అలాగే వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే పర్యాటకులకు గిరిజన లంబాడీల వేషధారణల సంబంధించిన పరికరాలు, పురుషులు ధరించే వస్త్రాలు ధోతి, ఝుగ్లా, రుమాల్, కోల్డ్, పులిగోరుతో తయారు చేసిన లాకెట్ ధరిస్తారు. ఈ పోటీ ప్రపంచ యుగంలో కాలక్రమేణా అంతరించి పోతున్న తరుణంలో వాయిద్యాలను, లంబాడీల జీవిత చరిత్రను తెలియజేసే విధంగా శిల్పాలను ఏర్పాటు చేయాలి. లంబాడీల జీవన విధానం కళ్లకు కట్టే విధంగా 20 నిమిషాలు పాటు టెలిఫిల్మ్‌లను ప్రదర్శించాలి.

- గుగులోతు శంకర్ నాయక్
తెలంగాణ గిరిజన సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు


మనం
కుటుంబం
గురువారం, 1 మార్చి 2018
www.manamnews.com

దివి నుంచి భువికి దిగివచ్చిన దేవకన్య.. తిరిగి శాశ్వతంగా అమరపురికి తరలిపోయింది. ఆకాశంలో చందమామను చిన్నబుచ్చుతూ.. మరో నిండు జాబిలమ్మ చేరింది. సినీ తారా లోకాన్ని విడిచి వినీలాకాశంలో ధ్రువతారలా నిలిచింది. ఆ దేవత తరలిపోతోంటే యావద్దేశం శోక సంద్రంలో మునిగిపోయింది. ''దేవతా.. తరలిపో.. వదలలేక.. వదలలేక...'' అంటూ కన్నీటి వీడ్కోలు పలికింది. మృత్యువు ఒడిలోనూ.. నిండు ముత్తయిదువు ప్రశాంతంగా పవళిస్తోందా అన్నట్లు ప్రశాంత వదనంతో కనిపించింది శ్రీదేవి భౌతిక కాయం. బంగారు వర్ణపు అంచు ఉన్న ఎరుపు రంగు కంచి పట్టు చీరలో నిండుదనంతో కనిపించింది ఆ అంతిమ యాత్ర వేళలో!! తనకు ఇష్టమైన మల్లెపూలతో అలంకరించిన వాహనంలో రుద్రభూమికి సాగిపోయింది. కపూర్ కుటుంబమంతా అశ్రు నయనాలతో వెంట కదిలారు. ఆ అతిలోక దేవేరికి అంతిమ వీడ్కోలు పలికేందుకు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర సహా పలు ఉత్తరాది రాష్ట్రాల నుంచి అభిమానులు ముంబైకి తరలివచ్చారు. ముంబై మహానగరం శ్రీదేవి అభిమాన సంద్రంతో నిండిపోయింది. మౌనంగా ఆమె పార్థివ దేహానికి నివాళి అర్పించి తుది వీడ్కోలు పలికారు.





దేవతా.. తరలిపోయావా..



ఎన్టీఆర్‌తో చిన్నారి శ్రీదేవి (ఫైల్)



జయాబచ్చన్, ఐశ్వర్యరాయ్



చిన్నబోయిన సినీ లోకం

శ్రీదేవి మృతితో భారత సినీ రంగం చిన్నబోయింది. తారా లోకమంతా బుధవారం ఉదయం 6 గంటల నుంచే అతిలోక సుందరి ఇంటికి క్యూ కట్టింది. టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ సినీ ప్రముఖులంతా అశ్రు నయనాలతో అంజలి ఘటించారు. తమ సహ నటి... ప్రియ నేస్తం.. సినీ ప్రపంచంలోకి అడుగుపెట్టడానికి స్ఫూర్తిప్రదాత అయిన శ్రీదేవికి అంతిమ నివాళి అర్పించారు. పలువురు సెలబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్‌లో ఆమె భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించారు. బాలీవుడ్ ప్రముఖులు విద్యా బాలన్, హేమా మాలిని, జాయా బచ్చన్, ఐశ్వర్యా రాయ్, సుస్మితా సేన్, మాధురీ దీక్షిత్, కాజోల్, దీపికా పదుకొనే, ఇషా డియోల్, అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్, సిద్ధార్థ్ రాయ్ కపూర్, ఫరాన్ అక్తర్, దియా మీర్జా, సిద్ధార్థ్ మల్హోత్రా, రేఖా, సోహేలీ ఖాన్, అనుపమ్ ఖేర్, అజయ్ దేవగన్, జాన్ అబ్రహాం, సంజయ్ లీలా భన్సాలీ తదితరులు విషాద వదనంతో అంతిమ వీడ్కోలు పలికారు. తెలుగు సినీ పరిశ్రమ నుంచి చిరంజీవి, వెంకటేశ్, ప్రకాశ్ రాజ్ తదితరులు ముంబై వెళ్లి శ్రీదేవికి నివాళి అర్పించారు. కుమార మంగళం బిర్లా, అనీల్ అంబానీ సహా పలువురు పారిశ్రామికవేత్త కూడా అంతిమ యాత్రలో పాల్గొన్నారు.



చిరంజీవి, అశ్వనీదత్



వెంకటేశ్



ప్రకాశ్‌రాజ్



శ్రీరామ్, మాధురీ దీక్షిత్



కాజల్, అజయ్ దేవగన్



రేఖ



షారుఖ్ ఖాన్



అనిల్ అంబానీ



బప్పిలహరి



సుష్మితా సేన్



కుమార మంగళం బిర్లా



సులభ ఆర్యా, టబు



జాక్వెలిన్ ఫెర్నాండెజ్

హోలీ వేడుకలు రద్దు

శ్రీదేవి మృతికి సంతాపంగా ఆమె నివాసం ఉన్న లోఖండ్ వాలాలోని గ్రీన్ ఏకర్స్ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో హోలీ వేడుకలను రద్దు చేశారు. శుక్రవారం జరిగే హోలీ నాడు ఏ వేడుకలూ వద్దని సొసైటీ చైర్మన్ స్పష్టం చేశారు. రెయిన్ డ్యాన్స్, మ్యూజిక్ సిస్టం, రంగులు చల్లుకోవడం వంటివి చేయవద్దని నిర్ణయించుకున్నటు చైర్మన్ ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు.

శవ సేవలో.. అ'సామాన్యుడు'!

నిస్సహాయుల సేవకు సదా సిద్ధం.. శ్రీదేవి కేసులో అష్రఫ్ కీలక పాత్ర

మృతదేహం భారత్ చేరడంలో కృషి.. ఇప్పటిదాకా 38 దేశాల్లో 4,700 మందికి సాయం



ఆయనో సామాన్య మెకానిక్కేగానీ ఆపద్బాంధవుడు... యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పరిధిలో ప్రవాసుల పడకగదిలాంటి అజ్మాన్ అనే ఎమిరేట్‌లో ఆకాశహర్మ్యాల నడుమ దుమ్ముకొట్టుకుపోయిన ఓ చిన్న ఇంట్లో నివసిస్తుంటాడు. కానీ, ఆయన హృదయ వైశాల్యంతో పోలిస్తే సముద్రం కూడా చిన్నదైపోతుంది. ఏదో ఒక పని చేసుకుందామని వచ్చి నానా అగచాట్లూ పడే ప్రవాసులు దురదృష్టవశాత్తూ మరణిస్తే వారి మృతదేహం స్వదేశం చేరడమన్నది అత్యంత దుస్సాధ్యమైన ప్రక్రియ. అలాంటి సంక్లిష్ట పత్రాలను సత్వరమే సిద్ధం చేయడంలో ఆయన దిట్ట. సామాన్యుల నుంచి అసామాన్యుల వరకూ మరణించినవారు ఎవరైనా సరే... అతడి సాయం లేకుండా వారి మృతదేహం స్వదేశానికి చేరదంటే అతిశయోక్తి కాదు. ఇప్పటిదాకా 38 దేశాలకు చెందిన 4,700 మృతదేహాలను స్వదేశాలకు పంపడంలో ఆయనది అద్వితీయ పాత్ర కావడం ఇందుకు నిదర్శనం. ఇంత చేసినా పైసా ప్రతిఫలం ఆశించడు. ''అందరి ఆశీర్వాదాలే నాకు గొప్ప సంపద. మరణించినవారిని స్వదేశం పంపాలంటే ఓ పెద్ద కసరత్తు. అది అందరికీ కొరుకుడు పడేది కాదు. అందుకే అందరికీ సాయపడుతుంటాను'' అని వినమ్రంగా చెబుతాడు. ఇక శ్రీదేవి విషయానికొస్తే... భారతీయుల అభిమాన తార నింగికేగిన వార్తతో అందరూ ఆదుర్దాగా ఎదురుచూస్తుండగా మీడియా కెమెరాల వెలుగులు, ప్రముఖుల సందడి వంటివాటికి తావులేని దుబాయ్‌లో ఆమె భౌతిక కాయం ఓ సాధారణ శవాగారానికి చేరిపోయింది. ఇక అక్కడినుంచీ మీడియాలో సాగిన హడావుడి అందరికీ తెలిసిందే. అయితే, 'అష్రఫ్' (44)గా అక్కడి ప్రవాసులందరికీ చిరపరిచితుడైన కేరళలోని తామరసేరీ వాస్తవ్యుడు 'షెరీ తామరసేరీ' నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుపోయాడు. ఆ తర్వాతే 'మన శ్రీదేవి' భౌతిక కాయం 'వాయు'వేగాన స్వదేశం చేరింది. ఇంతకూ అష్రఫ్ ఏం చేస్తుంటాడు... శ్రీదేవి మృతి అనంతర పరిణామాల్లో భాగంగా ఏంచేశాడు?

అవిశ్రాంత సేవానిరతి షెరీ సొంతం

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఎక్కడ... ఎవరు మరణించినా సాయం చేయడానికి అష్రఫ్ సదా సిద్ధంగా ఉంటాడు. దీన్ని ఒక ఉన్నత బాధ్యతగా ఆయన భావిస్తాడు... ప్రత్యేకించి ఈ విషయంలో అలుపన్నది ఎరుగని అవిశ్రాంత సేవానిరతి ఆయన సొంతం. కాబట్టే- ఆయన చేతిలోని ఫోన్ తరచూ రింగురింగుమంటూనే ఉంటుంది. శ్రీదేవి మరణవార్త లోకానికి వెల్లడైన వెంటనే షెరీకి పిలుపొచ్చింది. కానీ, ఈ ఉదంతంలో పోలీసు దర్యాప్తు మొదలైపోవడంతో ఆ లాంఛనం ముగిసేసరికి మూడు రోజులు గడిచిపోయాయి. శ్రీదేవి భౌతిక కాయం ఎప్పుడు భారత్ చేరుతుందన్నది సందిగ్ధంలో పడింది. మరోవైపు నలుగురు విదేశీయుల మృతదేహాలను వారి దేశాలకు పంపించే పనిలో అష్రఫ్ అప్పటికే తలమునకలై ఉన్నాడు. అయితే, దుబాయ్‌లో తన సాయం అవసరమన్న కబురందగానే రెక్కలు కట్టుకు వాలిపోయాడు. ''ఇక్కడ మీరు.. నేను అన్న మాటే లేదు... అందరూ సమానమే. విదేశీయులెవరైనా తమ గదిలో మరణిస్తే వెంటనే మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించి, పోలీసులకు నివేదిస్తారు. ఈ లాంఛనం పూర్తయ్యాక శవాగారానికి తరలిస్తారు'' అని ఒక వార్తాసంస్థకు మంగళవారం రాత్రి ఇచ్చిన ఇంటర్వ్యూలో అష్రఫ్ చెప్పారు. శ్రీదేవి గురించి, భారత్‌లో ఆమెకుగల జనాదరణ గురించి ప్రస్తావిస్తే... ఎమిరేట్లలో ఎక్కడైనా ఇది సర్వసాధారణమని, బీదాగొప్పా తేడాలు ఉండవని తెలిపారు. భారత దౌత్యాధికారులు ఆమె పాస్‌పోర్టును రద్దుచేసి, ఇతర పత్రాలను సిద్ధం చేయగా, పోలీసుల అనుమతికి అవసరమైన పత్రాలను షెరీ సిద్ధం చేశారు. ఇదంతా సాగుతుండగానే పలువురు పాత్రికేయులు, అధికారులు, తదితరుల నుంచి పలుమార్లు కాల్స్ రావడం గమనార్హం. అటుపైన పోలీసుల అనుమతి అందిన తర్వాత ఓ సాధారణ మార్చురీకి ఆయన దారితీసి, శ్రీదేవితోపాటు మరో ముగ్గురు వ్యక్తుల పత్రాలను సమర్పించాడు. ఆ తర్వాతే శ్రీదేవిసహా నాలుగు భౌతిక కాయాలకూ రసాయన లేపన ప్రక్రియ (ఎంబామింగ్) పూర్తయింది. అటుపైన ఒక అంబులెన్స్ ఆమె మృతదేహాన్ని ప్రత్యేక విమానం వద్దకు చేర్చింది. ఈ ప్రక్రియ మొత్తం పూర్తయ్యాకే షెరీ ఇల్లు చేరడం గమనార్హం. షెరీ సేవలకు గుర్తింపు లభించిన పురస్కారాలు ఆ చిన్న ఇంట్లో దొంతరలుగా పేర్చి ఉండటం కనిపిస్తుంది. అందులో భారత ప్రధాని నరేంద్ర మోదీని కలుసుకున్న చిత్రం గోడకు వేలాడుతూంటుంది.



మళ్లీ రావా!

(మొదటి పేజీ తరువాయి)

అభిమానుల ప్రేమసీమను అఖండంగా ఏలిన తారామణి ఇహలోక యాత్ర ముగిసింది. శ్రీదేవి... శాశ్వతంగా సెలవు తీసుకుంది... నిన్నమొన్నటిదాకా వెండితెర వేలుపుగా తళుక్కుమన్న ఆ తార... కన్నీటితో తుది వీడ్కోలు పలికిన జనసంద్రానికి దూరంగా... సుదూరంగా తారాలోకానికి తరలిపోయింది. అశేష జనావళి, అనేక భాషల సహ నటీనట సమూహం అశ్రునివాళి అర్పిస్తుండగా గాజు పేటికలోని గాజుబొమ్మకు ముంబై పవన్ హన్స్ శ్మశానవాటికలో బుధవారం సాయంత్రం అంతిమ సంస్కారం పూర్తయింది. మహారాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో శ్రీదేవిని గౌరవపురస్సరంగా సాగనంపింది. ప్రతిష్ఠాత్మక పౌర పురస్కారం 'పద్మశ్రీ'కే అలంకారంగా నిలిచినందువల్లనే ఆమెకీ గౌరవం దక్కింది. శ్రీదేవి భౌతిక కాయాన్ని జాతీయ జెండాతో చుట్టి, ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై తరలించారు.




అభిమాన నటిని కడసారి కనులారా చూసుకునేందుకు అశేష జనవాహిని దేశం నలుమూలల నుంచి తరలివచ్చింది. దీంతో అంతిమయాత్ర ఆలస్యం కావడంతోపాటు మధ్యాహ్నం 3:30 గంటలకు పూర్తి కావాల్సిన అంత్యక్రియలు సాయంత్రానికిగానీ ముగియలేదు. అంతకుముందు లోఖండ్‌వాలాలోని బోనీకపూర్ నివాసం 'గ్రీన్ ఏకర్స్' నుంచి శ్రీదేవి భౌతిక కాయాన్ని బుధవారం ఉదయం సెలిబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రాంగణానికి తీసుకువచ్చారు. వివిధ భాషా చిత్రసీమల ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆమెకు తుది నివాళి అర్పించారు. శ్రీదేవితో తమ వెండితెర అనుబంధాన్ని గుర్తుచేసుకుని కంటతడి పెట్టారు. ఉదయం 9:30 గంటల నుంచి కడపటి దర్శనానికి రావాల్సిందిగా ఆమె కుటుంబసభ్యులు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో ప్రజలకు, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. అయితే, దుబాయ్ నుంచి శ్రీదేవి మృతదేహం ముంబై చేరుకునే సమయానికే జనం పెద్ద సంఖ్యలో ఆమె నివాసం వద్దకు చేరుకున్నారు. అటుపైన సెలిబ్రేషన్ స్పోర్ట్స్ క్లబ్ ప్రాంగణం వద్ద తెల్లవారుజామునుంచే బారులుతీరారు. పోలీసు ఉన్నతాధికారులు సుమారు 200 మంది సిబ్బందితో ఆ ప్రాంగణంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.


జానాబాబా 40 దొంగలు

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఆర్ఎస్పీ పనులు జరిగినయన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఎస్సారెస్పీ కాల్వల్లో నీళ్లు పారిస్తున్నమన్న మంత్రి... సమస్యలను అధిగమిస్తూ ప్రగతి వైపు నడుస్తున్నమన్నారు. బస్సుయాత్ర చేసేవాళ్లలో ప్రతి ఒక్కరిపై కేసులు ఉన్నాయని మంత్రి తెలియజేశారు. ''ఒకప్పుడు ఎరువుల కోసం ఎర్రటి ఎండలో నిలబడాల్సి వచ్చేది. ఆంధ్రాలో కలిసినప్పుడు నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ లేదు. ఆ జిల్లా నేతల వల్లే ప్రజలు ఫ్లోరైడ్ బారిన పడ్డరు. 15 ఏండ్లు మంత్రిగా పనిచేసిన జానారెడ్డి ఏనాడు కూడా ఫ్లోరైడ్ బాధితులను పట్టించుకోలేదు. తెలంగాణకు ఒక్కపైసా కూడా ఇవ్వనన్న కిరణ్‌కుమార్‌రెడ్డిని నిలదీసిన పాపాన పోలేదు. చిత్తూరు జిల్లాకు 9 వేల కోట్లు ఇచ్చాడు. కాంగ్రెస్ మంత్రులు తలూపారు తప్ప అలా ఎలా అని ప్రశ్నించారా? 24 గంటల కరెంట్ వస్తుంటే కాంగ్రెస్ నాయకులకు కడుపులు మండుతున్నయి. ఒకప్పుడు ఎరువుల కోసం ఎర్రటి ఎండలో నిలబడాల్సి వచ్చేది. రూ. 17 కోట్ల రుణాలు మాఫీ చేసి రైతులను అప్పుల ఊబి నుంచి గట్టెక్కించిన ఘనత సీఎం కేసీఆర్‌ది. రైతులకు పెట్టుబడి ఇస్తానన్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్. పేదల కన్నీళ్లు తుడవడానికే ఈ ప్రభుత్వం వచ్చింది. రైతులకు రూ. 5 లక్షల బీమా సౌకర్యం కల్పించినం. ఎన్నికలు దగ్గర పడుతున్నాయని దొంగ యాత్రలు మొదలు పెట్టారు. 55 ఏండ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ చేసిందేమీ లేదు'' అని కాంగ్రెస్‌పై నిప్పులు చెరిగారు. వచ్చే 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి డిపాజిట్ కూడా దక్కదన్నారు. దేశంలో ఎక్కడా ప్రవేశపెట్టని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీని త్వరలో ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశం కల్పించడానికి నైపుణ్య శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ''తెలంగాణ రాష్ట్ర భవిష్యత్ ఆశాకిరణం మంత్రి కేటీఆర్. నియోజకవర్గం మరిచిపోయిన నేతలు మళ్లీ వస్తున్నారు. రాజకీయ ఘర్షణలకు తావు లేకుండా తుంగతుర్తి నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతున్నది. మేము తన్నాల్సివస్తే జిల్లాలో ఒక్క కాంగ్రెస్ నేత మిగలరు. కాని మేము ఆ పని చేయం. తన్నాల్సి వస్తే ప్రజలే మిమ్మల్ని తంతారు. అది కూడా బ్యాలెట్ అనే ఆయుధం ద్వారానే. నల్గొండలో తాగి తన్నుకొని చస్తే టీఆర్ఎస్‌కు ఆపాదించడం వారి విజ్ఞతకే వదిలిపెడుతున్నాం. కాంగ్రెస్ పార్టీ.. అంతర్గత కుమ్ములాటలకు నిదర్శనం'' అని మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, వేముల వీరేశం, పైళ్ల శేఖర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.



జయేంద్ర సరస్వతి శివైక్యం



(మొదటి పేజీ తరువాయి)

ఆది శంకరాచార్యులు నెలకొల్పిన కంచి కామకోటి పీఠానికి శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామి తర్వాత ఆయన వారసుడిగా జయేంద్ర సరస్వతి పీఠాధిపత్య బాధ్యతలను స్వీకరించారు. ఇప్పుడు ఆయన శివైక్యం చెందడంతో.. జయేంద్ర సరస్వతి వారసుడిగా విజయేంద్ర సరస్వతి పీఠాధిపతి కానున్నారు. స్వామి అంత్యక్రియలు.. 'బృందవన ప్రవేశ కార్యక్రమం' గురువారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతాయని మఠం వర్గాలు తెలిపాయి. అప్పటివరకు భక్తుల సందర్శనార్థం పీఠంలోనే స్వామి పార్థివదేహాన్ని ఉంచుతారు. గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న జయేంద్ర సరస్వతి.. పలుమార్లు ఆస్పత్రికి వెళ్లి చూపించుకున్నా కోలుకోలేదు.

1994 నుంచి పీఠాధిపతి

1935 జులైన 18న తంజావూరులో జన్మించిన ఆయన అసలు పేరు సుబ్రహ్మణ్య మహదేవ అయ్యర్. 1994 నుంచి కంచి పీఠాధిపతిగా ఎన్నో సేవలు అందించారు. విద్యాశాలలు, వైద్యశాలలతో పాటు ఒక వైద్యకళాశాలను కూడా నెలకొల్పారు. కోట్లాది మంది భక్తులను సంపాదించుకున్నారు. గత కొంత కాలంగా శ్వాససంబంధ సమస్యలతో బాధపడుతున్న ఆయన ఎక్కువ కాలం ఆస్పత్రిలో ఉండడానికి ఇష్టపడలేదని, పీఠంలోనే ఉండాలని భావించారని శిష్యులు చెబుతున్నారు. స్వామి శివైక్యం చెందిన విషయం వినగానే పెద్ద ఎత్తున శిష్యులు, స్థానిక ప్రజలు ఆస్పత్రి దగ్గరకు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

లక్షలాది మంది గుండెల్లో స్వామి: ప్రధాని

శంకరాచార్య జయేంద్ర సరస్వతి శివైక్యం చెందడం పట్ల ప్రధాని నరేంద్రమోదీ, ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తమిళనాడు పళనిసామి, డీఎంకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంకే స్టాలి న్, పీఎంకే వ్యవస్థాపకుడు ఎస్.రాందాస్ తదితరులు సంతాపం తెలిపారు. పూజ్యశ్రీ జయేంద్ర సరస్వతి మృతిపట్ల తీవ్రంగా కలత చెందానని, ఆయన లక్షలాది మంది భక్తుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ప్రధాని మోదీ తెలిపారు. ఆయన సేవలు అపారమన్నారు. ఆయన నెలకొల్పిన విద్యాసంస్థలు పేదలు, దిగువ తరగతుల వాళ్ల జీవితాలను మార్చాయని గుర్తుచేశారు. కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి మోక్షం పొందడం పట్ల తన సంతాపం తెలుపుతున్నానని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మానవాళి సంక్షేమానికి ఆ యన కృషి అనిర్వచనీయమన్నారు. జయేంద్ర సరస్వతి మరణవార్త విని చాలా బాధపడినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ట్వీట్‌చేశారు. ప్రపం చవ్యాప్తంగా లక్షలాదిమందిని తన బోధనలతో ప్రభావితం చేశారన్నారు. జయేంద్ర సరస్వతి మృతి పట్ల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. హిందూత్వంలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువుగా ఉంటూ, తన మార్గదర్శకత్వంలో కంచి పీఠాన్ని బలమైన సంస్థగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. అనేక పాఠశాలు, కంటి ఆసుపత్రులు, పిల్లల వైద్యశాలలను నడుపుతూ ప్రజల సేవలో పునీతులయ్యారని శ్లాఘించారు. కంచి శంకరాచార్య జయేంద్ర సరస్వతి మృతిపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నట్లు ఏపీ ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ట్వీట్ చేశారు. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా స్వామి మృతిపట్ల సంతాపం తెలిపారు.

పాలమూరులో అరెస్టు.. సుప్రీంలో బెయిల్

తమిళనాడు ముఖ్యమంత్రిగా జయలలిత ఉన్నప్పుడు వరదరాజులస్వామి దేవాలయ మేనేజర్ శంకరరామన్ హత్యకేసులో జయేంద్ర సరస్వతిని 2004 నవంబరు 11న నాటి ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్‌నగర్‌లో అరెస్టు చేశారు. జయేంద్రసరస్వతి, విజయేంద్ర సరస్వతి ఇద్దరూ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించిన కొన్నాళ్లకే శంకరరామన్ హత్యకు గురయ్యారు. దాంతో హత్యకు కుట్ర పన్నింది స్వామేనని ఆయనను అరెస్టు చేసి వేలూరు జైల్లో పెట్టారు. రెండు నెలల తర్వాత 2005 జనవరి 10న సుప్రీంకోర్టు బెయిల్ మంజూరుచేయడంతో ఆయన విడుదలయ్యారు. ఇదే కేసులో సరిగ్గా జయేంద్ర సరస్వతి విడుదలైన రోజే విజయేంద్ర సరస్వతిని మఠంలో అరెస్టు చేశారు. ఆయనకు నెల రోజుల తర్వాత మద్రాస్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. కొన్నాళ్లకు.. 2013లో పాండిచ్చేరి సెషన్స్ కోర్టు ఈ కేసును కొట్టేసింది.

జయేంద్ర మృతికి సీఎం సంతాపం

కంచికామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి మరణం పట్ల ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన చేసిన సరస్వతి సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. సీఎం ఆదేశాల మేరకు జయేంద్ర సరస్వతి అంత్యక్రియల్లో పాల్గొనేందుకు దేవాదాయ శాఖ అధికారులు కంచికి వెళ్లారు

ఈసారి గెలవకుంటే రాజకీయ సన్యాసం



(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు టీఆర్ఎస్‌పై విసుగు చెందారని, కాంగ్రెస్ పాలన కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. 'ప్రజా చైతన్య బస్సు యాత్ర'లో భాగంగా జహీరాబాద్‌లో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడారు. ప్రధాని మోదీని చూస్తే సీఎం కేసీఆర్‌కు భయమని, ఆయన్ను చూస్తే కేసీఆర్ గజగజ వణుకుతారని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రం సోనియా ఇచ్చిన బహుమతి అని, ప్రత్యేక రాష్ట్రంతో తెలంగాణ సస్యశ్యామలం అవుతుందని భావిస్తే కేసీఆర్ కుటుంబం నాశనం చేసిందని అన్నారు. టీఆర్ఎస్ నాలుగేళ్ల పాలన లో రాష్ట్రం సమస్యల వలయంగా మారిందని ఆరోపించారు. రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతోందని, ప్రభుత్వంలో పేరుకే మంత్రులు ఉన్నారని, వారి చేతిలో అధికారాలు లేవని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాం ప్రభుత్వాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో మంత్రులుగా ఉన్నారని, కానీ టీఆర్ఎస్ కేబినెట్‌లో ఒక్క మహిళా మంత్రి కూడా లేకపోవడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో మహిళలకు గౌరవం ఇవ్వని కేసీఆర్ రానున్న ఎన్నికల్లో గద్దెదిగడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, ప్రజలు అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి ఆర్‌సీ కుంతియా మాట్లాడుతూ.. వచ్చిన తెలంగాణలో కేసీఆర్ కుటుంబం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సోనియాగాంధీ కృషి వల్ల తెలంగాణ ఏర్పడిందని తెలంగాణ బిడ్డలకు కేసీఆర్ కుటుంబం మోసం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో కొత్త ఉద్యోగాలు లేవు కొత్త పరిశ్రమలు లేవని, యువత నిరుద్యోగంతో కొట్టుమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వలాభం కోసం టీఆర్ఎస్ పని చేస్తుందన్నారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ నుంచి కేసీఆర్‌పై పోటీ చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, దీనిపై అధిష్ఠానం ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే జె.గీతారెడ్డి మాట్లాడుతూ.. అధికారం కోసం అబద్ధాలు చెప్పి అధికారం చేపట్టిన కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో దానం నాగేందర్, సర్వే సత్యనారాయణ, సబితా ఇంద్రారెడ్డి రవీంద్రనాయక్, పొన్నాల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పొత్తులపై నిర్ణయం



(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఆత్మవిశ్వాసం, చిత్తశుద్ధి ఉంటే ఏదైనా సాధించవచ్చని, నిత్య ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ ప్రజల్లో ఉంటే తెలంగాణలో పార్టీకి పునర్వైభవం సిద్ధిస్తుందన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం ఎల్.రమణ అధ్యక్షతన జరిగిన టీ-టీడీపీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్ననాటి నుంచి ఎన్నో కష్టనష్టాలకోర్చి ఈ స్థాయికి ఎదిగానన్నారు. సవాళ్లను ఆత్మవిశ్వాసంతో అధిగమించి సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా కొనసాగానని చెప్పారు. తెలుగుదేశం పార్టీ తెలుగువారి కోసం స్థాపించిన పార్టీ అని, ఇరు రాష్ట్రాల్లో పార్టీ ఉంటుందన్నారు. ఒకప్పుడు హైదరాబాద్‌ను అభివృద్ధి చేశానని, ఇప్పుడు అమరావతిని నిర్మిస్తున్నానని తెలిపారు. పని ఒత్తిడి, సమయం లేనందున ఇక్కడికి రాలేకపోతున్నప్పటికీ ఇక్కడి కార్యకర్తలంటే తనకెంతో అభిమానం ఉందన్నారు. 35 ఏండ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల బాధ్యత తనపై ఉందని భరోసా కల్పించారు. ఇకపై నెలకోసారి హైదరాబాద్ వచ్చి టీటీడీపీ పనితీరుపై పరిశీలించి దిశానిర్దేశం చేస్తానని చెప్పారు. త్వరలోనే తెలంగాణలో అన్ని స్థాయిల్లో పార్టీ ఇంచార్జీలను నియమిస్తామని తెలిపారు. అంతకుముందు టీటీడీపీ పొలిట్‌బ్యూరో, సెంట్రల్ కమిటీ సభ్యులతో బాబు భేటీ అయ్యారు. పొలిట్ బ్యూరో సభ్యులతో గురువారం మరోసారి బాబు సమావేశం కానున్నారు.

నాయకత్వ లేమిపై ఆందోళన

సర్వసభ్య సమావేశంలో టీ-టీడీపీ నాయకత్వంపై కార్యకర్తలు చంద్రబాబుకు ఫిర్యాదు చేశారు. పార్టీ కోసం పనిచేసేందుకు తాము సిద్ధంగా ఉన్నా నేతలు పట్టించుకోవడం లేదని హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన యువనేత ఒకరు ఆరోపించారు. టీటీడీపీ అధ్యక్షుడిగా జూనియర్ ఎన్టీఆర్‌ను నియమించాలని సమావేశంలో కొంతమంది కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ, పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పార్టీని టీఆర్ఎస్‌లో విలీనం చేయాలని వ్యాఖ్యానించిన మోత్కుపల్లిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి మోత్కుపల్లి నర్సింహులు హాజరుకాకపోవడం గమనార్హం.

మా కుటుంబం నుంచి ఎవరూ రారు

టీ-టీడీపీ నాయకత్వ బాధ్యతలను లోకేశ్, బ్రాహ్మణి, బాలకృష్ణ, ఎన్టీఆర్‌లలో ఎవరికిచ్చినా, తెలంగాణలో పార్టీ పుంజుకుంటుందని కార్యకర్తలు చంద్రబాబుకు వివరించారు. అందుకు ఆయన స్పందిస్తూ.. ఇక్కడ నాయకత్వం రూపుదిద్దుకోవాలే తప్ప, తమ కుటుంబం నుంచి ఎవరూ రారని స్పష్టం చేశారు. అలా రావడం వల్ల పార్టీకి నష్టమే తప్ప లాభం లేదన్నారు. పొత్తులపై కార్యకర్తలు ప్రశ్నించగా.. గత ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకున్నా తదనంతర పరిస్థితుల్లో టీటీడీపీతో పొత్తులేదని తెలంగాణ బీజేపీ నేతలు ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. పొత్తు పెట్టుకున్నప్పుడు ఏదైనా చెప్పి చేయాలని, ఏకపక్షంగా ప్రకటించడం సరికాదన్నారు. కాంగ్రెస్‌తో మాత్రం పొత్త ఉండదన్నట్లే ఆయన వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో పరిస్థితులను బట్టి, కార్యకర్తలు, నాయకులతో చర్చించి పొత్తులపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. తెలుగు రాష్ట్రాల మధ్య సమస్యలు పరిష్కారం కావాలని, ఇరు తెలుగు రాష్ట్రాలు కలిసి ముందుకు సాగాలని బాబు ఆకాంక్షించారు.

ఎయిర్‌సెల్ దివాలా!

'ఎన్‌సీఎల్‌టీ'లో దరఖాస్తు దాఖలు

పోటీ తట్టుకోలేక.. అప్పులు కట్టలేక

పిటిషన్‌లో డైరెక్టర్ల బోర్డు స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28:


టెలికం సంస్థ 'ఎయిర్‌సెల్ దివాలా ఫారం దాఖలు చేసింది. ఈ మేరకు ముంబైలోని జాతీయ కంపెనీ చట్టం ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) లో దరఖాస్తు సమర్పించినట్లు ఒక ప్రకటనలో డైరెక్టర్ల బోర్డు బుధవారం తెలిపింది. టెలికం సేవల రంగంలో కొత్త ఆపరేటర్ (జియో) చావుదెబ్బ, తట్టుకోలేనంత పోటీ, తీవ్ర ఆర్థిక సంక్షోభం, పెరిగిన నష్టాలు, మోయలేనంత రుణభారం, చట్ట-నియంత్రణపరమైన సవాళ్లు, తది తరాలే ఇందుకు కారణమని వివరించింది.

ఈ నేపథ్యంలో ''ఎయిర్ సెల్ సెల్యులర్, డిష్‌నెట్ వైర్‌లెస్, ఎయిర్‌సెల్ లిమిటెడ్'' సంస్థలకు సంబంధించి 'కార్పొరేట్ ఆర్థిక అశక్తత-దివాలా పరిష్కార ప్రక్రియ' చేపట్టాలని ఎన్‌సీఎల్‌టీని కోరినట్లు తెలిపింది. కేంద్ర ప్రభుత్వం కొత్తగా రూపొందించిన 'ఆర్థిక అశక్తత-దివాలా స్మృతి-2016' చట్టంలోని సెక్షన్ 10 కింద దరఖాస్తు సమర్పించినట్లు వెల్లడించింది. రుణభారం పునర్వ్యవస్థీకరణ కోసం ఆర్థిక సహాయ సంస్థలు, వాటాదారులతో చర్చల్లో ఏకాభిప్రాయం సాధ్యం కాలేదని తెలిపింది. ఈ పరిస్థితుల నడుమ 'దివాలా దరఖాస్తు దాఖలు తప్ప మార్గాంతరం లేద'న్న నిర్ణయానికి వచ్చినట్లు బోర్డు ప్రకటన పేర్కొంది.

కార్తీ చిదంబరం అరెస్టు

ఒకరోజు సీబీఐ కస్టడీకి అనుమతి

చెన్నై, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర ఆర్థికశాఖ మాజీమంత్రి పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరాన్ని (46) ఐఎన్ఎక్స్ మీడియా కేసులో సీబీఐ బుధవారం అరెస్ట్ చేసింది. లండన్ నుంచి చెన్నై రాగానే విమానాశ్రయం నుంచి బయటకు రాకముందే అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అటునుంచి అటే మరో విమానంలో ఢిల్లీలోని తమ ప్రధాన కార్యాలయానికి తీసుకెళ్లారు. అనంతరం సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరు పరిచేముందు వైద్య పరీక్షలు కూడా చేయించారు. అనంతరం దర్యాప్తునకు సహకరించని కారణంగా ఆయనను రెండు వారాలపాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు. అయితే, సీబీఐ ఆయనను ఇప్పటికే 22 గంటలపాటు ప్రశ్నించిందని కార్తీ తరఫు న్యాయవాది, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మనుసింఘ్వీ కోర్టు దృష్టికి తెచ్చారు. విచారణకు ఆయన సహకరించారనేందుకు ఈ రుజువు చాలునని పేర్కొన్నారు. ఈ వాదనల అనంతరం ఒకరోజుపాటు కార్తీని కస్టడీలోకి తీసుకునేందుకు కోర్టు అనుమతించింది. చిదంబరం 2007లో కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉండగా.. ఐఎన్ఎక్స్ మీడియా కోసం విదేశాల నుంచి రూ.305 కోట్ల మేర నిధులు తెప్పించారన్న ఆరోపణలతో కార్తీ చిదంబరంపై నిరుడు మే 15న సీబీఐ కేసు నమోదుచేసింది. అందుకుగాను కార్తీకి రూ.10 లక్షల మేర ముడుపు ముట్టినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. పన్ను ఎగవేతకు సహకరించినందుకే ఐఎన్ఎక్స్ మీడియా కార్తీకి ఈ ముడుపు ఇచ్చిందని సీబీఐ ఆరోపించింది. ఈ సంస్థకు అప్పట్లో పీటర్, ఇంద్రాణి ముఖర్జియా యజమానులు. వారు ప్రస్తుతం తమ ఇంద్రాణి కుమార్తె షీనా బోరా హత్యకేసులో జైల్లో ఉన్నారు. ఇదే కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీలాండరింగ్ కేసు కూడా నమోదు చేసింది. ఈ కేసుల్లో ఇప్పటి వరకు చిదంబరం, ఆయన కుటుంబ సభ్యుల ఇళ్లు, కార్యాలయాల్లో సీబీఐ, ఈడీ ఇప్పటికే పలు సోదాలు చేశాయి. కార్తీని ఈడీ పదేపదే ప్రశ్నించింది కూడా. ఒకానొక సమయంలో కార్తీ విదేశాలకు వెళ్లడానికి వీల్లేకుండా లుకౌట్ నోటీసు కూడా జారీచేశారు. లంచాల రూపంలో తీసుకున్న డబ్బును విదేశీ బ్యాంకుల్లో దాచి ఉంటారని.. ఆ ఖాతాలను మూసేస్తారన్న అనుమానంతో ఈ నోటీసులు ఇచ్చారు. అయితే కార్తీ కుమార్తెకు యూకేలోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో సీటు రావడంతో ఆమెను చేర్పించడానికి అక్కడకు వెళ్లేందుకు గత నవంబరులో సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది.



ఇంకా చాలా...

కార్తీతో పరోక్షంగా సంబంధాలున్న అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు రూ.10 లక్షలు చెల్లించినట్లు ఐఎన్ఎక్స్ మీడియా స్పష్టంగా తన రికార్డులలో పేర్కొందని సీబీఐ తెలిపింది. కార్తీకి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తగిన ప్రయోజనాలున్న పలు కంపెనీలకు కూడా ఐఎన్ఎక్స్ గ్రూపు దాదాపు రూ. 3.5 కోట్ల మేర ఇన్వాయిస్‌లు చెల్లించిందని ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పేర్కొంది. కార్తీ, ఆయన కంపెనీ చెస్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, ముఖర్జియాలు, ఐఎన్ఎక్స్ మీడియా, అడ్వాంటేజ్ స్ట్రాటజిక్ కన్సల్టింగ్ సర్వీసెస్, దాని డైరెక్టర్ పద్మా విశ్వనాథన్‌పై సీబీఐ కేసులు పెట్టింది.

రాజకీయ కక్ష సాధింపు: కాంగ్రెస్

పీఎన్‌బీ మోసంసహా తన స్కాములను దాచుకోడానికి, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు... పనిలోపనిగా రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే మోదీ సర్కారు ఇలా అరెస్టులకు పాల్పడుతోందని కాంగ్రెస్ పార్టీ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి రణ్‌దీప్ సుర్జేవాలా ఆరోపించారు. అంతమాత్రాన తమ పార్టీ నిజాలు మాట్లాడకుండా ఊరుకోదన్నారు. చిదంబరాన్ని వేధించడానికే ఆయన కుమారుడిని అరెస్టుచేశారని కపిల్ సిబల్ అన్నారు. దమ్ముంటే కార్తీకి వ్యతిరేకంగా సాక్ష్యాలు చూపించాలని డిమాండు చేశారు. మోదీ ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తున్నారని, నీరవ్, లలిత్, మాల్యాలను విదేశాలకు పారిపోకుండా ఆపలేరుగానీ, కార్తీ స్వదేశం రాగానే అరెస్టు చేస్తారాన అని అభిషేక్ సింఘ్వీ మండిపడ్డారు. అయితే, ఇది చట్టం తనపని తాను చేయడమేనని, ఇందులో ఎలాంటి కక్షసాధింపు లేదని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా అన్నారు.

30 అత్యాచారాలు.. 15 హత్యలు చేసిన

సైకో శంకర్ ఆత్మహత్య


- బయోగ్రఫీతో 'సైకో శంకర్' కన్నడ చిత్రం
- మృతిపై విచారణకు అధికారుల ఆదేశం




సేలం(కర్ణాటక), ఫిబ్రవరి 28: ముప్పై అత్యాచారాలు, 15 హత్యలకు తెగబడ్డ సైకో శంకర్ జైలులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహిళలపై దారుణాలకు తెగబడి తప్పించుకు తిరుగుతూ తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల పోలీసులను ముప్పుతిప్పలు పెట్టిన సీరియల్ రేపిస్ట్ ఎం.జైశంకర్ జైలులో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చాలాకాలంపాటు పోలీసులకు చిక్కకుండా తప్పించుకున్న శంకర్ ఎట్టకేలకు పట్టుబడి జైలుకు చేరాడు. ఆపై కొంతకాలానికే జైలు నుంచి తప్పించుకుని పారిపోయాడు. మళ్లీ పట్టుకొని తిరిగి జైలుకు తరలించిన పోలీసుల కళ్లుగప్పి మరోసారి తప్పించుకున్నాడు. ఆపై పోలీసులకు చిక్కడంతో అధికారులు శంకర్‌ను బెంగళూరులోని పరప్పణ జైలుకు తరలించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు.. పలు కేసులకు సంబంధించి ఈ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. తాజాగా మంగళవారం తెల్లవారు జామున షేవింగ్ బ్లేడ్‌తో గొంతుకోసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన సీరియల్ రేపిస్ట్ అసలు పేరు జైశంకర్. సేలం జిల్లాలోని ఎడప్పాడి, కండంపట్టి ఎం.శంకర్ అలియాస్ జయశంకర్ స్వస్థలం. ఇంటర్ చదివిన శంకర్ ట్రక్కు డ్రైవర్‌గా కొంతకాలం పాటు పనిచేసిన శంకర్ తమిళ్, కన్నడ, హిందీ మూడు భాషలలో అనర్గళంగా మాట్లాడే నైపుణ్యాన్ని సంపాదించుకున్నాడు. తన నేరచరిత్రలో 30 అత్యాచారాలు, 15 హత్యలు, 2 సార్లు పోలీసుల నుంచి తప్పించుకుని రెండు రాష్ట్రాలను గజగజ వణికించాడు. ఇతని జీవితకథ ఆధారంగానే 2017లో 'సైకో శంకర్' అనే పేరుతో కన్నడ సినిమా నిర్మించారు. ఇదిలా ఉండగా, జైలు గదిలో రక్తపు మడుగులో పడివున్న సైకో శంకర్‌ను గుర్తించిన తోటి ఖైదీలు జైలు అధికారులకు సమాచారం ఇచ్చారు. అతన్ని వెంటనే బెంగళూరులోని విక్టోరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే సైకో శంకర్ మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. శంకర్ ఆత్మహత్యకు గల కారణాలపై జైలు ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఖైదీలకు బార్బర్ షేవింగ్ చేసే సమయంలో బ్లేడ్‌ను దొంగిలించి ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు. అయితే, శంకర్ బ్లేడ్‌తో గొంతు కోసుకుంటుండగా ఎవరూ చూడలేదని వారు తెలిపారు. కాగా, శంకర్ మృతిపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆత్మహత్యకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ జరపనున్నట్లు జైలు అధికారులు చెబుతున్నారు.

అఫ్ఘాన్‌లో ఆరుగురి హత్య

- పోలీస్ పోస్ట్‌పై దాడి.. మరో 30 మంది అపహరణ



కాందహార్, ఫిబ్రవరి 28: అఫ్ఘనిస్తాన్ దక్షిణ ప్రాంతంలోని కాందహార్‌లో తిరుగుబాటుదారులు చెలరేగిపోయారు. ఓ పోలీస్ పోస్ట్‌పై దాడిచేసి ఆరుగురు పోలీసులను పొట్టనబెట్టుకున్నారు. ఈ దాడిలో మరో ఐదుగురు పోలీసులకు గాయాలయ్యాయి. అదే సమయంలో మరో ప్రాంతంలో చోటుచేసుకున్న మరో ఘటనలో.. తిరుగుబాటుదారుల బృందం 30 మంది బస్సు ప్రయాణికులను కిడ్నాప్ చేశారని కాందహార్ పోలీస్ చీఫ్ జనరల్ అబ్దుల్ రజీక్ తెలిపారు. ఇందులో 19 మంది పోలీసు సిబ్బంది ఉన్నట్లు ఆయన వెల్లడించారు. ఆర్మీ యూనిఫామ్ ధరించిన కొంతమంది తిరుగుబాటుదారుల బృందం ఓ బస్సును ఆపి అందులో ప్రయాణిస్తున్న 30 మందిని అపహరించారని తెలిపారు. మంగళవారం రాత్రి కాందహార్, ఉరుజ్గాన్ ప్రావిన్స్ సరిహద్దుల్లో ఈ రెండు ఘటనలు చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. మేరకు ఉరుజ్గాన్ గవర్నర్ అధికార ప్రతినిధి దోస్త్ మొహమ్మద్ ఈ వార్తలను ధ్రువీకరించారు. అయితే, దీనికి సంబంధించి ఎలాంటి అదనపు సమాచారాన్నీ ఆయన వెల్లడించలేదు. మరోవైపు ఈ దాడులు ఎవరి పని అన్న విషయంలో ప్రస్తుతానికి స్పష్టతలేదు. దీనిపై ఏ సంస్థ కూడా ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదని అధికారులు తెలిపారు. అయితే, తాలిబన్ ఫైటర్లే ఈ దారుణాలకు తెగబడి ఉంటారని రజీక్ ఆరోపిస్తున్నారు.



అవినీతి కేన్సర్‌లాంటిది

- కీమో వంటి షాక్ అవసరమే
- సౌదీ యువరాజు సల్మాన్

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: దేశంలో పేరుకుపోయిన అవినీతిని కూకటివేళ్లతో తొలగించాల్సిన అవసరం ఉందని సౌదీ యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ పేర్కొన్నారు. ఇందుకోసం సౌదీలో గత ఏడాది ప్రవేశ పెట్టిన యాంటీ కరప్షన్ డ్రైవ్‌లతో సత్ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. చిన్నగా మొదలై శరీరం మొత్తంగా విస్తరించిన కేన్సర్‌కు కీమోథెరపీ రూపంలో షాక్ ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సిందేనని చెప్పారు. కీమో చికిత్స చేయకపోతే కేన్సర్ మొత్తం శరీరాన్నే కబలిస్తుందని వివరించారు. అవినీతి కూడా కేన్సర్ లాంటిదేనని చెబుతూ.. దాని నిర్మూలనకు యాంటీ కరప్షన్ డ్రైవ్‌లు ఉపయోగపడతా యని వివరించారు. కేన్సర్ తరహాలోనే అవినీతిని సమూలంగా పెకిలించి వేయకుంటే దేశాన్ని ముంచెత్తుతుందని పేర్కొన్నారు. అవినీతి నిర్మూలనకు పకడ్బందీ చర్యలు తీసుకోకుంటే బడ్జెట్‌లో పేర్కొన్న లక్ష్యాలను సాధించలేమని ఆయన వివరించారు. ఇందుకోసం వివిధ శాఖలలో పైస్థాయి నుంచి కిందిస్థాయి వరకు సంపూర్ణ ప్రక్షాళన చేయనున్నట్లు తెలిపారు. పలు ఉన్నతాధికారులను పదవుల నుంచి తొలగించి సమర్థులు, యువకులతో భర్తీ చేయాలన్నది తన తండ్రి, సౌదీ రాజు అభిప్రాయమని చెప్పారు. దీనికి సంబంధించిన ప్రతిపాదన ఇటీవలే ప్రభుత్వామోదం పొందిందని చెప్పారు. ఇక ప్రభుత్వ అధికార యంత్రాంగంలోనూ సమూల ప్రక్షాళన చేయనున్నట్లు సల్మాన్ పేర్కొన్నారు.

మరో కంపెనీ.. 3972 కోట్లు!



బ్యాంకులకు భారీగా రుణం ఎగవేత

- ఆస్తులమ్మితే రూ. 1495 కోట్లే
- తలపట్టుకున్న 16 బ్యాంకులు
- కాన్పూర్‌లోనే మరో కంపెనీ టోపీ
- ఈసారి శ్రీ లక్ష్మీ కాట్సిన్ లిమిటెడ్



కాన్పూర్, ఫిబ్రవరి 28: విక్రమ్ కొఠారీకి చెందిన రోటోమ్యాక్ కంపెనీ తర్వాత కాన్పూర్ నగరానికే చెందిన మరో కంపెనీ బ్యాంకులకు భారీ మొత్తంలో టోకరా వేసింది. 16 బ్యాంకుల నుంచి రూ. 3972 కోట్ల అప్పులు తీసుకున్న శ్రీ లక్ష్మీ కాట్సిన్ లిమిటెడ్ సంస్థ అప్పులు చెల్లించకుండా ఎగ్గొట్టింది. కంపెనీ ఆస్తులను వేలం వేసి అప్పులు రాబట్టుకోవాలని ప్రయత్నించినా ప్రయోజనం కనిపించేలా లేదు. ఎందుకంటే.. మొత్తం ఆస్తులు వేలం వేసినా మహా అయితే రూ. 1495 కోట్లు మాత్రమే వస్తాయి. దాంతో పాటు.. వివిధ బ్యాంకులలో డిపాజిట్లు కేవలం రూ. 2.54 కోట్లున్నాయి. దాంతో ఏం చేయాలో అర్థం కాక పంజాబ్ నేషనల్ బ్యాంకు, సెంట్రల్ బ్యాంకు సహా మొత్తం 16 బ్యాంకులు తలపట్టుకున్నాయి. ఈ కంపెనీకి అప్పులు ఇవ్వడానికి ఏర్పడిన కన్సార్షియానికి సెంట్రల్ బ్యాంకు లీడ్ బ్యాంకుగా వ్యవహరించింది. ఈ కంపెనీ కార్యాలయం జీటీ రోడ్డులోని కృష్ణాపురంలో ఉంది. గ్రూపు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పేరు ఎంపీ అగర్వాల్. వస్త్రవ్యాపారంతో పాటు వాహనాలను మైన్ ప్రూఫ్‌గా చేయడం ఈ కంపెనీ ప్రధాన వ్యాపారం. అయితే క్రమంగా పెట్టుబడి మొత్తం కంటే నష్టాలు పెరిగిపోతుండటంతో కంపెనీ పునరుద్ధరణ అసాధ్యంగా మారింది. చివరకు నష్టాలు రూ. 1646.12 కోట్లకు చేరుకున్నాయి. దీర్ఘకాలిక రుణాలు రూ. 2406 కోట్లు కాగా, స్వల్పకాలిక రుణాలు రూ. 937 కోట్లున్నాయి.



పాత అప్పుచెల్లిండానికి కొత్త అప్పులు

ఈ కంపెనీని ఒక రకంగా చెప్పాలంటే బ్యాంకులే చెడగొట్టాయి. పాత అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు ఇవ్వడం మొదలుపెట్టాయి. అప్పుల రికవరీ కోసం మూతపడిన నాలుగు యూనిట్లను అమ్మేశాయి కూడా. మొత్తం రూ. 3972 కోట్ల రికవరీ కోసం సెంట్రల్ బ్యాంకు ముందుగా డీఆర్టీ (డెట్ రికవరీ ట్రిబ్యునల్)ను ఆశ్రయించింది.

ఇచ్చిన బ్యాంకులివే

శ్రీ లక్ష్మీ కాట్సిన్ లిమిటెడ్ కంపెనీకి మొత్తం 16 బ్యాంకులు రుణాలిచ్చాయి. వాటిలో సెంట్రల్ బ్యాంకు లీడ్‌బ్యాంకు కాగా.. ఇంకా సిండికేట్ బ్యాంకు, యూనియన్ బ్యాంకు, కెనరా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎగ్జిమ్‌బ్యాంకు, ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, ఐడీబీఐ బ్యాంకు, విజయ బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, సారస్వత్ బ్యాంకు, ఆంధ్రా బ్యాంకుతో పాటు.. ఎడెల్‌వైస్ ఎస్టేట్ రీకన్‌స్ట్రక్షన్ కూడా ఉంది.


కేతన్ పరేఖ్‌కు మూడేళ్ల జైలు

- బంధువు కార్తీక్ పరేఖ్‌కు కూడా..
- సెక్యూరిటీ స్కాంలో సెబీ కోర్టు తీర్పు



ముంబై, ఫిబ్రవరి 28: అప్పట్లో దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన స్టాక్ మార్కెట్ కుంభకోణం కేసులో సెబీ ప్రత్యేక కోర్టు బుధవారం తీర్పు వెల్లడించింది. ఈ కేసులో దోషిగా రుజువైన కేతన్ పరేఖ్, అతని బంధువు కార్తీక్ పరేఖ్‌కు కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. ఇద్దరికి చెరీ రూ.5 లక్షల చొప్పున జరిమానా విధించింది. ఈ కేసులో మరో ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. కేతన్, కార్తీక్ డైరెక్టర్లుగా ఉన్న పాంథర్ ఫిన్‌కార్ప్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ సెబీ నిబంధనలను వ్యతిరేకంగా షాంక్ టెక్నాలజీస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ నుంచి పరిమితికి మించి షేర్లను అక్రమంగా కొనుగోలు చేసింది. ఈ ఉల్లంఘనలపై విచారణను 2003లో పూర్తి చేసిన సెబీ రూ. 6.5 లక్షల జరిమానా విధించింది. దీనిపై నిందితులు సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (సాట్)ను ఆశ్రయించారు. అయితే దీన్ని(2007) తోసిపుచ్చడంతో పాటు 45రోజులలోపు ఈ జరిమానాను చెల్లించాల్సిందిగా ఆదేశించింది. అయితే సాట్ ఉత్తర్వులను సుప్రీంలో సవాల్ చేయక పోవడంతో ఈ కేసు ముగిసిందని సెబీ కోర్టు ప్రకటించింది. అలాగే జరిమానాను వాయిదాల పద్ధతిలో చెల్లిస్తామని సెబీని పరేఖ్ బ్రదర్స్‌కు వేడుకున్నారు. ఇది సెబీ నిబంధనలకు విరుద్ధమంటూ ఈ ప్రతిపాదను తోసిపుచ్చింది. పెనాల్టీని చెల్లించకపోవడంతో తదుపరి చర్యలకు సెబీ ఉపక్రమించింది. పలుసార్లు సమన్లు జారీ చేసినప్పటికీ బేఖాతరు చేయడంతో కోర్టుముందు హాజరుకావల్సిందిగా కఠిన ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే గత నవంబరులో కోర్టుకు హాజరైన కేతన్ పరేఖ్‌ను కస్టడీకి తరిలించగా అప్పటినుంచి జైల్లోనే ఉన్నాడు. దీనిపై విచారించిన సెబీ ప్రత్యేక కోర్టు తాజా తీర్పునిచ్చింది.

రానంటే రాను: నీరవ్ మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఫ్రాడ్ కేసులో సీబీఐ విచారణకు హాజరయ్యేది లేదంటూ నీరవ్ మోదీ తేల్చిచెప్పాడు. ఈ మేరకు బ్యాంక్ ఫ్రాడ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ నీరవ్‌కి ఈ మెయిల్ ద్వారా సమన్లు పంపించినట్లు సీబీఐ వెల్లడించింది. అయితే, విదేశాలలోని వ్యాపార వ్యవహారాల్లో మునిగిపోయినందున విచారణకు హాజరు కాలేనంటూ నీరవ్ జవాబిచ్చినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. దీనికి జవాబుగా విచారణకు హాజరుకావాలని, హాజరు తప్పనిసరి అని పేర్కొంటూ మరోసారి ఈమెయిల్ పంపినట్లు వివరించారు. ఈ విషయమై సంబంధిత దేశంలోని హైకమిషన్‌ను సంప్రదించి భారత్‌కు వచ్చే ఏర్పాట్లు చేసుకోవాలంటూ అందులో సూచించినట్లు తెలిపారు. పంజాబ్ నేషనల్ బ్యాంకులో 12 వేల కోట్లకు పైగా రుణం తీసుకుని, తిరిగి చెల్లించలేక వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ విదేశాలకు పారిపోయిన విషయం తెలిసిందే!

కాంగ్రెస్ ప్లీనరీకి కమిటీలు

- మన్మోహన్ సహా సీనియర్లకు చోటు
- సబ్ గ్రూప్‌లను నియమించిన రాహుల్
- 16 నుంచి 18 వరకూ సమావేశాలు
- 2019 ఎన్నికలపై చర్చ వ్యూహ రచన



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: వచ్చే నెల 16 నుంచి 18 వరకూ జరిగే కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాలకు ఆ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కమిటీలను, సబ్ గ్రూపులను ఏర్పాటు చేశారు. నిర్వాహక కమిటీ, డ్రాఫ్టింగ్ కమిటీ, దీనికి నాలుగు సబ్ గ్రూపులు, రాజ్యాంగ సవరణ కమిటీలను నియమించారు. డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, కన్వీనర్‌గా ముకుల్ వాస్నిక్, నిర్వాహక కమిటీ చైర్మన్‌గా మోతీలాల్ వోరా, కన్వీనర్‌గా ఆస్కార్ ఫెర్నాండెజ్ వ్యవహరించనున్నట్టు ఆ పార్టీ ఓ ప్రకటనలో తెలిపింది. రాజ్యాంగ సవరణ కమిటీ చైర్మన్‌గా గులాం నబీ అజాద్, కన్వీనర్‌గా జనార్దన్ ద్వివేది, సభ్యులుగా అహ్మద్ పటేల్, పి.చిదంబరం, మల్లిఖార్జన ఖర్గే, కపిల్ సిబాల్ తదితరులు ఉన్నారు. డ్రాఫ్టింగ్ కమిటీలో 44 మంది సీనియర్ నేతలు సభ్యులుగా ఉన్నారు. దీనికి రాజకీయ, ఆర్థిక వ్యవహారాలు, అంతర్జాతీయ వ్యవహారాలు, వ్యవసాయం-ఉపాధి సబ్ గ్రూప్‌లను ఏర్పాటు చేశారు. రాజకీయ సబ్ గ్రూప్ చైర్మన్‌గా ఏకే ఆంటోని, కన్వీనర్‌గా సెల్జా, ఆర్థిక వ్యవహారాల సబ్ గ్రూప్ చైర్మన్‌గా చిదంబ రం, కన్వీనర్‌గా జైరాం రమేశ్, అంతర్జాతీయ వ్యవహారాల సబ్ గ్రూప్ చైర్మన్‌గా ఆనంద్ శర్మ, కన్వీనర్‌గా జ్యోతిరాధిత్య సింధియా, వ్యవసాయం-ఉపాధి సబ్ గ్రూప్ చైర్మన్‌గా భూపిందర్ సింగ్ హుడా, కన్వీనర్‌గా మీనాక్షి నటరాజన్ వ్యవహరిస్తారు. 2019 ఎన్నికల్లో బీజేపీని ఓడించి, అధికారంలోకి రావడానికి అనుసరించాల్సిన వ్యూహంపై ప్లీనరీలో చర్చిస్తారు. అలాగే ఈ ఏడాది జరిగే కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఎన్నికలపై దృష్టిసారించనున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడిగా రాహుల్ గాంధీ ఎన్నికయ్యాక జరగనున్న తొలి ప్లీనరీ సమావేశం ఇదే.



ఎంపీలో కాంగ్రెస్.. ఒడిశాలో బీజేడీ!

- అసెంబ్లీ ఉప ఎన్నికల్లో ఘన విజయం




భోపాల్/ భువనేశ్వర్, ఫిబ్రవరి 28: మధ్యప్రదేశ్‌లో రెండు అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ విజయఢంకా మోగించింది. ముంగోలీ, కోలారాస్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఘన వజయం సాధించారు. ముంగోలీలో కాంగ్రెస్ అభ్యర్థి బ్రిజేంద్ర సింగ్ యాదవ్ బీజేపీ అభ్యర్థి బాయ్ సాహబ్ యాదవ్‌పై 2 వేల ఓట్లతో విజయం సాధించారు. కోలారాస్ స్థానంలోనూ కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందారు. ఒడిశాలోని బీజేపూర్ స్థానానికి జరిగిన ఎన్నికల్లో అధికార బీజేడీ ఘన విజయం సాధించింది. ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి చనిపోవడంతో ఎన్నికలు జరగగా.. ఆ స్థానాన్ని బీజేడీ కైవసం చేసుకుంది. ఇక్కడ 41 వేల ఓట్ల తేడాతో రీటా సాహు విజయం సాధించారు. రెండో స్థానంలో బీజేపీ నిలవగా.. మూడో స్థానంలో కాంగ్రెస్ నిలిచింది.

కలకలం రేపిన ఉత్తరం

- అమెరికా మిలటరీ బేస్ భవనం ఖాళీ
- ఆస్పత్రిపాలైన 11 మంది సైనికులు

వాషింగ్టన్, ఫిబ్రవరి 28: ఓ ఉత్తరం అమెరికా భద్రత దళాలకు ముచ్చెమటలు పట్టించింది. వాషింగ్టన్ సమీపంలోని యూఎస్ మిలటరీ బేస్‌లో పని చేస్తున్న 11 మంది సైనికులు ఆస్పత్రిలో చేరేలా చేసింది. వర్జినీయాలోని అర్లింగ్టన్‌లో ఉన్న జాయింట్ బేస్ ఫోర్ట్ మైర్- హెండర్‌సన్ హాల్‌కు మంగళవారం వచ్చిన ఎన్వలప్ కవర్‌ను సాయుధుడైన ఓ సర్జంట్ తెరిచాడు. అయితే ఆ కవరులో ఉన్న గుర్తు తెలియని పదార్థం వల్ల 11 మంది సైనికులు అస్వస్థతకు గురయ్యారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు ఆ భవనం మొత్తాన్ని ఖాళీ చేశారు. ఈ ఘటనపై ఎఫ్‌బీఐ విచారణ చేపట్టింది. ఆస్పత్రి పాలైన సైనికులు చేతులు, మొహంపై దద్దుర్లు, ముక్కు నుంచి రక్తం కారడం వంటి సమస్యలతో బాధపడుతున్నారని మెరైన్ అధికారి ఒకరు చెప్పారు. ప్రాథమిక పరిశీలనలో ఆ కవరులో ఎలాంటి హానికర పదార్థం కనిపించలేదని, అయితే ఎఫ్‌బీఐ అధికారులు ఆ కవరును క్వాంటీకోలోని తమ పరిశోధన కేంద్రానికి తరలించారని అధికారులు చెప్పారు. ఆ ఉత్తరం మెరైన్ హెడ్ క్వార్టర్స్ బెటాలియన్ చిరునామాతో వచ్చిందని అధికారులు తెలియజేశారు.



సీబీఎస్ఈ పరీక్షల్లో..
దివ్యాంగులకు వెసులుబాటు

- కంప్యూటర్ వాడుకునే అవకాశం
- ఈ ఏడాది నుంచే అమలు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: శారీరక వైకల్యంతో బాధపడుతున్న విద్యార్థులు 10, 12వ తరగతుల బోర్డు పరీక్షలలో కంప్యూటర్ లేదా ల్యాప్‌టాప్ ఉపయోగించుకునే వెసులుబాటును కల్పిస్తూ సీబీఎస్ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం ఈ ఏడాది నుంచే అమలులోకి వస్తుందని పేర్కొంది. ఈమేరకు అధికారిక ఉత్తర్వులు జారీచేసింది. అయితే, ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని భావించే విద్యార్థులు తప్పనిసరిగా వైద్యులు జారీచేసిన ధ్రువపత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని పేర్కొంది. బోర్డు పరీక్షలలో సదరు విద్యార్థి కంప్యూటర్/ల్యాప్‌టాప్ ఉపయోగించుకోవచ్చంటూ ఓ సిఫార్సు లేఖనూ జతచేయాలన్న నిబంధన విధించింది. ఇందులో విద్యార్థి వైకల్యం, కంప్యూటర్ వినియోగించాల్సిన అవసరాన్ని స్పష్టంగా వివరించాలని తెలిపింది. కాగా, ఈ ఏడాది నుంచి దివ్యాంగులకు సంబంధించి మరింత వెసులుబాటును కల్పించాలని సీబీఎస్ఈ పరీక్షల కమిటీ ఇటీవలి సమావేశంలో నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగానే తాజా నిర్ణయం తీసుకున్నట్లు అధికారవర్గాల సమాచారం! అయితే, పరీక్షలకు ముందుగానే ఈ సదుపాయం కోసం దరఖాస్తు చేసుకోవాలని, విద్యార్థి తన సొంత కంప్యూటర్‌ను/ల్యాప్‌టాప్‌ను తెచ్చుకోవాలని చెప్పారు.

ఎంపీల అలవెన్స్ పెంపు

- ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28: పార్లమెంటు సభ్యుల అలవెన్సులను పెంచే ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఇందులో ప్రధానంగా ఎంపీల నియోజకవర్గ అలవెన్సులతో పాటు ఫర్నీచర్ అలవెన్సు పెరగనున్నట్లు అధికార వర్గాల సమాచారం. ఈమేరకు నియోజకవర్గ అలవెన్స్‌ను రూ.45 వేల నుంచి రూ.60 వేలకు పెంచుతూ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కేబినెట్‌కు ప్రతిపాదించింది. దీంతోపాటు ఫర్నీచర్ అలవెన్స్(ఒకేసారి చెల్లించే మొత్తం)ను ప్రస్తుతం ఉన్న రూ.75 వేల నుంచి రూ. లక్షకు పెంచాలని పేర్కొంది. ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుడికి రూ.50 వేల జీతంతో పాటు రూ.45 వేల నియోజకవర్గ అలవెన్స్ సహా ఇతర ప్రయోజనాలను ప్రభుత్వం అందజేస్తోంది. ఒక్కో ఎంపీపై కేంద్రం నెలకు దాదాపుగా రూ.2.7 లక్షలు ఖర్చుచేస్తోంది. ప్రస్తుతం స్పీకర్ మినహా లోక్‌సభలో 536 మంది సభ్యులు, రాజ్యసభలో 239 మంది సభ్యులు ఉన్నారు. కాగా, పార్లమెంట్ సభ్యుల జీతభత్యాల సవరణ కోసం శాశ్వత విధానాన్ని ఏర్పాటు చేయనున్నట్లు, ఐదేళ్లకు ఓసారి ద్రవ్యోల్బణం ఆధారంగా జీతాల సవరణ చేపట్టేలా చర్యలు తీసుకోనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి జైట్లీ వెల్లడించిన విషయం తెలిసిందే!

ట్రంప్ అల్లుడికి షాక్!

- సెక్యూరిటీ క్లియరెన్స్‌లో ఇవాంక భర్త కుష్‌నర్ విఫలం
- కీలక సమాచారం తెలుసుకునే వీలుండదు!



వాషింగ్టన్, ఫిబ్రవరి 28: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్లుడు జేర్డ్ కుష్‌నర్‌కు ఊహించని షాక్ తగిలింది. ఆయన టాప్ లెవల్ సెక్యురిటీ క్లియ రెన్స్‌లో విఫలమయ్యారు. దీనివల్ల అమెరికాకు చెందిన అత్యంత కీలకమైన రహస్య సమాచారాలను తెలుసుకునే అనుమతి ఉండదు. ట్రంప్ కుమార్తె ఇవాంక ట్రంప్ భర్త కుష్‌నర్. 37 ఏళ్ల కుష్‌నర్ ట్రంప్ యంత్రాంగంలో కీలక వ్యక్తిగా పని చేస్తున్నారు. ప్రస్తుతం కుష్నర్‌ట్రంప్‌కు సలహాదారుగా వ్యవహరిస్తున్నారు. అయితే కుష్‌నర్ ఉన్నత స్థాయి సెక్యురిటీ క్లియరెన్స్‌లో విఫలమవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఆయన 'టాప్ సీక్రెట్/ సెన్సిటివ్ కంపార్ట్‌మెంటెడ్ ఇన్ఫర్మేషన్' తెలుసుకునే అవకాశం కోల్పోయారని సంబంధిత వర్గాలు చెప్తున్నాయి. కానీ వైట్‌హౌస్ గానీ, అధ్యక్షుడు ట్రంప్ గానీ దీనిపై స్పం దించలేదు. కుష్నర్ ఉన్నత స్థాయి భద్రతపరమైన క్లియరెన్స్‌లో విఫలమవ్వడం అందరికీ పలు అనుమానాలు కలిగిస్తోంది. వైట్‌హౌస్‌లో ఏం జరుగుతుందోనని అనుకుంటున్నారు. కుష్‌నర్ మధ్య ప్రాచ్యంలో శాంతి నెలకొల్పేందుకు చర్చలు జరుపుతున్నారు. ఇజ్రాయెల్, పాలస్తీనాల మధ్య రాజీ చేసేందకు ప్రయత్నిస్తున్న వారిలో అతను ముఖ్యమైన వారు. అయితే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వైట్‌హౌస్ పర్యటనకు వచ్చిన కొద్ది రోజుల్లోనే కుష్నర్ విషయంలో ఇలాంటి నిర్ణయం తీసుకోవడం గమనార్హం. అయితే ఈ మార్పు వల్ల కుష్‌నర్ పదవిపై ఎలాంటి ప్రభావం పడదని అధికారులు చెప్పినట్లు తెలుస్తోంది. ట్రంప్ యంత్రాంగంలోని ప్రముఖ సహాయకుడు రాబ్ పోర్టర్ పూర్తి సెక్యురిటీ క్లియరెన్స్ లేకుం డానే కొన్ని నెలల పాటు పనిచేయడంతో వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జాన్ కెల్లీ క్లియరెన్స్ సిస్టమ్‌లో మార్పులు చేయాలని ఆదేశించారు. ఇటీవల దక్షిణ కొరియాకు వెళ్లిన ఇవాంక ఆ దేశ అధ్యక్షుడు మూన్ జే ఇన్‌తో ఉత్తర కొరియాపై తాజా ఆంక్షల గురించి మాట్లాడారట.



• మహేష్

విజన్ ఆఫ్ భరత్

మహేశ్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'భరత్ అనే నేను'. డి.వి.వి.ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై దానయ్య డి.వి.వి. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ దశలో ఉంది. హైదరాబాద్, పూణేల్లో జరిగే షెడ్యూల్స్‌తో మార్చి 27 నాటికి షూటింగ్ పూర్తవుతుంది. ఇప్పుడు మార్చి 6న 'ది విజన్ ఆఫ్ భరత్'ను విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం తెలియజేసింది. ఏప్రిల్ 20న సినిమాను విడుదల చేస్తారు. మహేష్ సరసన కైరా అద్వాని హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ చిత్రంలో మహేశ్ ముఖ్యమంత్రి పాత్రలో కనిపిస్తారు.

ఒక్క పాట కూడా ఉండదు


• వరుణ్‌తేజ్

'ఫిదా', 'తొలిప్రేమ' వంటి డీసెంట్ సినిమాలతో రెండు విజయాలు అందుకున్న వరుణ్‌తేజ్ 'ఘాజీ' ఫేం సంకల్ప్‌రెడ్డి దర్శకత్వంలో ఓ ప్రయోగాత్మక చిత్రంలో నటించబోతున్నారు. అంతరిక్షం నేపథ్యంలో ఓ కొత్త తరహా చిత్రంగా రూపొందుతున్న ఈ చిత్రంలో వరుణ్‌తో ఇద్దరు హీరోయిన్లు జతకడుతున్నారు. సాధారణంగా ఒక హీరోయిన్ ఉంటేనే నాలుగైదు పాటలు ఉంటాయి. అలాంటిది ఇద్దరు హీరోయిన్లు ఉండే ఈ సినిమాలో పాటలు ఎలా ఉండబోతున్నాయి అనేది ఒక్కమాటలో చెప్పాలంటే అసలు పాటలే ఉండవట. కథే ప్రాణంగా రూపొందే ఈ సినిమాలో పాటల అవసరం ఉండదని తెలుస్తోంది. ప్రస్తుతం స్క్రిప్ట్ దశలో ఉన్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో తెరకెక్కించనున్నారు. ఏప్రిల్ చివరి వారంలో ఈ సినిమా తొలి షెడ్యూల్ ప్రారంభమవుతుందని తెలుస్తోంది. ఈ చిత్రానికి జ్ఞానశేఖర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. పూర్తి వివరాలు త్వరలోనే తెలిసే అవకాశం ఉంది.


• అల్లు అర్జున్

టన్నెల్‌లో బన్నీ!

టన్నెల్‌లో బన్నీకి ఏం పని? అని అనుకుంటున్నారా? విద్రోహులతో బన్నీ తలపడనున్నారు. ఇంతకూ ఎవరా విద్రోహులు? అంటే మాత్రం సినిమా చూడాల్సిందేనని అంటుంది చిత్ర యూనిట్. అల్లు అర్జున్ హీరోగా నటిస్తోన్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. అను ఇమ్మాన్యుయల్ కథానాయిక. మే 4న సినిమా విడుదల కానుంది. ఈ సినిమాకు సంబంధించిన యాక్షన్ పార్ట్‌ను చిత్రీకరిస్తున్నారు. ముఖ్యంగా ఇంటర్వెల్ బ్లాక్‌లో వచ్చే భారీ యాక్షన్ సీన్ కోసం హైదరాబాద్ నానక్‌రామ్ గూడలో ఓ టన్నెల్ సెట్‌ను రెడీ చేశారు. లగడపాటి శిరీషా శ్రీధర్, నాగబాబు సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ సినిమాలో బన్నీ ఆవేశంతో కూడిన ఆర్మీ ఆఫీసర్ పాత్రలో కనపడనున్నారు. ఆల్‌రెడీ విడుదలైన ఫస్ట్ ఇంపాక్ట్‌కి ప్రేక్షకుల నుండి చాలా మంచి స్పందన వచ్చింది. వక్కంతం వంశీ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది.

'దండుపాళ్యం 4' ఫస్ట్‌లుక్

వెంకట్ మూవీస్ బ్యానర్‌పై కె.టి.నాయక్ దర్శకత్వంలో వెంకట్ నిర్మిస్తున్న చిత్రం 'దండుపాళ్యం 4'. ఈ సినిమా షూటింగ్ మార్చి 8న ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీకాంత్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ''దండుపాళ్యంకు ఉన్న క్రేజ్ తెలిసిందే. ముందు విడుదలైన సినిమాలు ఎంత పెద్ద సక్సెస్‌ను సాధించాయి. ఇందులో విషయాన్ని ఆధారంగా చేసుకుని ఎన్ని పార్టులైనా షూటింగ్ చేయవచ్చు. 'దండుపాళ్యం 4' పెద్ద విజయాన్ని సాధించాలి'' అన్నారు. నిర్మాత వెంకట్ మాట్లాడుతూ ''ఈ సినిమాకు పనిచేయనున్న దర్శకుడు కె.టి.నాయక్ మంచి ఇంటెలిజెంట్.. హార్డ్‌వర్కర్. కొందరి వ్యక్తిగత అహం కారణంగా 'దండుపాళ్యం 2' నేను అనుకున్నట్లుగా రాలేదు. ఆడియెన్స్‌ను ఏమైతే సినిమాలో ఉండాలనుకుని థియేటర్‌కి వచ్చారో అది సినిమాలో లేదు. దాంతో ఓ కసితో 'దండుపాళ్యం 4'ను స్టార్ట్ చేశాను. పక్కా స్క్రిప్ట్‌తో సినిమాను స్టార్ట్ చేస్తున్నాం. మార్చి 8న సినిమా షూటింగ్ స్టార్ట్ అవుతుంది. దండుపాళ్యం4లో రెండు గ్యాంగ్‌లుంటాయి. మొదటి మూడు పార్ట్స్‌లో నటించిన నటీనటులతో పాటు వేరే గ్యాంగ్ కూడా ఇందులో కనపడుతుంది'' అన్నారు. దర్శకుడు కె.టి.నాయక్ మాట్లాడుతూ ''నాకు నిర్మాతగారు ఇచ్చిన పనిని 100 శాతం నేరవేరుస్తాను. ప్రేక్షకుల అంచనాలకు ధీటుగా ఈ సీక్వెల్ ఉంటుంది'' అన్నారు.





'ఐతే 2.0' పాట విడుదల

ఇంద్రనీల్ సేన్‌గుప్తా, జారా షా, అభిషేక్, కర్తవ్య శర్మ, నీరజ్, మృణాల్, మృదాంజలి కీలక పాత్రధారులుగా రాజ్ మాదిరాజు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఐతే 2.0'. ఫర్మ్ 9 పతాకంపై కె.విజయరామారాజు, హేమంత్ వల్లపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మార్చి 16న సినిమా విడుదలవుతుంది. ఈ సినిమాలో 'నింగిపై...' అనే పాటను ప్రముఖ సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి విడుదల చేశారు. ఈ కార్యకమంలో ఇంకా కల్యాణి మాలిక్, చిత్ర దర్శకుడు రాజ్ మాదిరాజు, సంగీత దర్శకుడు అరుణ్ చిలువేరు, నరేశ్ అయ్యర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం.ఎం.కీరవాణి మాట్లాడుతూ ''సాంగ్ విన్నాను. చాలా కొత్తగా అనిపించింది. అరుణ్ చిలువేరు మంచి సంగీతాన్ని అందించారు. సినిమాలోని మిగిలిన రెండు పాటలు కూడా శ్రోతలను ఆకట్టుకుంటాయనే నమ్మకం ఉంది'' అని తెలిపారు. డైరెక్టర్ రాజ్ మాదిరాజు మాట్లాడుతూ ''ఈ సినిమాలో మూడు పాటలు ఉన్నాయి. ఆకలి, ఆశ, కోపం అనే మూడు అంశాలపై ఈ మూడు సాంగ్స్ ఉంటాయి. అరుణ్‌ని ఈ చిత్రం ద్వారా మ్యూజిక్ డైరెక్టర్‌గా పరిచయం చేస్తుండటం ఆనందంగా ఉంది'' అన్నారు. నిర్మాత విజయ్ రామరాజు మాట్లాడుతూ ''మార్చి 16న సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అని తెలిపారు.


• సాయిపల్లవి

అది నా అదృష్టం

''నేను ఇప్పటివరకు చేసిన సినిమాల్లోని హీరోయిన్స్‌ది ఒకదారి అయితే సాయిపల్లవిది మరో దారి. 'కణం' షూటింగ్ జరుగుతున్నప్పుడు ఎప్పుడూ టైమ్‌కి లొకేషన్‌కి రాలేదు. డిసిప్లిన్ లేదు. షూటింగ్ జరిగినన్ని రోజులు ఆమె వల్ల చాలా ఇబ్బందులు పడ్డాం. 'ఫిదా' సక్సెస్ అయ్యిందంటే అది ఒక్క సాయిపల్లవి వల్లనే కాదు, ఆ విజయం వెనుక యూనిట్ కృషి కూడా ఉంది'' అని సాయిపల్లవి గురించి నాగశౌర్య కామెంట్ చేశారని మీడియాలో కథనాలు వినిపించాయి. ఈ విషయంపై సాయిపల్లవి కాస్త ఆలస్యంగా స్పందించింది. ''తమ అభిప్రాయాన్ని చెప్పే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుంది. ఇతరుల మనోభావాలను నేను గౌరవిస్తాను. నాగశౌర్యకి నాతో ఉన్న ప్రాబ్లమ్ ఏంటో తెలియదు. నా గురించి అతను మాట్లాడిన మాటలు విని బాధపడ్డాను. డైరెక్టర్ విజయ్‌గారికి ఫోన్ చేసి 'నా ప్రవర్తన వల్ల షూటింగ్ స్పాట్‌లో ఎవరికైనా ఇబ్బంది కలిగిందా?' అనడిగాను. ఆయన లేదన్నారు. ఎవరైనా నాపై కంప్లయింట్ చేశారా? అని కూడా అడిగాను. 'నో' అన్నారు. నా అదృష్టం కొద్దీ ఈ విషయాన్ని నాగశౌర్య దాచలేదు. ఓపెన్‌గా కామెంట్ చేశారు. మంచిదే'' అన్నారు.

రామచిలకా పెళ్లి కొడుకెవరే?



తెలుగు, తమిళ్, హిందీ భాషల్లో ఎన్నో సూపర్‌హిట్ చిత్రాల్లో హీరోయిన్‌గా నటించిన శ్రియ శరన్ త్వరలో పెళ్లి చేసుకోబోతందనే వార్త ఆమధ్య మీడియాలో హల్‌చల్ చేసింది. రష్యాకు చెందిన క్రీడాకారుడు, వ్యాపారవేత్త ఆండ్రీ కొవిచ్‌తో సన్నిహితంగా ఉంటోందని, వారి మధ్య ప్రేమాయణం సాగుతోందని కూడా మీడియాలో వార్తలు వచ్చాయి. తన పెళ్లికి సంబంధించిన షాపింగ్ కూడా చేసిందని శ్రియ పెళ్ళిని ఖరారు చేసింది సోషల్ మీడియా. అయితే తన స్నేహితురాలి పెళ్లి కోసం షాపింగ్ చేశానని, తన పెళ్లి కోసం కాదని ఆ వార్తని కొట్టి పారేసింది శ్రియ. కానీ, ఆమె పెళ్లి వార్త మరోసారి గుప్పుమంది. మార్చిలో ఆమె పెళ్లి చేసుకోబోతోందని తెలుస్తోంది. ఉదయ్‌పూర్‌లో మార్చి 17, 18, 19 తేదీల్లో మూడు రోజులపాటు వివాహ వేడుకను నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. శ్రియ స్నేహితులు పెళ్లికి సిద్ధం అవుతున్నారని, ఆమె కూడా తన శ్రేయోభిలాషులు, సహనటులకు ఆహ్వానాలు పంపినట్లు సమాచారం. హిందూ సంప్రదాయం ప్రకారం ఈ వివాహం జరుగుతుందని తెలుస్తోంది. శ్రియ ప్రస్తుతం 'వీరభోగ వసంత రాయలు' చిత్రంలో నటిస్తున్నారు. దీనితోపాటు 'తడ్కా' అనే హిందీ సినిమా, 'నరగాసురన్' అనే తమిళ సినిమాలో శ్రియ నటిస్తోంది.


• రాజ్‌తరుణ్

'లవర్' వచ్చేస్తున్నాడు

తొలి చిత్రం 'ఊయ్యాల జంపాల'తో సక్సెస్‌ఫుల్ హీరోగా కెరీర్‌ను స్టార్ట్‌చేసిన యువ కథానాయకుడు రాజ్‌తరుణ్ హీరోగా.. దిల్‌రాజు నిర్మాణ సారథ్యంలో రూపొందుతోన్న చిత్రం 'లవర్' అనీశ్ కృష్ణ దర్శకుడు. ఈ సినిమా ప్రేమలోకి కొత్త కోణాలను టచ్ చేసేలా తెరకెక్కుతుంది. ఈ చిత్రం ద్వారా రిద్ధి కుమార్ హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నారు. సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. ప్రవీణ్ పూడి ఎడిటింగ్ వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణను జరుపుకుంటోన్న ఈ సినిమాను జూన్ 14న విడుదల చేయడానికి నిర్మాత దిల్‌రాజు సన్నాహాలు చేస్తున్నారు.

టీచర్ పాత్రలో...

మలయాళ, తమిళ సినిమాల్లో నటిస్తున్న అంజు కురియన్ సుమంత్ హీరోగా రూపొందుతోన్న థ్రిల్లర్ చిత్రం ద్వారా తెలుగు చిత్ర సీమలోకి ఎంట్రీ ఇస్తున్నారు. 'నాకు ఇది వరకు తెలుగులో చాలా అవకాశాలు వచ్చాయి. అయితే తెలుగు భాషను చూసి కాస్త వెనుకంజ వేశాను. అయితే దర్శకుడు అనిల్‌కుమార్ స్క్రిప్ట్ వినగానే నచ్చింది. వెంటనే చేస్తానని చెప్పేశాను. ఈ సినిమాలో ప్లే స్కూల్ టీచర్ పాత్రలో నటించాను. అయితే పాత్రలో ఉన్న ఇన్‌టెన్సిటి నచ్చింది. దర్శకుడు అనిల్‌కి చాలా క్లారిటీ ఉంది. సుమంత్‌తో వర్క్ చేయడం గొప్ప అనుభవం. తను మంచి సపోర్టివ్ ఆర్టిస్ట్. తెలుగు డైలాగ్స్‌కు నాకు అర్థం చెప్పి వాటిని ఎలా పలకాలో నాకు నేర్పించేవాడు. దాంతో నేను డైలాగ్స్‌ను ఎక్స్‌ప్రెసివ్‌గా చెప్పగలిగాను. ఇక్కడి వర్కింగ్ నేచర్ నాకు బాగా నచ్చింది. టాలీవుడ్‌లో మరిన్ని సినిమాలు చేయాలనుకుంటున్నాను' అని అంటుంది మలయాళ సుందరి అంజు కురియన్.


• అంజు కురియన్


ఫరూక్, కోడెలను కలిసిన నార్మన్ ఫోస్టర్స్ ప్రతినిధులు

భద్రతపై రాజీపడొద్దు

- సభ్యుల పట్ల అనుచితంగా ప్రవర్తించొద్దు
- అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు పటిష్ట భద్రత
- రాజ్యసభ ఎన్నికలకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు
- అక్రిడేషన్ ఉంటేనే మీడియాకు అనుమతి
- పోలీసు అధికారులకు ఫరూక్, కోడెల సూచన

అమరావతి, ఫిబ్రవరి 28 (మనం ప్రతినిధి): మార్చి 5వ తేదీ నుంచి జరగబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను శాసన మండలి చైర్మన్ ఎన్ఎండీ ఫరూక్, అసెంబ్లీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆదేశించారు. బుధవారం అసెంబ్లీ హాల్‌లో పోలీసు ఉన్నతాధికారులతో బడ్జెట్ సమావేశాల భద్రతపై వీరిద్దరూ కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ లాబీల్లోకి విజటర్స్ వస్తున్నారని, అటువంటి వారిని అడ్డుకోవాలని భద్రత సిబ్బందికి ఫరూక్ సూచించారు. అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద పనిచేసే పోలీసు అధికారులు సభ్యుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. బడ్జెట్ సమావేశాల తొలి రోజు మార్చి 5న అసెంబ్లీకి గవర్నర్ నరసింహన్ వస్తున్న నేపథ్యంలో గట్టి భద్రత ఏర్పాట్లు చేయాలని స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆదేశించారు. అలాగే మార్చి 23న జరిగే రాజ్యసభ ఎన్నికలకు అసెంబ్లీలో పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. భద్రతకు అవసరమైన సిబ్బందిని సమీకరించుకోవాలని స్పీకర్ కోడెల సూచించారు. అసెంబ్లీ సందర్శకులకు ముందురోజే పాస్‌లు జారీ చేయాలని, సభ లోపలికి వచ్చే సమయంలో వారి దగ్గర ఉన్న వస్తువులను స్వాధీనం చేసుకోవాలన్నారు. సందర్శకులు వేచి ఉండేలా.. 3వ నెంబర్ గేట్ వద్ద టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వేసవి కావడంతో తాగునీటి కొరత రానీయొద్దని, ఎప్పటికప్పుడు పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా భద్రత విషయంలో ఎక్కడా రాజీపడొద్దన్నారు. అసెంబ్లీ, మండలి ఎదుట ధర్నాలు వంటి ఆందోళన కార్యక్రమాలు జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మీడియా సిబ్బందికి ఇప్పటికే పాస్‌లు అందజేశామని.. అక్రిడేషన్ కార్డు లేకుండా అసెంబ్లీ ఆవరణలోకి ఎవ్వరినీ అనుమతించొద్దని స్పీకర్ కోడెల ఆదేశించారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ హరీష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు నాయుడు నివాసం సమీపంలో ఉన్న కరకట్ట మీదుగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు సీనియర్ అధికారుల వాహనాల రాకపోకలు సాగించేలా భద్రత చేపట్టామన్నారు. గవర్నర్ పర్యటనకు భద్రత పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటికే రిహార్సల్స్ సైతం నిర్వహించామన్నారు.

వైసీపీ సభ్యులను ఆహ్వానిస్తున్నాం: కోడెల

బడ్జెట్ సమావేశాలకు వైసీపీ హాజరు కావాలని, అందరి సభ్యుల మాదిరిగానే వారినీ ఆహ్వానిస్తున్నామని స్పీకర్ కోడెల వెల్లడించారు. గత సమావేశాలను వైసీపీ సభ్యులు బహిష్కరించారని గుర్తు చేశారు. సభ్యులకు సభలో మాట్లాడే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు.

100 రోజులు ప్రజా సంకల్పయాత్ర

జగన్ పాదయాత్రలో మరో మైలురాయి.. 6 జిల్లాలు.. 43 అసెంబ్లీ నియోజక వర్గాలు

- 1350 కిలో మీటర్లు పూర్తయిన యాత్ర
- నేడు పాదయాత్రకు విరామం
- హోదా కోసం కలెక్టరేట్ల ముట్టడి
- మార్చి 2 నుంచి యాత్ర కొనసాగింపు

ఒంగోలు, ఫిబ్రవరి 28: ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర 100 రోజులు పూర్తి చేసుకుంది. ఇప్పటి వరకూ 6 జిల్లాలు, 43 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పాదయాత్ర చేసిన జగన్.. దారి పొడవునా అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం ప్రకాశం జిల్లాలో పాదయాత్ర చేస్తున్నారు. నిరుడు నవంబరు 6న కడప జిల్లా ఇడుపులపాయలో ప్రజా సంకల్పయాత్రకు శ్రీకారం చుట్టారు. కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో యాత్ర పూర్తి చేశారు. బుధవారం ప్రకాశం జిల్లా కొడేపి నియోజకవర్గం ఉప్పలపాడులో యాత్ర 100వ రోజుకు చేరుకుంది. పాదయాత్రలో భాగంగా జగన్ ప్రతి 100 కిలో మీటర్లకు ఓ మొక్కను నాటుతున్నారు. కర్నూలు జిల్లాలో 100, 200, 300 కి.మీ మైలురాళ్లు.. అనంతపురం జిల్లాలో 400, 500, 600.. చిత్తూరు జిల్లాలో 700, 800, 900.. నెల్లూరు జిల్లాలో 1000, 1100.. ప్రకాశం జిల్లాలో 1200, 1300 కి.మీను పూర్తి చేశారు.

మరింత అంకితభావంతో..

''ఈ రోజుతో పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకుంది. ప్రతి రోజు మీ అప్యాయత, మద్దతు లభిస్తోంది. మెరుగైన ఆంధ్రప్రదేశ్ కోసం రోజూ మనమందరం కలసి నడుస్తున్నాం. మీ ఆత్మీయత, అభిమానంతోనే యాత్ర సాగిస్తున్నా. ప్రజా సంకల్పయాత్రలో రోజులు గడిచేకొద్దీ మరింత అంకితభావంతో మళ్లీ రాజన్న రాజ్యం తెచ్చేందుకు ముందుకు సాగుతున్నా'' అని 100 రోజులు పూర్తయిన సందర్భంగా జగన్ ట్వీట్ చేశారు.

మార్చి 1న పాదయాత్రకు బ్రేక్

ప్రత్యేక హోదా సాధన కోసం వైసీపీ పోరాటం తీవ్రం చేసిందని, మార్చి 1న కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్టు వైసీపీ ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం తెలిపారు. దీంతో ఆ రోజు పాదయాత్రకు విరామం ఉంటుందని తెలిపారు. కలెక్టరేట్ల ముట్టడి, ధర్నా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని జగన్ ఆదేశించినట్టు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనేందుకు వీలుగా ఆ రోజు ప్రజా సంకల్పయాత్ర ఉండదని, శిబిరం నుంచి జగన్ పార్టీ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారని తెలిపారు. మార్చి 2న పాదయాత్ర మళ్లీ ప్రారంభమవుందని చెప్పారు. మార్చి 3న ఢిల్లీ వెళ్లనున్న ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసి, వాహనశ్రేణికి జగన్ జెండా ఊపి ప్రారంభిస్తారు. మార్చి 5న జంతర్ మంతర్ వద్ద ప్రత్యేక హోదా కోసం వైసీపీ ధర్నా చేపట్టనుంది.


ప్రకాశం జిల్లాలో ప్రజా సంకల్పయాత్రలో పాల్గొన్న వైఎస్ జగన్


తరగతి గదులను ప్రారంభిస్తున్న మంత్రి గంటా

మహేశ్ బాబు సేవలు భేష్

- గ్రామాల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యం: గంటా
- దత్తత గ్రామం బుర్రిపాలెంలో అభివృద్ధి పనులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 28 (మనం న్యూస్): ప్రముఖ సినీ నటుడు మహేశ్ బాబు దత్తత గ్రామం గుంటూరు జిల్లా బుర్రిపాలెంలో బుధవారం పలు అభివృద్ధి పనులను మంత్రి గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. మహేశ్ నాన్నమ్మ ఘట్టమనేని నాగరత్నమ్మ, తాతయ్య రాజాల పేర్లతో గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగు అదనపు తరగతి గదులను నిర్మించారు. గంటా శ్రీనివాసరావు ఈ తరగతి గదులను ప్రారంభించారు. పలు అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. వీటితో పాటు గ్రామంలో ఉప ప్రణాళికా నిధులతో నిర్మించిన సీడీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో మంత్రి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని అన్నారు. మహేశ్ బాబు చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో తెనాలి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ జానీమూన్, ఆర్.జె.డి శ్రీనివాసరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.


సాగర్ డ్యాంపై పోలీస్ పహారా


నీటి కోసం మరోమారు వివాదం

- నాగార్జునసాగర్‌పై ఇరురాష్ట్రాల అధికారుల రగడ

నాగార్జునసాగర్ (హిల్‌కాలనీ), ఫిబ్రవరి 28 (మనం న్యూస్): నాగార్జున సాగర్ జలాల విషయంలో మరో మారు వివాదం రేగింది. తమ వాటా పూర్తి కాకుండానే కుడి కాల్వకు నీటి విడుదల నిలిపివేశారంటూ ఏపీ అధికారుల అసహనం వ్యక్తం చేయగా, కృష్ణ రివర్ బోర్డు ఆదేశాల మేరకే నిలిపివేశామంటూ తెలంగాణ అధికారులు చెబుతున్నారు. దీంతో నాగార్జునసాగర్ డ్యాంపై తెలుగు రాష్ట్రాల మధ్య మరో మారు రగడ రేగింది. బుధవారం జరిగిన వివాదం రాష్ట్ర విభజన తర్వాత మూడోది. డ్యాం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సాగర్ పరిధిలోని కుడి కాల్వకు కేటాయించిన 60 టీఎంసీల నీటి వాటాలో భాగంగా గత ఏడాది అక్టోబర్ 31వ తేదీ నుంచి నీటి విడుదల ప్రారంభించారు. ఈ నాలుగు నెలల కాలంలో కుడి కాల్వకు కేటాయించిన నీటి వాటా పూర్తి కావడంతో కృష్ణ రివర్ బోర్డు ఆదేశాల మేరకు అధికారులు బుధవారం ఉదయం 6 గంటలకు కుడి కాల్వకు నీటిని నిలిపివేశారు. తమ ఇంకా 0.23 టీఎంసీల నీరు రావాల్సి ఉందని ఏపీ నీటి పారుదల శాఖ అధికారులు చెబుతుతున్నారు. ఈ విషయంపై డ్యాంపై ఉన్న కంట్రోల్ రూమ్‌లో ఏపీ ప్రాంతానికి చెందిన ఈఈ వెంకటస్వామి, డీఈ సత్యనారాయణ, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఈ వెంకట్‌రెడ్డి, డీఈ విజయ్ కుమార్‌ను అడిగారు. కృష్ణ రివర్ బోర్డు ఆదేశాల మేరకే నీటి విడుదల ఆపేశామని అధికారులు వారికి చెప్పారు. ఏపీ అధికారులు మాత్రం అవన్నీ మాకు తెలియదు, మా వాటా మాకు కావాలని పట్టుబట్టారు. ఏపీ అధికారుల తీరును వ్యతిరేకిస్తూ స్థానిక టీఆర్ఎస్ నేతలు బ్రహ్మారెడ్డి, రమేష్, సుధీర్, మన్సూరు, వీరయ్య, చాంద్‌పాషా, శాంతికుమారి తదితరులు ప్రధాన డ్యాం వద్ద నిరసన తెలిపారు.

సర్వ మతాల సారం ఒక్కటే

- నోబెల్ గ్రహీత కైలాస్ సత్యార్థి



కరీంనగర్, ఫిబ్రవరి 28(మనం బ్యూరో): సర్వమతాల సారాంశం ఒక్కటేనని, పిల్లలు ఆనందంగా ఉంటే దేవుడు సంతోషంగా ఉంటాడని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాస్ సత్యార్థి అన్నారు. కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో బుధవారం జరిగిన బాలల మిత్ర సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్యార్థి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యార్థి మాట్లాడుతూ 18 ఏండ్లు నిండిన తర్వాతే వివాహాలు చేసుకోవాలని అన్నారు. బాల్య వివాహాలు అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. క్లారిటీ, కన్విక్షన్, కరేజ్, కంపల్చర్ వంటి నాలుగు సి ల సూత్రంతో మందుకు వెళితే విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ కైలాస్ సత్యార్థి పిల్లలను ప్రేమించేవారని కొనియాడారు. ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ.. పిల్లల కోసం జీవితాన్ని ధారపోసిన వ్యక్తి కైలాస్ సత్యార్థి అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల కమలాకర్, కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ రైతు వ్యతిరేక పార్టీలు

- వ్యవసాయాన్ని అస్తవ్యస్తం చేశాయి: పల్లా



హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): కాంగ్రెస్, బీజేపీలు రైతు వ్యతిరేక పార్టీలని ప్రభుత్వ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. టీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్, బీజేపీల తీరుపై పల్లా ధ్వజమెత్తారు. తమ విధానాలతో వ్యవసాయ రంగాన్ని అస్తవ్యస్తం చేయటమే పనిగా ఆ పార్టీలు వ్యవహరించాయన్నారు. నలభై ఏండ్లు కాంగ్రెస్, పదేండ్ల బీజేపీ పాలనలో రైతుల కష్టాలు తొలగించేందుకు ఒక్క చర్య తీసుకున్న దాఖలాలు లేవన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో బస్సు యాత్రల పేరుతో కాంగ్రెస్ పార్టీ టీఆర్ఎస్ ప్రభుత్వంపై విషం కక్కుతుందన్నారు. బస్సు యాత్రకు స్పందనలేదని కాంగ్రెస్ నేతలే చెప్పుకుంటున్నారన్నారు. రూ.17వేల కోట్ల రుణాలను టీఆర్ఎస్ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంటును సరఫరా చేస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వం రోహిణి కార్తెకు ముందే విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచుతుందన్నారు. బీజేపీ నేతలు కల్లుతాగిన కోతుల్లా మాట్లాడుతున్నారని పల్లా విమర్శించారు. మద్దతు ధరను పెంచటంలోనూ ఎన్డీయే ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజలకు తాగు, సాగునీరు, కరెంటు ఇవ్వకుండా మోదీ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందన్నారు. స్వామినాథన్ సిఫార్సులు అమలుచేసేలా తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. మిషన్ కాకతీయ, కొత్త ప్రాజెక్టులతో కోటి ఎకరాలకు సాగునీరిస్తామని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్, బీజేపీలకు స్థానం లేదని పల్లా స్పష్టం చేశారు. బస్సు యాత్రలో భాగంగా కాంగ్రెస్ టీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలకు పాల్పడుతుందని ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, చింతా ప్రభాకర్, మండలి ప్రభుత్వ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, బోడకుంటి వెంకటేశ్వర్లు అన్నారు.

ఆన్‌లైన్‌లో రెండు తలల పాము విక్రయం

- ఇద్దరిని పట్టుకున్న అటవీశాఖ అధికారులు
- పాము స్వాధీనం, బరువు లెక్కన విక్రయాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 28(మనం ప్రతినిధి): ఆన్‌లైన్‌లో రెండు తలలపాము(రెడ్ సాండ్ బో)ను విక్రయించేందుకు యత్నించిన వారిని అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ సొసైటీ సభ్యులు ఇచ్చిన సమాచారంతో అటవీ అధికారులు శంషాబాద్ సమీపంలో ఈ ముఠాను పట్టుకున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం శాంతినగర్‌కు చెందిన ఉదయ్‌కుమార్, రమేశ్ రెండు తలల పామును అమ్ముతామంటూ ఆన్‌లైన్‌లో ఓ ప్రకటన పెట్టారు. ప్రకటనను చూసిన వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీ శాఖ యాంటీ పోచింగ్ స్క్వాడ్ అధికారులు, సంస్థ సభ్యులు రంగంలోకి దిగారు. తాము రెండు తలల పామును కొనుగోలు చేస్తామని సదరు ముఠాను సంప్రదించారు. ముఠా సభ్యులు వారిని శంషాబాద్‌లోని ఓ హోటల్‌కు రమ్మని పిలిచారు. పథకం ప్రకారం.. అటవీ అధికారులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి వద్ద ఉన్న ఓ రెండు తలల పామును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్థానిక పోలీసులకు అప్పగించారు. మహబూబ్‌నగర్ జిల్లా బండగొండ గ్రామం నుంచి ఈ పామును తీసుకొచ్చినట్టు నిందితులు చెబుతున్నారు. అధికారులు స్వాధీనం చేసుకున్న పాము రెండు కేజీల బరువు ఉంటుందని, బరువు ఆధారంగా విక్రయాలు జరుగుతున్నాయని అటవీ అధికారులు తెలిపారు. మూడు కేజీలకు పైగా ఉన్న పాములకు అతీంద్రియ శక్తులు ఉంటాయంటూ వాటిని విక్రయిస్తున్నారన్నారు. రెండు తలల పాముకు ఎలాంటి శక్తులు ఉండవని, ఆ ప్రచారాన్ని నమ్మొద్దని వన్యప్రాణి ప్రత్యేకాధికారి ఎ.శంకరన్ సూచించారు.

ఏపీలో థర్డ్ ఫ్రంట్?

రాష్ట్రంలో ప్రత్యామ్నాయం.. టీడీపీ.. వైసీపీ.. కాంగ్రెస్

- మూడు పార్టీలకు దూరం
- జనసేన పార్టీ ప్రధాన భూమిక
- పచ్చజెండా ఊపిన ఎర్రపార్టీలు
- ఇతర శక్తులతోనూ చెలిమి
- మేధావులతో జోరుగా చర్చలు



అమరావతి, ఫిబ్రవరి 28 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో మూడో ప్రత్యామ్నయ రాజకీయ కూటమి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. జనసేన, వామపక్షాలు, లోక్‌సత్తాతో పాటు దళిత బహుజన రాజకీయశక్తులన్నింటినీ ఏకం చేసి రాష్ట్రంలో థర్డ్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేసే రాజకీయవ్యూహానికి పదును పెడుతున్నట్టు తెలిసింది. ఈ ఫ్రంట్ తెలుగుదేశం, వైసీపీ, కాంగ్రెసేతర రాజకీయ శక్తిగా ఉంటుందని చెబుతున్నారు. ఇపుడు సమాలోచనల స్థాయిలో ఉన్న థర్డ్ ఫ్రంట్ ఆలోచనకు అతి త్వరలోనే రాజకీయ రూపం వస్తుందని సమాచారం. దీని కోసం వివిధ వర్గాల మేధావులు, సీనియర్ రాజకీయ నాయకులను సంప్రదిస్తూ వారి సలహాలను తీసుకుంటున్నట్టు తెలిసింది. పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలోని జనసేన థర్డ్‌ఫ్రంట్‌లో ప్రధానభూమిక పోషించనుంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పవన్ ఇమేజ్, బలం ఆధారంగా ఏర్పడే థర్డ్ ఫ్రంట్‌లో సీపీఐ, సీపీఎంలు కూడా భాగం కానున్నాయి. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఈ దిశగా తన మనసులో మాటను మంగళగిరిలో బయటపెట్టారు. సీపీఎం ఇలా చెప్పకపోయినా.. తెలంగాణలో ఆ పార్టీ అనుసరిస్తున్న రాజకీయ వ్యూహాన్ని బట్టి ఏపీలోనూ ఆ పార్టీ ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు మొగ్గుచూపే అవకాశం ఉంది. లోక్ సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ కూడా థర్డ్ ఫ్రంట్ దిశ, దశ ఎలా ఉండాలనే విషయమై పవన్‌కు తన ఆలోచనలు అందించే అవకాశం ఉందని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. కేవలం ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఏర్పడటమే కాకుండా.. విలువల్లోను, ఆచరణలోను నైతికత, నిజాయితీ, చట్టబద్ధ పరిపాలనకు హామీ ఇచ్చేలా తమ ఆలోచనలను ప్రజల ముందుంచేలా థర్డ్ ఫ్రంట్‌కు రూపకల్పన చేయాలని జేపీ సూచించే అవకాశం ఉంది. ఇలా అయితే ఎన్నికల రాజకీయాల్లో నెగ్గుకురాగలమా, లేదా అనే విషయాలపై ఆయనకు కొన్ని పరిమితులు, నిశ్చితమైన అభిప్రాయాలు ఉన్నా పవన్ ఇమేజ్‌తో వాటిని కొంత మేరకు అధిగమించగలమని జనసేన నేతలు అభిప్రాయపడుతున్నారు.

దళిత, బహుజన శక్తులతో చెలిమి

రాష్ట్రంలోని దళిత, బహుజన రాజకీయ శక్తులకు కూడా థర్డ్ ఫ్రంట్‌లో ప్రధాన భాగస్వామ్యం కల్పించేలా కార్యచరణ రూపొందించాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఈ మేరకు తిరుపతి, విజయవాడల్లో సభలు ఏర్పాటు చేసి దళిత బహుజన రాజకీయ సమాలోచనలు నిర్వహించాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఈ సమాలోచనలకు అన్ని పార్టీల్లోని దళిత బహుజన ప్రతినిధులనూ, వివిధ సంఘాల ప్రతినిధులను, రచయితలను, ప్రొఫెసర్లను, ఇతర మేధావులను కూడా ఆహ్వానించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. థర్డ్ ఫ్రంట్‌కు ఒక రూపం వచ్చాక, ప్రత్యేకించి వామపక్షపార్టీలు ఫ్రంట్‌లో భాగస్వామ్యం అయ్యేందుకు విధాన పరంగా కచ్చితమైన నిర్ణయం తీసుకున్నాకే ఈ సమాలోచనలు చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది.

ఇతర పార్టీల నుంచి వలసలు

రాష్ట్రంలో పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో థర్డ్ ఫ్రంట్ ఏర్పడితే ఇతర రాజకీయ పార్టీల నుంచి కూడా వలసలు ఉంటాయని భావిస్తున్నారు. ఎన్నికల రాజకీయాలు వేడెక్కిన తరువాత, థర్డ్ ఫ్రంట్ రాజకీయంగా కీలకభూమిక పోషిస్తుందన్న వాతావరణం బలపడ్డాక ఊపందుకోగలవని భావిస్తున్న వలసలు థర్డ్ ఫ్రంట్ జోష్‌ను పెంచుతాయని భావిస్తున్నారు. అయితే, 2009లో ప్రజారాజ్యం అనుభవాల నుంచి గుణపాఠాలు తీసుకోవటం ద్వారా నేతల చేరికపై అత్యంత మెలకువతో వ్యవహరించాలని జనసేన భావిస్తున్నట్టు తెలిసింది.

బెల్లంపల్లిలో నకిలీ విత్తనాల రాకెట్


- టాస్క్‌ఫోర్స్ దాడుల్లో ముఠా గుట్టురట్టు
- రూ.12.50 లక్షల విలువైన నకిలీ విత్తనాలు స్వాధీనం

మంచిర్యాల, ఫిబ్రవరి 28(మనం న్యూస్): బెల్లంపల్లి కేంద్రంగా నకిలీ విత్తనాల అమ్మకాలు సాగిస్తున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఈ ముఠాకు చెందిన 13 మంది సభ్యులను అదుపులోకి తీసుకొని, వారు ఉపయోగించిన వాహనాలను సీజ్ చేశారు. ఈ ముఠా సభ్యుల నుంచి రూ.12.50 లక్షల విలువైన నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు బెల్లంపల్లి పోలీసులు తెలిపారు. ఈ ముఠా సభ్యులంతా హుజురాబాద్, సుల్తానాబాద్, పెద్దపల్లి, బెల్లంపల్లి, హైదరాబాద్ ప్రాంతాలకు చెందినవారని వివరించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి 1టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏసీపీ బాలు యాదవ్, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విజయసారధి బుధవారం మీడియాకు ఈ ముఠా సభ్యుల వివరాలను వెల్లడించారు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో నకిలీ విత్తనాల విక్రయాలకు సంబంధించి నమ్మకమైన సమాచారం అందిందని తెలిపారు. దాడులు నిర్వహించగా.. నకిలీ విత్తనాల రాకెట్ బయటపడిందని అన్నారు. నగరంలోని కొత్తపల్లి శ్రీనివాస్ ఫర్టిలైజర్స్ దుకాణంలో ఈ నకిలీ విత్తనాల ప్యాకెట్లను విక్రయిస్తున్నట్లు నిందితులు బయటపెట్టారని విజయసారధి తెలిపారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని సోదాలు చేయగా.. 3.50 కిలోల విడి నకిలీ విత్తనాలు, శ్రీపావని పేరుతో ఉన్న 650 ప్యాకెట్ల(ఒక్కోటీ 450 గ్రాముల బరువు)తో పాటు రూ.2.53లక్షల నగదు, రూ.1.10 లక్షల చెక్కు, 19 సెల్‌ఫోన్లు లభ్యమయ్యాయని చెప్పారు. వీటితో పాటు 3 స్విఫ్ట్, ఒక మారుతి కార్లు, ఒక ఆటోలనూ స్వాధీనం చేసుకున్నామన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న బెల్లంపల్లి ఏసీపీ బాలుజాదవ్, తదితరులు

సెన్సెక్స్ ఫిబ్రవరి 28 2018


34,184.04 ▼-162.35



పెరిగినవి	%	తగ్గినవి	%
ఇన్ఫోసిస్	2.26	హెచ్.యు.ఎల్	-2.02
ఏసియన్ పెయింట్స్	0.52	ఐసీఐసీఐ బ్యాంకు	-1.92
ఎస్‌బిఐ	0.35	సన్ ఫార్మా	-1.75
పవర్ గ్రిడ్	0.28	ఎం అండ్ ఎం	-1.62
రిలయన్స్	0.26	యాక్సిస్ బ్యాంకు	-1.47

నిఫ్టీ ఫిబ్రవరి 28 2018

10,492.85 ▼-61.45



పెరిగినవి	%	తగ్గినవి	%
ఇన్ఫోసిస్	1.95	వేదాంత	-3.19
యు.పి.ఎల్	1.05	హెచ్.పి.సి.ఎల్	-2.90
ఐషర్ మోటార్స్	1.04	ఐసీఐసీఐ బ్యాంకు	-2.76
ఏసియన్ పెయింట్స్	0.67	హెచ్.యు.ఎల్	-2.12
బి.పి.సి.ఎల్	0.61	జీ ఎంటర్‌టైన్‌మెంట్	-1.93


టాప్ లూజర్స్ 28 ఫిబ్రవరి

34,184.04


పాయింట్లు	బి.ఎస్.ఇ సెన్సెక్స్	%
1316.35	హెచ్.యు.ఎల్	-2.02%
313.50	ఐసీఐసీఐ బ్యాంకు	-1.92%
535.35	సన్ ఫార్మా	-1.75%
727.50	ఎం అండ్ ఎం	-1.62%
529.60	యాక్సిస్ బ్యాంకు	-1.47%
322.25	యస్ బ్యాంకు	-1.47%
1319.10	లార్సెన్ టూబ్రో	-1.40%
163.25	ఎన్‌టీపీసీ	-1.36%
1880.00	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	-1.27%
370.20	టాటా మోటార్స్	-0.71%

-162.35

బులియన్ | గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్



ప్రపంచ మార్కెట్ల తీరుతో డీలా



- 162 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్
- 10,500 దిగువకు నిఫ్టీ

ముంబయి: అమెరికా ఫెడరల్ రిజర్వ్ కొత్త చైర్మన్ జిరోమ్ పావెల్ చేసిన వ్యాఖ్యలతో ద్రవ్యోల్బణంపై ఆందోళనలు మళ్ళీ తెరమీదకు రావడంతో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ) సున్నిత సూచి 'సెన్సెక్స్' బుధవారం 162.35 పాయింట్లు కోల్పోయి 34,184.04 పాయింట్ల వద్ద ముగిసింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో 2 బిలియన్ల అమెరికన్ డాలర్ల కుంభకోణం బయటపడడంతో, అటువంటివి మళ్ళీ తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవలసిందని సూచిస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంకులకు 15 రోజుల గడువు విధించింది. నిర్వహణ, టెక్నికల్ పరమైన రిస్కులను కనిపెట్టి, లొసుగులు చక్కదిద్దుకోవాలని ఆదేశించింది. యాక్సిస్ బ్యాంక్, యస్ బ్యాంక్, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్‌ల షేర్ల ధరలు బాగా తగ్గాయి. దీనికి తోడు, విదేశీ నిధులు తరలిపోవడం స్థిరంగా కొనసాగుతోంది. డాలరుతో రూపాయి మారకం విలువ 3 నెలల కనిష్ఠ స్థాయి రూ. 65.31కి పడిపోయింది. ప్రతికూల సెంటిమెంట్‌తో రూపాయి విలువ బుధవారం ఒక దశలో 44 పైసలు పతనమైంది. స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి) వివరాలు వెలువడనుండడంతో మదుపరులు ఆచితూచి వ్యవహరించారు. 'సెన్సెక్స్' బుధవారం 34,156.63 పాయింట్ల తక్కువ స్థాయి వద్ద మొదలై మరింతగా క్షీణించి 34,076.45 పాయింట్ల స్థితిని చూసింది. విదేశీ ఫండ్ల అమ్మకాల ఒత్తిడికి 'సెన్సెక్స్' కుంగి చివరకు 34,184.04 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్.ఎస్.ఇ) సూచి 'నిఫ్టీ' 10,500 పాయింట్ల దిగువకు పడిపోయి 10,461.55 పాయింట్ల కనిష్ఠ స్థితిని చూసింది. చివరకది 10,492.85 పాయింట్ల వద్ద ముగిసింది.

ప్రపంచ మార్కెట్ల ప్రభావం

ఆసియాలో ఇతర మార్కెట్లు విస్తృతమైన నష్టాలతో ముగియడం, తొలి లావాదేవీల్లో ఐరోపా మార్కెట్లు కూడా క్షీణించడంతో భారత స్టాక్ మార్కెట్లలో సెంటిమెంట్ దెబ్బతింది. వడ్డీ రేట్లలో తీవ్ర పెంపుదల గురించి అమెరికా ఫెడ్ చైర్మన్ మాట్లాడడంతో మదుపరులలో మళ్ళీ బెంబేలు మొదలై అమెరికాలో షేర్ల ధరలు తగ్గాయి. చైనా, జపాన్‌ల నుంచి వెలువడిన ఆర్థిక డాటా ఊహించిన దానికన్నా బలహీనంగా ఉండడం కూడా మదుపరుల మనోభావాలను మరింత నీరసపరచింది.

పి.ఎం.ఐ సంకేతం

భారత వస్తూత్పత్తి రంగంలో వృద్ధి ఫిబ్రవరిలో స్వల్పంగా మందగించిందని నెలవారీ సర్వే ఒకటి వెల్లడించింది. ఫ్యాక్టరీ ఉత్పత్తి, కొత్త వ్యాపార ఆర్డర్లు మందగతిన పెరిగినట్లు తెలిపింది. జనవరిలో 52.4గా ఉన్న నికాయ్ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పి.ఎం.ఐ) ఫిబ్రవరిలో 52.1కి తగ్గింది. కార్యనిర్వాహక పరిస్థితులు మితంగా మాత్రమే మెరుగుపడ్డాయని ఇది సూచిస్తోంది. ఇండెక్స్ వరుసగా ఏడవ నెలలో 50 పాయింట్లకు ఎగువన నిలవగలిగింది. యాభైకి తగ్గితే సంకోచం, యాభై, అంతకుమించి ఉంటే వ్యాకోచం చెందినట్లు లెక్క.

మూడీస్ అంచనాలు ఆశావహం

అయితే, మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్ మాత్రం 2018 క్యాలెండర్ సంవత్సరంలో భారతదేశం 7.6 శాతం చొప్పున వృద్ధి చెందగలదని, 2019లో అది 7.5 శాతంగా ఉండగలదని బుధవారం అంచనా వేసింది. పెద్ద నోట్ల రద్దు, జి.ఎస్.టి ప్రభావాల నుంచి ఆర్థిక వ్యవస్థ కోలుకుంటున్న సూచనలు కనిపిస్తున్నాయని పేర్కొంది.

కొత్త రూపు సంతరించుకున్న

కాంట్రాక్టు సేద్య బిల్లు



న్యూఢిల్లీ: మార్కెటింగ్, సర్వీసులను కూడా తీసుకురావడం ద్వారా ప్రతిపాదిత కాంట్రాక్టు సేద్య బిల్లు పరిధిని వ్యవసాయ మంత్రిత్వ శాఖ విస్తరించింది. దీనితో సేద్యపు రంగ నియంత్రణలో ప్రభుత్వ పాత్రకు కోత పడుతోంది. ప్రభుత్వం తేదలచిన కాంట్రాక్టు సేద్య బిల్లుపై జనం నుంచి అనూహ్యమైన స్పందన లభించింది. వారి అభిప్రాయాలన్నింటినీ క్రోడీకరించి పొందుపరచడం ద్వారా బిల్లు పరిధిని విస్తృతపరుస్తున్నారు. ''వ్యవసాయ రంగంతో ప్రమేయం ఉన్నవారి నుంచి వ్యక్తమైన బ్రహ్మాండమైన స్పందనను ఆధారం చేసుకుని, బిల్లులో మేం అనేక మార్పులు చేశాం. మొదటి ముసాయిదాకి, దీనికి గణనీయమైన తేడా ఉంది. అత్యంత ముఖ్యమైన మార్పు పరిధిని విస్తరించడం. ఇప్పుడిది మోడల్ కాంట్రాక్ట్ ఫార్మింగ్ అండ్ సర్వీసెస్ చట్టంగా పరిణమించింది'' అని జాతీయ వర్షాధారిత వ్యావసాయిక ప్రాధికార సంస్థ ప్రధాన కార్యనిర్వహణాధికారి అశోక్ దల్వాయ్ చెప్పారు. ఈ బిల్లును రూపొందించిన కమిటీకి ఆయనే నేతృత్వం వహించారు. బిల్లు పేరులోనే మార్పు తీసుకురావడం వల్ల స్పాన్సర్లు కేవలం ఉత్పత్తికి మాత్రమేకాక, మార్కెటింగ్, సర్వీసులకు కూడా కాంట్రాక్టులు కుదుర్చుకునే అవకాశం ఏర్పడుతోంది. సవరించిన 2018 కాంట్రాక్టు ఫార్మింగ్, సర్వీసుల చట్టంపై అభిప్రాయాలను వచ్చే వారం చివరిదాకా తెలియజేయవచ్చు. తర్వాత, ముసాయిదాను కేంద్ర మంత్రివర్గం ముందు ఉంచుతారని దల్వాయ్ చెప్పారు.

ముసాయిదా బిల్లుపై ఈ రంగంతో ప్రమేయం ఉన్న, సమాజంలోని వివిధ వర్గాలవారి నుంచి విశేష స్పందన లభించిందని ఆయన తెలిపారు. వ్యాఖ్యలు సానుకూలమైనవి, విమర్శించినవి రెండూ ఉన్నాయి. ప్రజాభిమతం తెలియడం వల్ల ఈ బిల్లు పురోగామి దృక్పథంతో తయారైందని చెప్పారు. అధికారుల పాత్రను తగ్గించడం కూడా ఈ బిల్లు తీసుకొచ్చిన మరో మార్పుగా చెబుతున్నారు. ''ప్రభుత్వ పాత్ర వెసులుబాటు కల్పించేది మాత్రమే కావడం వల్ల, బిల్లు ఒక ప్రాధికార సంస్థనుకాక, బోర్డును మాత్రమే నెలకొల్పమని కోరుతోంది. దీనిలో అధికార యంత్రాంగ ప్రమేయం తగ్గించాలని మేం కోరుకుంటున్నాం. తమలో తామే చర్చించుకుని నిర్ణయించుకునేందుకు ఈ వ్యవహారంతో ముడిపడినవారికి ఎక్కువ స్వేచ్ఛ కల్పించాలని కోరుకుంటున్నాం. స్పాన్సర్లతో కాంట్రాక్టులు కుదుర్చుకునే రైతులు, ఇతరుల ప్రయోజనాలను కాపాడడానికి మాత్రమే ప్రభుత్వ పాత్ర పరిమితమవుతుంది'' అని దల్వాయ్ చెప్పారు. సవరించిన బిల్లు వస్తువుల నోటిఫికేషన్ అవసరమని కూడా పేర్కొనడం లేదని, దాని కోసం రైతులు, కాంట్రాక్టు స్పాన్సర్లు గత ముసాయిదాలో పేర్కొన్న విధంగా కాంట్రాక్టు కుదుర్చుకోవచ్చని ఆయన తెలిపారు. ''ఆ పని చేయవలసిన అవసరం లేదు. ఏం చేయాలనుకుంటున్నారో రైతులు, ఇతర సంబంధిత వ్యక్తులనే నిర్ణయించుకోనివ్వండి. మేం ఒక నిబంధనను మాత్రం ఉంచాం. అత్యవసర సందర్భాల్లో, నిర్దిష్ట వస్తువు దేనినైనా డీనోటిఫై చేసే అవకాశాన్ని ప్రభుత్వం అట్టేబెట్టుకుంటోంది'' అని ఆయన అన్నారు.

ధరల రిస్కులు ఎదుర్కోవడం

రైతులకు ధర విషయంలో సంరక్షణ కల్పించడం, కాంట్రాక్టు సేద్యాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయిలో ఒక బోర్డు నెలకొల్పడం, కాంట్రాక్టులన్నింటినీ లీగల్‌గా రికార్డు చేసేందుకు జిల్లా, మండల స్థాయిల్లో యంత్రాంగాలు సృష్టించడం ఈ బిల్లు ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఈ చట్టానికి రాష్ట్రాల శాసన సభలు కూడా ఆమోదం తెలిపితేనే, ఆయా రాష్ట్రాల్లో ఇది చట్ట రూపం ధరిస్తుంది. 2017నాటి వ్యవసాయ ఉత్పత్తి, పశుసంపద మార్కెటింగ్ చట్టం వ్యవసాయ మార్కెటింగ్ రంగంలో పూర్తి సంస్కరణ తీసుకు వస్తుందని చెప్పారు. దాని మాదిరిగానే, ఈ చట్టం కూడా పోటీతో కూడిన మార్కెట్‌ను సృష్టించడానికి, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు రెండింటికీ సమాన పోటీ అవకాశాలు కల్పించడానికి ప్రయత్నిస్తోందని ఆయన వివరించారు. బోర్డులో మహిళా సభ్యులు కనీసం ఇద్దరు ఉండాలని కూడా సవరణ బిల్లు పేర్కొంటోంది.

ఎస్బీఐ డిపాజిట్ రేట్ల పెంపు



ముంబయి: భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్.బి.ఐ) దేశీయ రిటైల్ నియత కాల డిపాజిట్ల (కోటి రూపాయల వరకు)పై వడ్డీ రేట్లను 50 బేసిస్ పాయింట్లు పెంచినట్లు ప్రకటించింది. పెరిగిన రేట్లు బుధవారం నుంచి అమలులో కొస్తాయని చెప్పింది. భారతదేశపు అతి పెద్ద బ్యాంకే రిటైల్ డిపాజిట్ రేట్లను పెంచడంతో, ఇతర బ్యాంకులు అదే బాటపట్టవచ్చని భావిస్తున్నారు. నాలుగు మెచ్యూరిటీ (7 రోజుల నుంచి 45 రోజులు, 2 ఏళ్ళ నుంచి 3 ఏళ్ళకన్నా తక్కువ, 3 ఏళ్ళ నుంచి 5 ఏళ్ళకన్నా తక్కువ, 5 ఏళ్ళ నుంచి 10 ఏళ్ళు) విభాగాల్లో గరిష్ఠంగా 50 బేసిస్ పాయింట్లు పెంచారు. 7 రోజుల నుంచి 45 రోజుల మెచ్యూరిటీ విభాగంలో కొత్త వడ్డీ రేటు 5.75 శాతం (ఇంతకుముందు 5.25 శాతం)గా ఉంది. రెండేళ్ళకు మించి ఉన్న మూడు మెచ్యూరిటీ విభాగాల్లో కొత్త వడ్డీ రేటు 6.50 (ఇంతకుముందు 6 శాతం)గా ఉంది.

నాలుగు మెచ్యూరిటీ విభాగాల్లో (211 రోజుల నుంచి ఒక ఏడాది లోపు, ఒక ఏడాది, ఏడాది పైనుంచి 455 రోజుల వరకు, 456 రోజుల నుంచి 2 ఏళ్ళ లోపు) డిపాజిట్ రేట్లను బ్యాంక్ 15 బేసిస్ పాయింట్లు పెంచింది. ఈ మెచ్యూరిటీ విభాగాల్లో డిపాజిట్లపై కొత్త వడ్డీ రేటు ఇంతకుముందు ఉన్న 6.25 శాతం నుంచి ఇప్పుడు 6.40 శాతానికి పెరిగింది. 180 రోజుల నుంచి 210 రోజుల మెచ్యూరిటీ విభాగంలో, బ్యాంక్ ప్రస్తుతం 6.35 శాతం వడ్డీ ఇవ్వజూపుతోంది. ఇంతకుముందు అది 6.25 శాతంగా ఉంది. 46 రోజుల నుంచి 179 రోజుల మెచ్యూరిటీ విభాగంలో వడ్డీ రేటు మారకుండా 6.25 శాతం చొప్పున ఉంది.

ప్రక్షాళన జాగ్రత్తగా సాగాలి

న్యూఢిల్లీ: మోసాలను, ఉద్దేశపూర్వక ఎగవేతలను కనిపెట్టేందుకు రూ. 50 కోట్లుపైన ఉన్న ఎన్.పి.ఏ ఖాతాలన్నింటినీ శోధించవలసిందని ప్రభుత్వ రంగ బ్యాంకులను ప్రభుత్వం కోరడం ''ఎంతో అవసరమైన'' వ్యవస్థ ప్రక్షాళనకు, పారదర్శకమైన రిస్క్ మేనేజ్‌మెంట్ యంత్రాంగానికి తోడ్పడుతుందని భారత పారిశ్రామిక, వాణిజ్య మండలుల సమాఖ్య (ఫిక్కీ) బుధవారం పేర్కొంది. అయితే, ఈ పనిని ఎంతో జాగ్రత్తగా నిర్వహించాలని, దర్యాప్తుల వల్ల రుణాల మంజూరు కుంటుపడకుండా, వ్యాపార సెంటిమెంట్ బలహీనపడకుండా చూడాలని ఫిక్కీ కోరింది. రూ. 50 కోట్లకు మించి ఉన్న నిరర్థక ఆస్తుల (ఎన్.పి.ఏ) లేదా మొండి బాకీల ఖాతాలన్నింటిపైన దర్యాప్తు జరిపి మోసపోయేందుకు అవకాశం ఏదైనా ఉందేమో చూడవలసిందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రభుత్వ రంగ బ్యాంకులను ఆదేశించింది. అనుమానించిన కేసులను సి.బి.ఐ దృష్టికి తీసుకెళ్ళవలసిందని కోరింది. నగల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన సహచరులు లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్ (ఎల్‌వోయూ)ల దుర్వినియోగపరచడం ద్వారా ప్రభుత్వ యాజమాన్యంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ని రూ. 12,700 కోట్ల మేరకు మోసగించినట్లు వెల్లడవడంతో ఆర్థిక మంత్రిత్వ శాఖ నష్టనివారణ చర్యలు చేపట్టింది. మొత్తంమీద ప్రభుత్వ వ్యూహం ఎన్.పి.ఏలను పరిష్కరించడంలో, పి.ఎస్.బిలను పటిష్టపరచడంలో సహాయపడగలదని ఫిక్కీ అధ్యక్షుడు రసేశ్ షా చెప్పారు. అయితే, దీర్ఘకాలిక, బృహత్ పరిష్కారం హేతుబద్ధీకరణ, ఏకీకరణ, కొన్ని ఎంపిక చేసిన ప్రభుత్వ రంగ బ్యాంకుల ప్రైవైటీకరణలో దాగి ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

గాడినపడుతున్న జి.ఎస్.టి వసూళ్ళు



న్యూఢిల్లీ: వస్తువులు, సేవల పన్ను (జి.ఎస్.టి) ద్వారా వసూలైన మొత్తం 2018 జనవరి నెలలో రూ. 86,318 కోట్లుగా ఉండి, దాని ద్వారా చేకూరే రాబడులు స్థిరీకరణ చెందుతున్న ధోరణిని సూచించాయి. ఇది 2017 డిసెంబరులో జి.ఎస్.టి ద్వారా వసూలైన రూ. 86,703 కోట్లకు స్వల్పంగా తక్కువ మొత్తమే అయినప్పటికీ, జనవరిలో జి.ఎస్.టి.ఆర్-3బి దాఖలు చేసిన పన్ను చెల్లింపుదార్ల సంఖ్య పెరిగింది. జి.ఎస్.టిని పాటించేవారి సంఖ్య మెరుగుపడిందనడానికి ఇది సంకేతంలా నిలుస్తోంది. జనవరి నెలకుగాను ఫిబ్రవరి 25 వరకు 57.78 లక్షల జి.ఎస్.టి.ఆర్-3బి రిటర్నులు దాఖలైనట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన డాటా వెల్లడిస్తోంది. ''ఇది నెలవారీ రిటర్నులు దాఖలు చేయవలసిన మొత్తం పన్ను చెల్లింపుదార్లలో 69 శాతం కింద లెక్కకు వస్తుంది'' అని ఆ ప్రకటన తెలిపింది. ప్రస్తుతం జి.ఎస్.టి కింద 1.03 పన్ను చెల్లింపుదార్లు రిజిస్టరయ్యారు. వారిలో 16.42 లక్షల మంది కాంపొజిషన్ డీలర్లు ప్రతి మూడు నెలలకొకసారి రిటర్నులు దాఖలు చేస్తారు. మిగిలిన 87.03 లక్షల మంది నెలవారీ రిటర్నులు దాఖలు చేస్తారు.

రాష్ట్రాలవారీ డాటా పరిశీలించినప్పుడు రిజిస్టరైన పన్ను చెల్లింపుదార్లలో జి.ఎస్.టి.ఆర్-3బి రిటర్నులు అత్యధిక సంఖ్యలో పంజాబ్ (83.18 శాతం) నుంచి దాఖలవుతున్నాయి. చండీగఢ్ (77.37 శాతం), గుజరాత్ (75.17 శాతం), ఉత్తర ప్రదేశ్ (74.88 శాతం)లు ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి. అయితే, ఈశాన్య ప్రాంతం, లక్షద్వీప్, అండమాన్, నికోబార్‌లలో నెలవారీ రిటర్నుల దాఖలు పుంజుకోవాల్సి ఉంది.

జనవరిలో వసూలైన జి.ఎస్.టిలో కేంద్ర జి.ఎస్.టి (సి.జి.ఎస్.టి) రూ. 14,233 కోట్లు, రాష్ట్ర జి.ఎస్.టి (ఎస్.జి.ఎస్.టి) రూ. 19,961 కోట్లు, ఇంటెగ్రేటెడ్ జి.ఎస్.టి (ఐ.జి.ఎస్.టి) రూ. 43,794 కోట్లు మేరకు ఉంది. కానీ, ఐ.జి.ఎస్.టి నుంచి రూ. 24,806 కోట్లను కేంద్రానికి, రాష్ట్రాలకు బదలీ చేయడంతో వాటి మొత్తం రెవిన్యూ పెరిగింది. పరిహార సెస్సు కింద మరో రూ. 8,331 కోట్లు వసూలు చేశారు.


ఐ.జి.ఎస్.టి నుంచి సి.జి.ఎస్.టి ఖాతాకు రూ. 11,327 కోట్లు, ఐ.జి.ఎస్.టి నుంచి ఎస్.జి.ఎస్.టి ఖాతాకు రూ. 13,479 కోట్లు బదలీ అయినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. సి.జి.ఎస్.టి, ఎస్.జి.ఎస్.టి చెల్లింపునకు ఐ.జి.ఎస్.టి క్రెడిట్‌ను క్రాస్-యుటిలైజేషన్ చేసినందుకు లేదా రాష్ట్రాల మధ్య బి2సి లావాదేవీల కారణంగా అలా బదలీ చేసినట్లు వెల్లడించింది.

ఈ-వే బిల్లుతో మరింత రాబడి

ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్న ఈ-వే బిల్లుతో జి.ఎస్.టి వసూళ్ళు మరింత మెరుగుపడవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ''ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్న ఈ-వే బిల్లుతో, రెవిన్యూ వసూళ్ళు పెంపొందవచ్చు. అలాగే, జి.ఎస్.టిలో రిజిస్టరైన పన్ను చెల్లింపుదార్లలో సుమారు 30 శాతం మంది ఇప్పటికీ రిటర్నులు దాఖలు చేయడం లేదు. వారు రిటర్నులు దాఖలు చేసేట్లుగా ప్రభుత్వం కృషి చేయవలసి ఉంది. దానితో మొత్తంమీద జి.ఎస్.టి రెవిన్యూ వసూళ్ళు మరింత పెరిగే అవకాశం ఉంది'' అని ఇ.వై ఇండియాలో ట్యాక్స్ పార్ట్నర్ అభిషేక్ జైన్ చెప్పారు.

ఇన్‌వాయిస్ మ్యాచింగ్, రిజిస్టరుకాని డీలర్లతో జరిపే లావాదేవీలపై రివర్సు చార్జి, పరిణామక్రమ క్రెడిట్ పరిశీలన వంటి మరిన్ని ఎగవేత నిరోధక చర్యలను కూడా ప్రభుత్వం ప్రవేశపెట్టవచ్చని డెలాయిట్ ఇండియాలో సీనియర్ డైరెక్టర్ ఎం.ఎస్. మణి చెప్పారు. ''ప్రారంభ నెలల్లో హెచ్చు పన్ను రేట్ల ద్వారా రాబడులు సమకూరాయి. కనుక, వాటిని ఇప్పటివాటితో పోల్చడానికి లేదు'' అని ఆయన అన్నారు.

నగల రంగ రుణాలు రూ. 69 వేల కోట్లు



ముంబయి: వజ్రాల వర్తకుడు నీరవ్ మోదీ, గీతాంజలి జెమ్స్ ప్రమోటర్ మెహుల్ చోక్సీలు లూటీ చేసిన ధనంతో రత్నాలు, నగల రంగం నుంచి బ్యాంకుల నిరర్థక ఆస్తులు (ఎన్.పి.ఏలు) 12 శాతం నుంచి 30 శాతానికి పెరగవచ్చు. ఎలాంటి ప్రతి హామీ తీసుకోకుండానే నగల వ్యాపారి నీరవ్ మోదీ, ఆయన సహచరులు విదేశాల్లో రూ. 11,400 కోట్లు సమీకరించేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి) భరోసా పత్రాలు జారీ చేసేసింది. కుంభకోణం బయటపడ్డ తర్వాత, నీరవ్ మోదీపైన, గీతాంజలి జెమ్స్ చైర్మన్ మెహుల్ చోక్సీతో సహా ఆయన ఇతర సహచరులపైన కేంద్ర నేర పరిశోధక సంస్థ (సి.బి.ఐ) వద్ద పి. ఎన్.బి ఫిర్యాదులు దాఖలు చేసిం ది. బ్యాంకుల రంగం 2017 డిసెంబరు నాటికి రత్నాలు, నగల రంగానికి ఇచ్చిన మొత్తం రుణాలు రూ. 69,000 కోట్ల మేరకు ఉన్నాయని ఆ ఇద్దరు వ్యాపారవేత్తల వ్యాపారాలు మూతపడడాన్ని విశ్లేషిస్తూ కేర్ రేటింగ్ పేర్కొంది. వీటి నుంచి చితికిన ఆస్తులు 11.7 శాతం మేరకు ఉన్నాయని తెలిపింది. ఈ రెండు కంపెనీలు సేకరించిన మొత్తం రూ. 16,000 కోట్ల నుంచి రూ. 17,000 కోట్ల వరకు ఉంది. ఈ రంగం నుంచి స్థూల ఎన్.పి.ఏ నిష్పత్తి సుమారు 30 శాతంగా ఉండవచ్చని అది తెలిపింది.

దేశంలోని పెద్ద నగల రిటైలర్లలో గీతాంజలి జెమ్స్ ఒకటి. ఆ రెండు కంపెనీలు (గీతాంజలి, నీరవ్ మోదీ) 2017 మార్చిలో దాఖలు చేసిన సమాచారం ప్రకారం వరుసగా 648 మంది, 2,200 మంది ఉద్యోగులను పెట్టుకున్నాయి. ఈ రెండూ మూతపడడంతో 3000 మంది ఉద్యోగాలు కోల్పోతున్నారు. ఫ్రాంచైజీలలో పనిచేస్తున్న మరో 7 వేల నుంచి 8 వేల మందిపైన కూడా ప్రభావం పడనుందని కేర్ రేటింగ్ వెల్లడించింది. ఈ రెండు కంపెనీలు మూతపడడం వల్ల వజ్రాలు, నగల విదేశీ వర్తకం వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఆరు శాతం తగ్గవచ్చు.

దేశంలోకి రత్నాలు, నగల దిగుమతులు 2016 ఆర్థిక సంవత్సరంలో ఉన్న 24.3 బిలియన్ డాలర్ల నుంచి గత ఆర్థిక సంవత్సరంలో 28.8 బిలియన్ డాలర్లకు పెరిగాయి. మోదీ యాజమాన్యంలోని ఫైర్‌స్టార్ డైమండ్స్ తన రాబడిలో అధిక భాగాన్ని వజ్రాలకు సానబెట్టే విభాగం నుంచి పొందింది. వజ్రాలను స్పష్టత, రంగు, సాన, క్యారట్ అనే నాలుగు అంశాల ఆధారంగా విభజిస్తారు. ఫైర్‌స్టార్ డైమండ్స్‌కు చెందిన వజ్రాల విభజన విభాగం కొన్ని పెద్ద అంతర్జాతీయ సంస్థలకు సేవలందిస్తోంది. విలువైన రత్నాలు, వజ్రాలు పొదిగిన నగల డిజైనింగ్, తయారీ విభాగంలో కూడా కంపెనీ పనిచేసింది. కంపెనీ ముంబయి, ఢిల్లీలలో ఉన్న పెద్ద దుకాణాలతోపాటు న్యూయార్క్, బీజింగ్, హాంకాంగ్‌లలో కూడా నగల దుకాణాలు నిర్వహించింది. కంపెనీ మొత్తం రాబడిలో శాతం పరంగా చూసినప్పుడు రిటైల్ వ్యాపారం నుంచి దానికి లభించిన ఆదాయం తక్కువే. ఇక గీతాంజలి జెమ్స్ బంగారు నగల, రత్నాలు, వజ్రాలు పొదిగిన నగల దిగుమతుల, ఎగుమతుల వ్యాపారంలో ఉంది. భారతదేశంలో 200 నగరాల్లో, విదేశాల్లోని టాప్ మార్కెట్లలో అది రిటైల్ నగల వ్యాపారం నిర్వహించింది.



ఇది 'మనాలీ-లేహ్ రహదారి' విసిరే సవాల్! 470 కిలోమీటర్ల దూరం... బైక్‌పై ప్రయాణం! పేరుకే జాతీయ రహదారి. కానీ... దారి పొడవునా రాళ్లూ, రప్పలు! అవతల ఏముందో కనిపించని మలుపులు! ఒకవైపు ఎత్తైన కొండలు, మరోవైపు అంతు తెలియని లోయలు! చుట్టూ కళ్లు తిప్పుకోనివ్వని ప్రకృతి అందాలు! ఒక్క క్షణం కళ్లు పక్కకు తిప్పామంటే పట్టు జారే ప్రమాదం! ప్రతి మలుపులో ముప్పు పొంచి ఉన్న సాహసోపేత ప్రయాణం! అదే... 'మనాలీ - లేహ్ - మనాలీ' బైకింగ్! ఇది అందరికీ కాదు! కేవలం 'సత్తా' ఉన్న వారికి మాత్రమే! దుమ్ము రేపే దారిలోకి... దమ్మున్న వారికి స్వాగతం! ఒక జీవితకాలపు అనుభవం... మీ సొంతం!

ఫుల్‌గేర్‌తో రక్షణ

మనాలీ- లేహ్ రైడ్... ఒక జీవితకాలపు అనుభవం. ఈ జ్ఞాపకం 'భద్రం'గా ఉండాలంటే... తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రమాదకరమైన దారిలో బైక్ రైడ్ కాబట్టి 'ఫుల్ గేర్' తప్పదు! హెల్మెట్, రైడింగ్ జాకెట్, షూస్, మోకాలు, మోచేతుల గార్డ్స్ ధరిస్తే... పూర్తి రక్షణ ఉంటుంది. అక్కడి దాకా వెళ్లి గాయాలపాలైతే... మనతోపాటు గ్రూప్‌కూ ఇబ్బందే!

సాహసం... శ్వాస!

సాహసం శ్వాసగా సాగిపో.. అని పాట వినేందుకు, పాడుకునేందుకు బాగానే ఉంటుంది. మనాలీ-లేహ్ బైక్ రైడ్ సాహసం చేసే సత్తా ఉన్నప్పటికీ, 'శ్వాస' సమస్య మాత్రం ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఎత్తైన ప్రాంతాలకు వెళితే ఎదురయ్యే సమస్య (ఆల్టిట్యూడ్ మౌంటైన్ సిక్‌నెస్ - ఏఎంసీ) ఇది. గాలిలో ప్రాణవాయువు తగ్గడంవల్ల ఇబ్బంది తలెత్తుతుంది. 'ఎందుకొచ్చాంరా దేవుడా' అనుకునే పరిస్థితీ తలెత్తవచ్చు.

దుమ్ము లేపే జర్నీ

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన, ప్రమాదకరమైన రహదారుల్లో ఒకటి మనాలీ - లేహ్ జాతీయ రహదారి. హిమాచల్‌ప్రదేశ్‌లోని పర్యాటక పట్టణమైన మనాలీని జమ్మూ కశ్మీర్‌లోని లడఖ్ ప్రాంత 'రాజధాని' లేహ్ నగరాన్నీ కలుపుతుంది. ఈ మార్గంలో ఏడాదిలో సుమారు 8 నెలల పాటు రాకపోకలు ఉండవు. కారణం... నిండా పరుచుకున్న మంచు! ఏప్రిల్ నెలాఖరు లేదా మే మొదటివారంలో ఈ రోడ్ 'క్లియర్' అవుతుంది. వాతావరణ పరిస్థితిని బట్టి అక్టోబరు దాకా రాకపోకలు సాగుతాయి.

'జీవితంలో ఒక్కసారైనా ఈ మార్గంలో బైక్ రైడ్ చేయాలి' అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక మంది రైడర్స్ కల! హైదరాబాద్ అడ్వెంచర్స్ అండ్ ట్రెకర్స్ క్లబ్ (హ్యాట్స్) ద్వారా... 18 మందితో కూడిన సాహసికుల బృందం ఇటీవల మనాలీ - లేహ్ బైక్ రైడింగ్ యాత్రను విజయవంతంగా పూర్తి చేసింది.

రయ్.. రయ్.. రైడింగ్


మనాలీ నుంచి లేహ్ దాకా వెళ్లి అదే మార్గంలో తిరిగి రావడమా... లేక అట్నుంచి అటే కార్గిల్ మీదుగా శ్రీనగర్‌దాకా సాహస యాత్ర కొనసాగించడమా? మనకున్న సమయం, బడ్జెట్, ఇతర పరిస్థితులను బట్టి దీనిపై నిర్ణయం తీసుకోవాలి. మేం మనాలీ నుంచి లేహ్ వెళ్లి... అదే మార్గంలో తిరిగి వచ్చేశాం. అటూ ఇటూ కలిపి 940 కిలోమీటర్లు! బైక్ విషయంలోనూ అంతే!



సొంత బైక్‌పైనే రైడ్ పూర్తి చేయాలనుకుంటే చండీగఢ్ దాకా రైలులో పంపి... అక్కడి నుంచి యాత్ర మొదలుపెట్టవచ్చు. లేదా... మనాలీలో బోలెడన్ని 'బైక్ రెంటల్స్' ఉన్నాయి. ఈ రోడ్డుపై రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై వెళితేనే మజా! ఇంజన్ సీసీ, అప్పుడు ఉన్న డిమాండ్‌ను బట్టి రోజుకు రూ.1300 నుంచి 1600 వరకు అద్దె ఉంటుంది. మేం క్లాసిక్-350 కొన్ని, స్టాండర్డ్ (బుల్లెట్) 500 సీసీ కొన్ని... కాంబినేషన్‌లో రెంట్‌కు తీసుకున్నాం. ఇక రైడ్‌కు రెడీ!

దారులు... మారే రంగులు

దూరంగా మంచు టోపీలు పెట్టుకున్న కొండలు, జిల్లుమని తాకే చలిగాలి, తొలిరోజున పలకరించే పచ్చదనం, ముందుకు సాగేకొద్దీ రంగులు మార్చే కొండలు, దూరంగా మంచు నుంచి నీరై కరుగుతున్న జలపాతాలు, దాదాపు దారి పొడవునా ఏదో ఒక నదీ/సెలయేటి గలగలలు... ఒక్కముక్కలో చెప్పాలంటే చుట్టూ స్వర్గం! పూర్తిగా తిరిగేదాకా అటువైపు ఏముందో తెలియని 'గుడ్డి' మలుపులు, లోయలు, కొండలు, ఎన్‌ఫీల్డ్ టైర్లను వణికించే రాళ్లు, ఐదారు చోట్ల రోడ్డుకు అడ్డంగా పారుతూ సెలయేళ్లు, ఎత్తుకు వెళ్లేకొద్దీ తగ్గిపోయే ఆక్సిజన్ శాతం... ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇది నరకం! ఈ నరకాన్ని సాహసంతో, ఆత్మవిశ్వాసంతో సాహసోపేతంగా అధిగమిస్తూ... చుట్టూ స్వర్గంలా ఉన్న ప్రకృ తిని ఆస్వాదిస్తూ క్షేమంగా ముందుకు సాగడమే 'మనాలీ-లేహ్' బైక్ రైడ్! ప్రతి క్షణం అప్రమత్తం! ప్రతి క్షణం ఉద్వేగభరితం! దారి పొడవునా దేశ విదేశాలకు చెందిన బైకర్స్ మనకు ఎదురొస్తూ... 'థమ్సప్'తో మనల్ని ఉత్సాహపరుస్తుంటారు. క్లిష్టమైన వాతావరణంలో, కష్టమైన మార్గంలో సైకిళ్లు తొక్కుతూ సాహసిస్తున్న వారు కొత్త స్ఫూర్తిని నింపుతారు. తొలిరోజున... మనాలీ నుంచి రోహ్‌తాంగ్ పాస్ దాకా సాగే ప్రయాణం మహా థ్రిల్లింగ్‌గా ఉంటుంది. సముద్రమట్టం నుంచి 2050 మీటర్ల ఎత్తులో ఉన్న మనాలీలో మొదలయ్యే ప్రయాణం... 50 కిలోమీటర్లు పూర్తయ్యేసరికి 3978 మీటర్లకు చేరుకుంటుంది. అంటే... అటూఇటూ రెండు కిలోమీటర్లు ఎత్తుకు ఎదిగేస్తాం! అవి... మనసును గిలిగింతలు పెట్టే మలుపులు! ఈ దారిలో వచ్చే 'గులాబా' ప్రాంతం ఆకుపచ్చ స్వర్గాన్ని తలపిస్తుంది. ఈ ప్రయాణంలో రోహ్‌తాంగ్ ఒక కీలక మలుపు.



అక్కడి నుంచి ముందుకుదాటి లేహ్ వైపు వెళ్లేకొద్దీ 'సీన్' మారిపోతూ ఉంటుంది. కీలాంగ్, జిస్పా, దార్చా, సర్చూ... ఇలా ముందుకు వెళ్లేకొద్దీ పచ్చదనం తరిగిపోతూ వస్తుంది. కొండలన్నీ బోడిగా దర్శనమిస్తాయి. మట్టి, రాళ్లను కుప్పపోసినట్లుగా కనిపిస్తాయి. అయితే.. ఇక్కడే ప్రక తి తన వైచిత్రిని ప్రదర్శిస్తుంది. కొండలు రకరకాల రంగులు అద్దుకుంటాయి. పసుపు, ఎరుపు, నారింజ, లేత నీలం, నలుపు, లేత ఆకుపచ్చ... ఇలా వర్ణ శోభితం అవుతాయి. అచ్చెరువొందిస్తాయి. కొన్ని చోట్ల వింత రూపాల్లో శిలాకృతులు ఆశ్చర్యపరుస్తాయి. కాకపోతే... ఈ ప్రకృతి అందాలను ఆస్వాదించే క్రమంలో డ్రైవింగ్‌పై పట్టు తప్పితే మాత్రం అంతే సంగతులు! అందుకే... ప్రతిక్షణం అప్రమత్తం.

లేహ్‌లో సరదాలే...

లేహ్ చేరుకోగానే ఓ పనైపోదు. ఇంకా తిరగాల్సింది, చూడాల్సింది చాలా ఉంది. లేహ్ మరో పది కిలోమీటర్లు ఉండగానే.. ఒక కొండను చుట్టినట్లుగా ఉన్న బౌద్ధారామం స్వాగతం పలుకుతుంది. లేహ్‌కు ఇదే ప్రధాన ట్రేడ్ మార్క్. పురాతన (యాంటిక్) వస్తువులు, కళాకృతులు, శాలువాలు, బౌద్ధ సంబంధ వస్తువులు, పర్వతారోహణ సామగ్రి దుకాణాలకు లేహ్ ప్రసిద్ధి. షాపింగ్‌పై ఆసక్తి ఉన్న వారు లేహ్ మార్కెట్‌ను ఎంతైనా ఎక్స్‌ప్లోర్ చేయవచ్చు. ఇండియన్ నుంచి కాంటినెంటల్ వరకూ వడ్డించే హోటళ్లకు ఇక్కడ కొదవే లేదు. 'ఫుడీస్'కు పండగే పండగ! ధర అంటారా... ఐదారు నెలల్లోనే ఏడాదికి సరిపడా సంపాదించుకోవాలి కదా... రేట్ కార్డ్ కొంచెం 'హెవీ'గానే ఉంటుంది.

గుండెను తడిచేసే 'హాల్ ఆఫ్ ఫేమ్'

లేహ్ వెళ్లే దారిలో చాలాచోట్ల సైనిక శిబిరాలు కనిపిస్తాయి. ఆర్మీ వాహనాలు ఎదురవుతూనే ఉంటాయి. లేహ్ సమీపంలో 'హాల్ ఆఫ్ ఫేమ్'ను తప్పకుండా సందర్శించాలి. ఇక్కడ ప్రతిరోజూ సూర్యాస్తమయ సమయంలో పరేడ్ నిర్వహించి... జాతీయ పతాకాన్ని అవనతం చేస్తారు. 'భారత మాతాకు జై' నినాదాలతో మనసు ఉప్పొంగుతుంది. లడఖ్ రేంజ్‌లో 1947-48 యుద్ధం మొదలుకుని... కార్గిల్ వార్ దాకా, ఆ తర్వాతా జరుగుతున్న కాల్పుల్లో అమరులైన సైనికుల పేర్లు, హోదాలతో ఏర్పాటు చేసిన శిలాఫలకాలు చూస్తే ఒక్కసారిగా గుండె బరువెక్కుతుంది. 'హాల్ ఆఫ్ ఫేమ్' ఆవరణలోనే ఆర్మీ ప్రత్యేక స్టోర్ నడుపుతోంది. ఇక్కడ తక్కువ ధరలోనే కళాకృ తులు, పెన్‌స్టాండ్స్, టీ-షర్ట్స్ లభిస్తాయి. లేహ్‌కు సుమారు 30 కిలోమీటర్ల దూరంలోని 'మ్యాగ్నెటిక్ హిల్' మరో సందర్శనీయ ప్రాంతం. సమాంతరంగా ఉన్న రోడ్డుపై వాహనం నిలిపితే... అది భూమ్యాకర్షణ శక్తికి వ్యతిరేకంగా కదలడం ఇక్కడి ప్రత్యేకత.

'ఇంతకుమించి' ఇక లేదు!

ఖర్దూంగ్లా పాస్... సముద్ర మట్టం నుంచి 5327 మీటర్ల ఎత్తు! ప్రపంచంలోనే మోటారు వాహనంపై ప్రయాణించగలిగే అత్యంత ఎత్తైన రహదారి ఇదే! లేహ్ నుంచి ఇది 40 కిలోమీటర్ల దూరం. ఈ రికార్డు ఎత్తును అధిగమించేందుకే ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎందరో సాహసికులు ఉత్సాహపడతారు. సైకిల్, బైక్, కారు... వాహనం ఏదైనా సరే! అక్కడిదాకా చేరుకుని... ఖర్దూంగ్లా బోర్డు ముందు సగర్వంగా ఫొటోలు దిగుతారు. ఖర్దూంగ్లా నుంచి అలాగే 86 కిలోమీటర్లు వెళితే... నుంబ్రా వ్యాలీ. ఇది అచ్చంగా ఎడారి. రాజస్థాన్‌లో ఉన్నామా, కశ్మీర్‌లో ఉన్నామా అని ఆశ్చర్యపోక తప్పదు!

పీపుల్... ఫ్రెండ్లీ!

లడఖ్... లామాలు నడిచే నేల. అడుగడుగునా బౌద్ధ సంస్కృతి కనిపిస్తుంది. స్థానికుల్లో బౌద్ధులే అత్యధికులు. ఇక్కడి ప్రజలు శాంతి కాముకులు, స్నేహశీలురు. ఆత్మీయంగా పలకరిస్తారు. దారి పొడవునా చిన్న చిన్న హోటళ్లు ఎన్నో కనిపిస్తాయి. అక్కడే రాత్రి బస కూడా చేయవచ్చు. పర్యాటకమే ప్రధాన ఆదాయ మార్గం కాబట్టి... ఇక్కడికి వచ్చిన వారిని సొంత అతిథులుగా చూసుకుంటారు.

మురిపించే ప్యాంగాంగ్ లేక్

లేహ్ వెళ్లిన వారు తప్పక చూసేది ప్యాంగాంగ్ లేక్. లేహ్ నుంచి ఇది 160 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. రోడ్డు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిందేమీ లేదు. కానీ, మార్గమధ్యంలోని నది, రంగురంగుల గడ్డిపూలతో కూడిన లోయ అందాలు కళ్లను కట్టిపడేస్తాయి. ప్యాంగాంగ్ లేక్... భారత-చైనా సరిహద్దుల్లో ఉంటుంది. సరస్సు కొంత భాగం చైనా (టిబెట్) భూభాగంలో ఉంటుంది. ఈ సరస్సులో నీరు సూర్యుడి వెలుగులో ఒక రంగు, మబ్బు పట్టినప్పుడు మరో రంగులో అలరిస్తుంది. హిమాలయ పర్వత పాదాల చెంత వెలిసిన సరస్సు అందాలను ఎంత చూసినా తనివి తీరదు. అన్నట్లు... '3 ఇడియట్స్' సినిమా క్లైమాక్స్‌లో కనిపించే సరస్సు ఇదే! ప్యాంగాంగ్ లేక్ వెళ్లే మార్గంలో 'చాంగ్లా పాస్' వస్తుంది. ఇది ప్రపంచంలోనే మూడో అత్యంత ఎత్తైన కనుమ!

ట్రావెలింగ్ కోసం డ్రోన్‌లు

ఎంత ఖరీదైన ఫోన్ అయినా సరే, మనకు కావాల్సిన ప్రదేశాలను అన్ని యాంగిల్స్‌లో కవర్ చేయడం దానికి సాధ్యం కాదు. కానీ టెక్నాలజీ పెరిగింది. ఇప్పుడు డ్రోన్ కెమెరాలతో కూడా మనకు కావాల్సిన వాటిని టక్కున క్లిక్ కొట్టండి. ఇప్పుడు సినిమాల్లో, సీరియల్స్‌లో, యాడ్స్, వెడ్డింగ్ షూట్స్ ఇలా ఏవైనా సరే డ్రోన్ షూటింగ్ షరా మామూలైపోయింది. ట్రావెలింగ్ కోసమే ప్రత్యేకంగా డ్రోన్‌లు మార్కెట్‌లోకి వచ్చేశాయి. అలాంటిదే 'న్యూ డీజేఐ మ్యావిక్ ఎయిర్'. డ్రోన్ కెమెరా అంటే భారీగా ఊహించుకోకండి. చాలా సింపుల్ డిజైన్‌లో ఉండేట్టు ఇందులో బోల్డెన్ని ఫీచర్స్ ఉన్నాయి. సెల్ఫీ తరహాలో డ్రోనీ, అలాగే బూమరాంగ్, ఆస్టరాయిడ్ అనే విభిన్నమైన ఫీచర్స్ దీని సొంతం. ఇలా చాలా తక్కువ బరువుతో ఉంటుంది. సింపుల్‌గా ఉంటుందంటే ఏదో ప్యాంట్ ప్యాకెట్‌లో పట్టేస్తుందనుకుంటే పొరబాటే. చిన్నపాటి బ్యాగ్‌లో కచ్చితంగా ఫిట్ అవుతుంది. గంటకు సుమారు 70 కి.మీ వేగంతో 5 కి.మీ దూరాన్ని కవర్ చేయగలదు. అలాగే 20 నిమిషాల పాటు ఏకధాటిగా చిత్రీకరించే సామర్థ్యం ఈ డ్రోన్‌కు ఉంది.



ఓ కళాఖండం



జపాన్‌లోని అరషియామాలో పర్యాటకులను మైమరిపించేలా చేసే ప్రాంతం 'బాంబూ ఫారెస్ట్'. అది ఒక అడవిలా కాకుండా కళాఖండంలా కనిపిస్తుంది. ప్రకృతిసిద్ధంగా ఏర్పడిన ఇక్కడి దారుల డిజైన్ చూస్తే కచ్చితంగా ఎవరో కట్టిన..మానవ నిర్మితాలానే?. అనే అనుమానం కలగకమానదు. అచ్చం స్కేలు పెట్టి గీచినట్టు ఉండే వెదురుచెట్లు.. ఏపుగా, పచ్చగా పెరిగి ఉంటాయి. వాటి మధ్యలో కొలిచి నిర్మించినట్టు ఉండే వెదురు బొంగుల మెట్ల దారి అలా కట్టిపడేస్తుంది. ఇంకో రూట్లో వెళితే వెదురు పలకలతో నిర్మించిన రోడ్డు. దానిమీద నడుస్తుంటే ఆ ఫీలింగే గొప్పగా ఉంటుంది. వెదురు చెట్లలో కాలిబాటకు అటూ ఇటూ చిన్న వెదురు కట్టెలతో రెయిలింగ్ చూడటానికి ముచ్చటేస్తుంది. మనోహరంగా పచ్చగా ఉండే ఆ వెదురు చెట్లలో ఒక్కోచోట ఒక్కోర కమైన కాలిబాటలు వేశారు. ఒకచోట విశాలంగా వెదురు రోడ్లు, మరోచోట చిన్న కాలిబాట మెట్లతో కూడిన దారి... ఇంకో చోట రాలిన ఆకుల మామూలు కాలిబాట.. ప్రకృ తిసిద్ధంగా ఏర్పడిన రాళ్లతో కూడిన కాలిబాట... అబ్బో ఒకటేమిటి ఎన్నో అందాలు. వీటిని కనులారా చూస్తే ఆ రోజంతా ఉదయం-సాయంత్రం వాకింగ్ చేస్తూ ఉండిపోవాలనిపిస్తుంది. ఇక్కడకు వచ్చి ఫొటో దిగని పర్యాటకుడు ఉండరంటే నమ్మండి! జపాన్ టూర్లన్నీ మార్చి-నవంబరు మధ్య వెళ్లడం మంచిది.

పర్యావరణ హితంగా!



అందరూ విహారయాత్రలకు వెళతారు కానీ కొందరే పర్యావరణతో మెలుగుతారు. ఈ సారి మీరుకూడా మీవంతుగా బాధ్యతాయుతంగా పర్యటించండి. పర్యావరణానికి మేలు చేసినవారవుతారు. హోటళ్లలో పళ్లు తోముకునేటప్పుడు, షవర్ స్నానం చేసేటప్పుడు ట్యాప్ వదిలి ఉంచకండి. దీనివల్ల నీటి వృథాను అరికట్టవచ్చు. గ్లాసు నిండా నీటిని తీసుకోని కొంచెం తాగి వదిలేస్తే వృథా అవుతుంది. తగుమాత్రంగా నీటిని గ్లాస్‌లో పోసుకొని తాగండి. హోటలో సబ్బులు, దువ్వెనలను కొందరు ఒక్కసారి వాడి చెత్తబుట్టలో పారేస్తారు. దీన్ని నివారించేందుకు మీ సొంత దువ్వెన, టూత్‌పేస్ట్ లాంటి వస్తువులను తీసుకెళితే వృథాను అరికట్టవచ్చు. పేపర్లు, ప్లాస్టిక్ ఉత్పత్తులను కూడా అవసరం మేరకే వాడాలి. హోటల్ రూమ్‌లో చెత్తను చిందరవందరగా పడేయకండి. వేరు చేసి తడి, పొడి చెత్త డబ్బాల్లో వేయండి. ఆహారం వృథా చేయకండి. ప్లేట్‌లోని భోజనంలో సగం తిని సగం పడే యకండి. అలాగే భోజనం చేశాక ప్లేట్లను నిర్ణీత స్థలంలో పడవేయండి.

పిల్లలతో ప్రయాణమా?



అప్పుడప్పుడే ఇంటి వాతావరణానికి అలవాటు పడుతున్న పసిపిల్లల్ని ప్రయాణాలకు తీసుకువెళ్లడం కొద్దిగా రిస్కే. కొత్త ప్రదేశాలు, ఎప్పుడూ వినని శబ్దాలు, కొత్తగా కనిపించే మనుషులు... వీటన్నింటితో చిరాకు పడుతుంటారు. వీళ్లను ఎత్తుకొని మోస్తూ ఒకచోటి నుంచి మరోచోటుకు వెళ్లడం కూడా శ్రమతో కూడుకున్న పనే. అందుకే ఆ సమయంలో పిల్లలను ఎత్తుకోవడానికి మీతోపాటు మరొకరు ఉండేలా ప్లాన్ చేసుకుంటే టూర్‌ను చక్కగా ఎంజాయ్ చేయొచ్చు. పిల్లలతో ప్రయాణానికి బయలుదేరే ముందే పీడియాట్రీషియన్ సలహా తీసుకోవడం మంచిది. వారి ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలేవైనా ఉన్నాయేమో తెలుసుకుంటే దానికి అనుగుణంగా టూర్ ప్లాన్ చేసుకోవచ్చు. పిల్లలు నిద్రపోయే టైమ్‌కు అనుగుణంగా ప్రయాణ సమయాన్ని మార్చుకుంటే తోటి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. పిల్లలకు సంబంధించిన డైపర్స్, మందులు, బేబీ ఫుడ్, స్పూన్స్, సోప్ వంటివి విడిగా క్యారీబ్యాగ్‌లో సర్దుకుంటే వెతుక్కునే పని ఉండదు. పిల్లలు ఏడుస్తుంటే వారి ద ష్టి మళ్లించడానికి రెండు, మూడు బొమ్మలు తీసుకెళ్లడం మర్చిపోకండి. విభిన్న వాతావరణాల్లో ప్రయాణించే సందర్భంలో పిల్లలకు తేలిగ్గా, పల్చగా ఉండే దుస్తులు ఎంచుకోండి. ఎండ, చలి నుంచి కాపాడేందుకు వీలుగా ఉండే మంచి టోపీ కూడా అవసరమే. ఈ చిన్న జాగ్రత్తలు తీసుకుంటే పిల్లలు వెంట ఉన్నా మీ ప్రయాణం విసుగు పుట్టించదు.

మనం స్పోర్ట్స్
గురువారం 1 మార్చి 2018
www.manamnews.com

విమర్శకులతో వచ్చిన తిప్పలే అవి

టీమిండియా కోచ్ రవిశాస్త్రి ఎదురు దాడి



భారత్ చేరుకున్న కోహ్లి సేన



ముంబై: సౌతాఫ్రికా పర్యటనను విజయవంతంగా పూర్తి చేసుకున్న కోహ్లీ సేన బుధవారం భారత్‌కు వచ్చింది. స్వదేశానికి వచ్చీ రాగానే టీమిండియా కోచ్ రవిశాస్త్రి విమర్శకులపై ఎదురు దాడికి దిగారు. సౌతాఫ్రికాతో జరిగిన మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 1-2తో కోల్పోయిన టీమిండియా తర్వాత జరిగిన వన్డే సిరీస్‌ను 5-1తో, మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఫాఫ్ డు ప్లెసిస్ నేతృత్వంలోని సౌతాఫ్రికా జట్టు కేప్‌టౌన్, సెంచూరియన్‌లలో జరిగిన తొలి రెండు టెస్టుల్లో నెగ్గింది. అయితే 'నాసిరకం పిచ్'గా ఐసీసీ పేర్కొన్న జొహన్నెస్‌బర్గ్ టెస్టులో టీమిండియా గెలిచి ఆతిథ్య సౌతాఫ్రికాకు షాకిచ్చింది. తాము మ్యాచ్‌లు ఓడిపోయినా భారత ప్రజలు ఆనందించారని శాస్త్రి అన్నారు. 'మ్యాచ్‌లు గెలుస్తామన్న నమ్మకం మాకు ఎల్లప్పుడు ఉంటుంది. ఆ విషయాన్ని చాలా తక్కువ మంది గమనించి ఉంటారు. కానీ ఆ రెండు మ్యాచ్‌లను కూడా మేము మానసికంగా గెలిచామనుకుంటున్నాను. కొన్నిసార్లు ఓడినా ప్రజలు ఆనందిస్తారు. ఓసారి ప్రాక్టీస్ సెషన్లను గుర్తు చేసుకుంటే.. టెస్టు సిరీస్‌కు ముందు కేవలం రెండు సెషన్లు మాత్రమే జరిగాయి. దీంతో తొలి రెండు టెస్టుల్లో మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. అయితే వాటి నుంచి పాజిటివ్ సంకేతాలను తీసుకుని తదుపరి మ్యాచ్‌లో గెలిచేందుకు బరిలోకి దిగండని చెప్పాను. డ్రా కోసం కాదు.. కేవలం గెలిచేందుకు. ఆ పిచ్‌పై (జొహన్నెస్ బర్గ్) చాలా జట్లు తొలి బ్యాటింగ్ చేయలేదు. ఆది చాలా నాసిరకమైన పిచ్' అని శాస్త్రి ఓ ఆంగ్ల దిన పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు.

విమర్శకుల మాటల్లో స్థిరత్వం ఉండదు

టెస్టు సిరీస్‌లో సౌతాఫ్రికా పూర్తి స్థాయి జట్టుతో బరిలోకి దిగింది. తర్వాత వన్డే, టీ20 సిరీస్‌లకు ఫాఫ్ డు ప్లెసిస్, ఏబీ డివిలియర్స్, క్వింటన్ డి కాక్ దూరమయ్యారు. అయితే సౌతాఫ్రికా కొంత బలహీనంగా కనిపించడం టీమిండియాకు లాభమైందా? అన్న ప్రశ్నకు శాస్త్రి కాస్త



ఘాటుగానే స్పందించారు. 'మన విమర్శకులతో వచ్చిన పెద్ద చిక్కు ఇదే. మనం గెలిచినప్పుడు ప్రత్యర్థి జట్టు బాగా ఆడలేదంటారు. శ్రీలంకలో గెలిచినప్పుడు ప్రత్యర్థి జట్టు బలహీనమైందన్నారు. సౌతా ఫ్రికాలో ఆడినప్పుడు అది ఉత్తమ జట్టు కాదని చెప్పారు. ఒక విషయం మాత్రం గుర్తుంచుకోవాలి.. ఏ దేశమైనా ఉత్తమ జట్టునే బరిలోకి దింపుతుంది. మేము ఓడినప్పుడు టీమిండియా సరిగా ఆడలేదని ఒక్కరు కూడా అనలేదు. భారత దేశంలో ఏ ఒక్కరూ ఆ మాట అనలేదు. కానీ ప్రత్యర్థి జట్టు ఓడినప్పుడు మాత్రం ఆ జట్టు సరిగా ఆడలేదని అంటారు. అందులోని అంతరార్థం నాకు తెలీదు. మరో విషయమేంటంటే.. మేము ప్లేయర్స్‌తో ఆడ టం లేదు. ఒక దేశంతో ఆడుతున్నాం. మేము సౌతాఫ్రికాతో ఆడినప్పుడు ఆ జట్టులో ఎవరెవరు ఆడతాన్నది వాళ్ల సమస్య.. నాది కాదు' అని శాస్త్రి అన్నారు.

కుర్రాళ్ల శక్తికి మించి పోరాడారు

'సౌతాఫ్రికా పర్యటనలో ప్రతి రోజూ మాకు అభ్యాసమే. ఓడినప్పుడు కూడా మనం ఎంతో కొంత నేర్చుకుంటాం. అయితే కుర్రాళ్ల సవాల్‌కు ధీటుగా నిలబడి పోరాడటం నాకు నచ్చింది. శక్తికిమించి పోరాడారు. గెలిచేందుకు ఏ చిన్న అవకాశాన్ని కూడా వాళ్లు వదులుకోలేదు. కోహ్లీ సేన గొప్ప పంచ్‌ను చివరి వరకు దాచి వుంచారు. జొహన్నెస్‌బర్గ్‌లో సౌతాఫ్రికాను నాకౌట్ చేయడం నిజం అద్భుతం. ఆ తర్వాత నుంచి ప్రొటీస్ మళ్లీ కోలుకోలేదు. 1974లో ముహ్మద్ అలీకి జార్జ్ ఫోర్‌మన్‌కు జరిగిన పోరులా అనిపించింది. ఆ పోరులో జార్జ్ ఫోర్‌మన్‌ను అలీ చితగ్గొట్టి నాకౌట్ చేశాడు' అని శాస్త్రి అన్నారు.

'1996-97 నుంచి టీమిండియా ప్రతి సౌతాఫ్రికా పర్యటనలో నేనున్నాను. 25 ఏళ్ల క్రితం తొలిసారి క్రికెటర్‌గా వెళ్లాను. 2001-02లో సౌతాఫ్రికా, ఆస్ట్రేలియా సిరీస్‌లో కామెంటేటర్‌గా వ్యవహరించాను. నిజం చెప్పాలంటే సౌతాఫ్రికాకు వెళ్లినంతగా మరే దేశానికీ వెళ్లలేదు. అందుకే సౌతాఫ్రికా పర్యటన ఎంత కఠినమైందో నాకు తెలుసు. సౌతాఫ్రికాలో 21 రోజులు పోరాడిన కోహ్లీ సేనను చూసి గర్విస్తున్నాను. ఈ విషయంలో మరే టీమిండియా ఇంతటి అసాధారణ ప్రతిభ కనబరచలేదు. ప్రతి రోజూ వాళ్లకు ఒక అవకాశం. 12 మ్యాచ్‌లకు గాను ఎనిమిదింటిలో గెలిచాం. దీనిపై ఎవరైనా ఏదైనా కామెంట్ చేయగలరా? ఈ ఘనత అంతా కుర్రా ళ్లదే' అని శాస్త్రి కోహ్లీ సేనకు అండగా నిలిచారు.

పిచ్‌ల గురించి ఫిర్యాదు చేయలేం

తొలి రెండు టెస్టుల్లో టీమిండియా బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. తొలి టెస్టులో హార్దిక్ పాండ్యా ఒక్కడే 93 పరుగులు చేశాడు. రెండో టెస్టులో విరాట్ కోహ్లీ 153 పరుగులు సాధించాడు. భారత బౌలర్లకు మూడు టెస్టుల్లో సౌతాఫ్రికాకు చెందిన 60 వికెట్లు పడగొట్టారు. అయితే ఈ విషయాలను మనసులో పెట్టుకుని టీమిండియాతో ఆడేటప్పుడు తమకు అనుకూలమైన పిచ్‌లు తయారు చేస్తారేమో? అన్న ప్రశ్నకు శాస్త్రి సమాధానమిస్తూ.. 'ఆ విషయంలో నేనేమీ చెప్పలేను. పిచ్‌ల గురించి మేము ఫిర్యాదు చేయం. పిచ్‌ల స్వభావం ఎలా ఉన్నా మైదానంలోకి దిగి ఆడతాం. విదేశీ జట్లు మా దేశానికి వచ్చినా పిచ్‌ల గురించి ఎన్నడూ ప్రశ్నించలేదు. మ్యాచ్ కోసం సిద్ధం చేసిన పిచ్‌పై ఆడటం తప్ప చేసేదేమీ లేదు. మా కుర్రాళ్లు అలాగే ఆడారు. అది మైదానం నిబంధన. ఫిర్యాదులుండవు.. సాకులుండవు. ఎందుకంటే ఇరు జట్లూ ఒకే పిచ్‌పై ఆడతాయి' అని చెప్పారు. సౌతాఫ్రికా పర్యటనపై తమకు ఎటువంటి విచారం లేదని చెప్పడం నిజంగా అబద్ధం చెప్పిన్నట్టవుతుందని శాస్త్రి స్పష్టం చేశారు.

బుమ్రాను తెలివిగా వాడుకోవాలి

సెలెక్షన్ కమిటీ చైర్మన్ మ్మెస్కే ప్రసాద్



ముంబై: టీమిండియా ఫాస్ట్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా 'టెస్టు బౌలర్'గా ఎదిగాడు. ఇది సౌతాఫ్రికా పర్యటనలో భారత జట్టుకు బాగా ఉపయోగపడింది. అయితే గుజరాత్ స్పీడ్ బౌలర్ 'పని ఒత్తిడి'పై జాగ్రత్తలు తీసుకోవాలని జాతీయ సెలెక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్నారు. సౌతాఫ్రికా పర్యటనలో మూడు టెస్టు మ్యాచ్‌ల్లో 112.1 ఓవర్లతో పాటు మూడు ఫార్మాట్లలో మొత్తం 162.1 ఓవర్లు బుమ్రా బౌలింగ్ చేశాడు. 'బుమ్రా ప్రతిభపై సంతోషంగా ఉంది. రంజీ ట్రోఫీలో మాదిరిగానే సత్తా చాటుతాడని బుమ్రా సామర్థ్యంపై మాకు ఎనలేని విశ్వాసం ఉండింది. అయితే మున్ముందు అంతర్జాతీయ బిజీ షెడ్యూల్ ఉన్న నేపథ్యంలో అతని పనిఒత్తిడిపై దృష్టి పెట్టాలని భావిస్తున్నాం. అతడిని మోతాదుకు మించి ఉపయోగించకుండా తెలివిగా వాడుకోవాలి' అని ప్రసాద్ అన్నారు. అరుదైన, విభిన్నమైన బౌలింగ్ యాక్షన్ ఉన్న బుమ్రాను కీలకమైన టెస్టు సిరీస్‌కు మాత్రమే ఉపయోగించాలని చైర్మన్ సూచించారు.

కామన్వెల్త్‌లో గురితప్పదు

పతకం ఖాయమంటున్న జీతూరాయ్



న్యూఢిల్లీ: వచ్చే కామన్ వెల్త్ క్రీడల్లో గురితప్పదని, ఆసియా క్రీడల్లోనూ భారత్‌కు పతకాలు అందిస్తానని స్టార్ షూటర్ జీతూ రాయ ధీమాగా చెబుతున్నాడు. కామన్వెల్త్, ఆసియా క్రీడల షూటింగ్ పోటీల్లో జీతూరాయ్ సాధించే పతకాలపై అభిమానులు ఆశలుపెట్టుకున్నారు. అయితే ప్రతిభ ఒక్కటే సరిపోదని పతకం గెలుచుకోవాలంటే సరైన సత్తా ఉంటాలని స్టార్ షూటర్ చెబుతున్నాడు. వచ్చే కామన్‌వెల్త్ క్రీడలతో పాటు ఆసియా క్రీడలకు, వరల్డ్ చాంపియన్ షిప్‌కు సిద్ధంగా ఉన్నానని, అయితే పతకం గెలచుకునేందుకు ప్రాక్టీస్‌తో పాటుమరికొన్ని ఇతర అంశాలపైనా దృష్టిపెట్టాల్సిన అవసరముందని జీతూరాయ్ అన్నాడు. మానసికంగా, శారీరకంగా దృఢపడేందుకు మెడిటేషన్, యోగా, స్విమ్మింగ్ ప్రాక్టీస్ చేస్తున్నానని జీతూ తెలిపాడు. ప్రపంచ కప్ షూటంగిగ్‌లో అద్భుతంగా రాణించి రియో ఒలింపిక్స్‌లో ఖచ్చితంగా పతకం గెలుస్తాడుకున్న జితూ అభిమానుల నిరాశపరిచాడు. వచ్చే అంతర్జాతీయ టోర్నీల కోసం సిద్ధంగా ఉన్నానని, కామన్‌వెల్త్, ఆసియా క్రీడలతో పాటు దక్షిణకొరియాలో జరిగే షూటింగ్ ప్రపంచ చాంపియన్ షిప్‌లోనూ పతకాలు సాధించటమే లక్ష్యమని జీతూ రాయ్ తెలిపాడు. మార్చిలో మెక్సికోలో జరిగే వరల్డ్ కప్ పోటీలతో తన పతకాల వేట మొదలవుతుందని ధీమాగా చెబుతున్నాడు.

కుర్రాళ్ల సత్తాకు పరీక్ష



గవాస్కర్

ముంబై: శ్రీలంకలో వచ్చే నెలలో జరిగే ముక్కోణపు టి 20 సిరీస్‌లో ఆడే భారత జట్టుపై క్రికెట్ దిగ్గజాలతో పాటు క్రీడాభిమానుల దృష్టంతా ఉంది. ఈ టోర్నీలో ఆడే భారత జట్టులోని కుర్రాళ్ల సత్తా చూపెట్టేందుకు చక్కని అవకాశమని లెజెండ్ క్రికెటర్ సునిల్ గవాస్కర్ అన్నాడు సౌతాఫ్రికా గడ్డపై వన్డేల్లోనూ , టి. 20ల్లోనూ తిరుగులేని ఆధిక్యత కనబరిచి కొత్త చరిత్రను సృష్టించిన భారత జట్టు 2019 ప్రపంచ కప్ దిశగా అడుగులేస్తోంది. ఇప్పటి నుంచి జరిగే ప్రతి టోర్నీ భారతకు ఓ సవాల్ అని, ముఖ్యంగా కుర్రాళ్లకు పరీక్షలాంటిదని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. సౌతాఫ్రికాలో భారత జట్టు అద్భుతంగా ఆడిందని, అత్యుత్తమ జట్టుపై అసాధారణ ప్రతిభను కనబరిచిందని గవాస్కర్ ప్రశంసించాడు. టి20 ర్యాంకుల్లో నంబర్ వన్ ప్లేస్‌లో ఉన్న పాకిస్తాన్ ర్యాంకును కొల్లగొట్టాలంటే భారత్ ఇంకొన్ని రోజులు ఆగాల్సిందేనని గవాస్కర్ తెలిపాడు. శ్రీలంకలో వచ్చే వారం ప్రారంభం కానున్న నిధాస్ ట్రోఫీలో ఇప్పుడు భారత జట్టు ఆడబోతోందని, ఈ టోర్నీ ఆసక్తికరంగా జరగడం ఖాయమని గవాస్కర్ చెప్పాడు. ఈటోర్నీకి ఆతిథ్యమిస్తున్న శ్రీలంక జట్టు అద్భుతంగా రాణిస్తోన్న విషయం గుర్తుంచుకోవాలని గ వాస్కర్ సలహా ఇచ్చాడు. హతుర సింఘె కోచింగ్‌లో ఇటీవల బంగ్లాదేశ్‌లో జరిగిన టూర్‌లో శ్రీలంక కబరిచిన ఆటతీరును మిగతా జట్లు మరచిపోకూడదని, టెస్టులు, వన్డేలతో పాటు టి ట్వంటీల్లో లంక ఆటగాళ్లు సూపర్ ఫామ్‌ను ప్రదర్శించారని సన్నీ చెప్పాడు. బంగ్లాదేశ్ జట్టుకూడా అద్భుతంగా రాణిస్తోన్న విషయం గమనించాలన్న గవాస్కర్ ఇటీవలే ఆ జట్టు ఆటగాళ్లు బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో రాటుదేలారన్నాడు. అంతర్జాతీయ అటగాళ్ల సూచనల సాయంతో బంగ్లా ఆటగాళ్లు నిర్భయంగా ఆడుతున్నారని, ముఖ్యంగా టి20 ఫార్మాట్‌లో బంగ్లా జట్టు ఎలాంటి జట్టునైనా ఓడించగలిగే సత్తా ఉందని గవాస్కర్ హెచ్చరించాడు. సౌతాఫ్రికా సిరీస్‌లో ఆడివచ్చిన కొంత మంది భారత సీనియర్లకు విశ్రాంతి కల్పించి కొత్తకుర్రాళ్లకు ఈ టోర్నీలో అవకాశం కల్పించాలన్న సెలెక్టర్ల నిర్ణయం ద్వారా అంతర్జాతీయ క్రికెట్ టోర్నీలో వారు సత్తా చూపెట్టేందుకు బిసీసీఐ అవకాశం కల్పించదని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు. దేశవాళీ టోర్నీల్లో రాణించిన యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించటం ద్వారా 2019 ఐసిసి వరల్డ్ కప్ కు సెలెక్టర్లు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించారని, అప్పటిలోగా రిటైర్ అయ్యే కొంతమంది క్రికెటర్లను దృష్టిలోపెట్టుకునే ఈ ప్రయోగాలు చేస్తున్నారని గవాస్కర్ విశ్లేషణ.

శాస్త్రి 1985 వరల్డ్‌కప్ ఎత్తుగడలు వేశారు



శివరామ కృష్ణన్

న్యూఢిల్లీ: టీమిండియా కోచ్ రవిశాస్త్రి 1985 వరల్డ్ కప్ ఎత్తుగడలను అనుసరించారని మాజీ లెగ్ స్పిన్నర్ లక్ష్మణ్ శివరామకృష్ణన్ అన్నారు. సౌతాఫ్రికాతో వన్డే సిరీస్‌లో మణికట్టు స్పిన్నర్లు కనీసం ఐదు వికెట్లు తీసుకోవడంపై శివరామకృష్ణన్ పైవిధంగా స్పందించారు. '1985 టోర్నీలో నా తొలి వన్డేకు ముందు మా కెప్టెన్ సునీల్ గవాస్కర్ నన్ను, రవిశాస్త్రిని భోజనానికి బయటికి తీసుకెళ్లారు. 20 ఓవర్లలో కనీసం ఐదు వికెట్లు తీయాలని చెప్పారు. ఆ క్రమం లో 10 ఓవర్లలో 50 పరుగులిచ్చినా పట్టించుకోనని అన్నారు. మిడిల్ ఓవర్లలో నేను రెండు లేదా మూడు వికెట్లు తీయాలని గవాస్కర్ కోరారు. రవిశాస్త్రి ఇప్పుడు కోచ్‌గా అదే ఎత్తుగడను అనుసరిస్తున్నాడు' అని శివ చెప్పారు.

ఐపీఎల్‌లో డీఆర్ఎస్‌కు బీసీసీఐ గ్రీన్ సిగ్నల్



న్యూఢిల్లీ: ఎట్టకేలకు ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో డెసిషన్ రివ్యూ సిస్టమ్ (డీఆర్ఎస్)ను ఉపయోగించేందుకు బీసీసీఐ అనుమతించింది. గత కొంత కాలంగా అంతర్జాతీయ టోర్నీల్లోనూ డీఆర్ఎస్ వినియోగానికి బీసీసీఐ అనుమతించిన సంగతి తెలిసిందే. అయితే బీసీసీఐ ఈ తాజా నిర్ణయంతో ఐపీఎల్‌లో డీఆర్ఎస్ ఈ ఏడాది అరంగేట్రం చేయబోతోంది. డీఆర్ఎస్‌పై వ్యతిరేక భావంతో ఉన్న బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకోవడంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. 'ఐపీఎల్‌లో అన్నీ ఉత్తమ పద్ధతులు అనుసరిస్తున్నప్పుడు డీఆర్ఎస్ ఎందుకు ఉండకూడదు? గత ఏడాదిన్నర కాలంగా భారత్‌లో జరిగే అన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లకు డీఆర్ఎస్‌ను వినయోగిస్తున్నాం' అని బీసీసీఐ అధికారి ఒకరు చెప్పారు. ఏప్రిల్ 7వ తేదీ నుంచి ఐపీఎల్ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే.



భారత్‌కు సునాయాస డ్రా

హాకీ వరల్డ్ కప్ షెడ్యూల్ ఖరారు – పూల్-సిలో ఇండియా, బెల్జియం, కెనడా, సౌతాఫ్రికా

న్యూఢిల్లీ: పురుషుల హాకీ వరల్డ్ కప్‌లో భారత్‌కు సునాయాస డ్రా లభించింది. గ్రూస్-సిలో ఇండియాతో పాటు బెల్జియం, కెనడా, సౌతాఫ్రికా జట్లు ఉన్నాయి. ఈ టోర్నీలో ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 16వ తేదీ వరకు భువనేశ్వర్‌లో జరగనుంది. బుధవారం అంతర్జాతీయ హాకీ సమాఖ్య ఈ షెడ్యూల్‌ను ప్రకటించింది. దీని ప్రకారం నవంబర్ 28న ఇండియా తన తొలి మ్యాచ్‌లో సౌతాఫ్రికాతో, బెల్జియంతో డిసెంబర్ 2న, కెనడాతో 8వ తేదీన ఆడుతుంది. పూల్-ఎలో 2016 రియో ఒలింపిక్స్ చాంపియన్స్ అర్జెంటీనా, న్యూజిలాండ్, స్పెయిన్, ఫ్రాన్స్ జట్లు ఉన్నాయి. పూల్ దశలో కొన్ని ఆసక్తికరమైన మ్యాచ్‌లు జరగనున్నాయి. డిసెంబర్ 1వ తేదీన ప్రపంచ మాజీ చాంపియన్స్ జర్మనీ, పాకిస్థాన్ జట్లు తలపడతాయి. 4వ తేదీన ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించాలని ఇంగ్లండ్ లక్ష్యంగా పెట్టుకుంది. నవంబర్ 28 నుంచి నవంబర్ 9వ తేదీ వరకు పూల్ దశ మ్యాచ్‌లు, డిసెంబర్ 12, 13 తేదీల్లో క్వార్టర ఫైనల్స్ జరుగుతాయి. ప్రతి గ్రూప్‌లో అగ్రస్థానంలో నిలిచిన జట్టు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు క్రాస్-ఓవర్ మ్యాచ్‌లు ఆడతాయి. గెలిచిన జట్టు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంటుంది. ఈ క్రాస్ ఓవర్ మ్యాచ్‌లు డిసెంబర్ 10, 11 తేదీల్లో జరుగుతాయి. డిసెంబర్ 15న సెమీఫైనల్స్, 16వ తేదీన కాంస్య పతక పోరుతో పాటు ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది.

గ్రూప్-ఎ:అర్జెంటీనా,న్యూజిలాండ్, స్పెయిన్, ఫ్రాన్స్
గ్రూప్-బి: ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, ఐర్లాండ్, చైనా
గ్రూప్-సి: బెల్జియం, ఇండియా, కెనడా, సౌతాఫ్రికా
గ్రూప్-డి:నెదర్లాండ్స్, జర్మనీ, మలేసియా, పాకిస్థాన్.

వరల్డ్ నంబర్ వన్ నా కల



బ్యాడ్మింటన్ స్టార్ సింధు

హైదరాబాద్ : వరల్డ్ నంబర్ వన్ ర్యాంక్ సాధించటం తన కల అని బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు తెలిపింది. ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తున్నానని వివరించింది. 'ఎనిమిదేళ్ల వయసులో ఆట మొదలుపెట్టినప్పుడు భారత జట్టుకు ఆడాలనుకున్నా, ఆదే నా మొదటి లక్ష్యం, ఆ తర్వాత నంబర్ వన్ ర్యాంక్‌ను చేరుకోవాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నా.. ఇప్పుడు ఆ లక్ష్యాన్ని చేరుకునే ప్రయత్నంలో ఉన్నా, ఖచ్చితంగా లక్ష్యాన్ని చేరుకుంటా'నని తెలిపింది. హైదరాబాద్ లోని ఓ స్కూల్‌లో జరిగిన ప్రమోషన్ ఈవెంట్‌లో పాల్గొన్న సింధు విద్యార్థులుతో పలు అంశాలపై ముచ్చటించింది.

అమ్మే నాకు స్ఫూర్తి

తన తల్లే తనకు స్ఫూర్తి అని సింధు తెలిపింది. తల్లి ప్రోత్సాహంతోనే తాను రాణించగలుతున్నానని, ధైర్యంగా ఉండమని తల్లి ఎప్పుడూ ప్రోత్సహిస్తూ ఉండేదని సింధు వివరించింది. తన కెరీర్‌లో ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నానని, అయితే లక్ష్యాన్ని సాధించటంలో సవాళ్లు ఎప్పుడూ అడ్డంకి కాలేదని రియో ఒలింపిక్ స్టార్ తెలిపింది. తప్పులు సరిదిద్దుకుంటూ మరింత రాటుదేలం అన్నిటికంటే ముఖ్యమని వివరించింది. ఎన్ని విజయాలు సాధించినా నేర్చుకోవాలన్న లక్ష్యం ఉన్నత స్థితికి చేరుస్తుందని తెలిపింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం తనకెప్పుడూ ఉంటుందని, ఇద్దరూ క్రీడాకారులు కావటం తన అదృష్టమని, వారి సాయంతోనే తాను రాణించగలుగుతున్నాని తెలిపింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.